నేపాల్ కొత్త అధ్యక్షుడిగా రామ్‌చంద్ర పౌడెల్

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 217 | విజయవాడ, శుక్రవారం 10 మార్చి 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 10 March 2023 | Rs

నాల్గో టెస్ట్‌కు ముఖ్య అతిథులుగా

భారత్, ఆస్ట్రేలియా ప్రధానులు

అహ్మదాబాద్: గుజరాత్‌లోని నరేంద్ర మోడీ అంతర్జాతీయ స్టేడియంలో గురువారం నుంచి ప్రారంభమైన నాల్గో టెస్ట్‌కు ముఖ్య అతిథులుగా భారత, ఆస్ట్రేలియా ప్రధానులు నరేంద్ర మోడీ, ఆంటోనీ అల్బనీస్ హాజరయ్యారు. బిసిసిఐ ఆహ్వానం మేరకు టెస్ట్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు విచ్చేశారు. వీరిని బిసిసిఐ అధికారులు ప్రత్యేకంగా సత్కరించారు. ఇరు దేశాల మధ్య 75ఏళ్ల స్నేహానికి గుర్తుగా బిసిసిఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ.. ఆసీస్ ప్రధానికి ప్రత్యేక మెమొంటోను అందజేయగా.. బిసిసిఐ కార్యదర్శి జై షా.. భారత ప్రధాని మోడీకి జ్ఞాపికను ఇచ్చారు.

మ్యాచ్‌కు ముందు భారత జట్టు సారథి రోహిత్ శర్మకు ప్రధాని మోడీ.. ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు ఆ దేశ ప్రధాని ఆల్బనీస్ టెస్టు క్యాప్‌లు అందించారు. ఆ తర్వాత ఇరుదేశాల ప్రధానులు బంగారు పూత పూసిన గోల్ఫ్ కారులో మైదానమంతా తిరుగుతూ అభిమానులకు అభివాదం చేశారు. అనంతరం ఆటగాళ్లతో కలిసి జాతీయగీతాన్ని ఆలపించారు. టాస్ అనంతరం భారత ప్రధాని నరేంద్ర మోడీ కామెంట్రీ బాక్స్‌లో కొంతసేపు గడిపారు. టెస్ట్ ప్రారంభమయ్యాక ఉభయ ప్రధానులు కొంతసేపు ప్రత్యేక గ్యాలరీలో కూర్చుని క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు.

కోట్లాది రూపాయలు వెచ్చించి రికార్డుస్థాయిలో లక్షా 30వేల సీట్ల సామర్థ్యం గల ఈ స్టేడియంలో ఓ అంతర్జాతీయ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి.

ఇన్‌ఫ్లుయెంజా హెచ్3ఎన్2 వైరస్ వల్ల

ఎటువంటి ప్రమాదమూ లేదు

- సర్వసాధారణ దగ్గు, జలుబు లక్షణాలు
- మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరు వినోద్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇన్‌ఫ్లుయెంజా హెచ్3ఎన్2 వైరస్ సర్వసాధారణమని, ఎటువంటి ప్రమాదమూ లేదని, దగ్గు, జలుబు ఉంటే మాస్కు వాడటం, చేతులు శుభ్రం చేసుకోవడం వంటి చిన్న జాగ్రత్తలతో తగ్గిపోతుందని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం విజయవాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వైద్య నిపుణులు సుధాకర్, రఘు, నీలిమతో కలిసి ఆయన మాట్లాడారు. హెచ్3ఎన్2 అనేది డిసెంబరు, జనవరి సమయంలో సీజనల్‌గా వచ్చి పోయిందని తెలిపారు. ప్రస్తుతం ఉత్తరాంధ్రలో కేసులు వస్తున్నాయని తెలిపారు. హెచ్3ఎన్2 వైరస్ ఇన్‌ఫ్లుయెంజా అనేది ముక్కు నుండి ఊపిరితిత్తుల వరకూ ఉంటుందని అన్నారు. జనాభాలో ఇది ఎక్కువగా వ్యాపిస్తుందని, మ్యుటేషన్ సర్వసాధారణంగా ఉంటుందని తెలిపారు. జ్వరం, ముక్కుకారడం వంటి లక్షణాలు ఉంటాయని పేర్కొన్నారు. మొదటి మూడు రోజులు ఒళ్లు నొప్పులు, జ్వరం రూపంలో ప్రారంభం అవుతుందని తెలిపారు. ఐదురోజుల తరువాత 3 నుండి 5 వారాలు పొడి దగ్గు ఉంటుందని పేర్కొన్నారు. మూడు నుండి నాలుగు వారాల్లో తగ్గిపోతుందని వివరించారు. తీవ్ర రోగలక్షణాలు, చిన్న పిల్లల్లో రోగనిరోధక శక్తి ఇబ్బందులున్న వారిలో అక్కడక్కడా నిమోనియాగా మారుతోందని వివరించారు. ఆర్‌టిపిసిఆర్ ద్వారా దీన్ని గుర్తించే పనిచేస్తున్నామని, మూడు నెలల నుండి ఒక్క కోవిడ్ కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. తిరుపతి ల్యాబ్‌లో జరిపిన పరీక్షల్లో జనవరిలో 12 కేసులు, ఫిబ్రవరిలో 9 కేసులు వచ్చాయని పేర్కొన్నారు. దీనికి సాధారణ ట్రీట్‌మెంట్ కూడా పెద్దగా ఉండదని పారాసిటమాల్, దగ్గు మందులు, ఆవిరి పట్టడం ద్వారా నయం అవుతుందని తెలిపారు. జలుబు, దగ్గు, గొంతునొప్పి, ముక్కుకారడం సాధారణమని వివరించారు. ఇమ్యూనిటీ తక్కువగా ఉండేవారికి వ్యాక్సిన్ వేస్తున్నామని తెలిపారు. ఎక్కువగా ద్రవపదార్థాలు తీసుకోవాలని సూచించారు. చుట్టుపక్కల రాష్ట్రాలు, ఉత్తర భారత రాష్ట్రాల్లో ఉన్న పద్ధతులను అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. సిసిఎంబి డైరెక్టరుతోనూ దీనిపై చర్చిస్తున్నామని వివరించారు. లక్షణాలున్న వారు ప్రయాణాలు తగ్గించుకోవాలన్నారు. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో సర్వసాధారణంగా యాంటి బయాటిక్ తీసుకుంటున్నారని, వైద్యుల సలహా మేరకే మందులు తీసుకోవాలని తెలిపారు. కోవిడ్ సమయంలో ఒకేసారి వేల కేసులు వస్తాయని దాన్ని మహమ్మారి అంటారని, ఇప్పుడు వచ్చే ఇన్‌ఫ్లుయెంజా అలాంటి లక్షణాలు లేవని తెలిపారు. హెచ్ఐవి, కిడ్నీ పేషెంట్లు, వృద్ధుల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుందని, వారిలోనూ ఇన్‌ఫ్లుయెంజా లక్షణాలు రెండు మూడు వారాలు ఉండే దగ్గు మామూలు వైద్యంతో తగ్గిపోతుందని తెలిపారు. ఇప్పటి వరకూ అడ్మిషన్లు ఏమీలేవని, ఓపి చూసి పంపించేస్తున్నామని చెప్పారు. ఆయాసం, పిల్లికూతలు ఉంటే పరీక్షలు చేసి వారికి నిమోనియా ఉన్నట్లు తేలితే అడ్మిషన్ ఇస్తున్నామని చెప్పారు. వేరియంట్లు మారుతున్నందున ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లోనూ మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న వైరస్ వైద్యం తీసుకోకపోయినా అదే తగ్గిపోతుందని చెప్పారు. ఫీవర్ సర్వే కొనసాగుతుందని వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తరువాత రిక్రూట్‌మెంట్ చేపడతామని పేర్కొన్నారు. ప్రస్తుతమున్న వైరస్ వల్ల భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు.

వైసిపి ఓటమే లక్ష్యం

ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి, పిడిఎఫ్ పరస్పర సహకారం

అచ్చెన్నాయుడు, బాలసుబ్రహ్మణ్యం, రామకృష్ణ వేర్వేరు ప్రకటనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులు, ఉద్యోగుల ప్రయోజనాలను కాలరాస్తూ, సాధారణ ప్రజలపైనా దమనకాండకు దిగుతున్న అధికార వైసిపి అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా శాసన మండలి ఎన్నికల్లో పరస్పరం సహకరించుకోవాలని టిడిపి, పిడిఎఫ్ నిర్ణయించాయి. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పిడిఎఫ్ శాసనమండలి పక్షనేత వి. బాలసుబ్రహ్మణ్యం వేరువేరుగా ప్రకటనలు విడుదల చేశారు. మరో ప్రకటనలో పిడిఎఫ్‌కు మొదటి ప్రాధాన్యత, టిడిపికి రెండవ ప్రాధాన్యత ఓట్లు వేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణపిలుపునిచ్చారు. ఇప్పటికే అనేక నియోజకవర్గాల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు అనుకూలంగా వాతావరణం ఉందని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజా నిర్ణయంతో వైసిపి పరిస్థితి మరింత క్లిష్టంగా మారనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వైసిపికి ఏ ఓటు వేయవద్దు : టిడిపి

ఈ ఎన్నికల్లో వైసిపిని ఓడించడానికి తెలుగుదేశం పార్టీ పిడిఎఫ్‌కు సహకరిస్తుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

పట్టభద్ర శాసనమండలి నియోజక వర్గ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులకు రెండో ప్రాధాన్యత ఓటును వేయాలని ఆయన పిలుపునిచ్చారు. టిడిపి అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వైసిపి అభ్యర్థులకు ఏ రకమైన ఓటును వేయొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. టిడిపి నాయకులు, అభ్యర్థులు, ఓటర్లు దీనిని గమనించాలని కోరారు. రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు స్వేచ్ఛ లేకుండా చేసి ప్రజాస్వామ్యాన్ని జగన్ అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. కల్తీ మద్యం, ఇతర దౌర్జన్యాలకు పాల్పడి ముద్దాయిగా ఉన్న వ్యక్తిని తూర్పు రాయలసీమ పట్టభద్ర నియోజక వర్గ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా నిలబెట్టిందని విమర్శించారు. ఇలాంటి అరాచక శక్తులకు బుద్ధి చెప్పి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని కోరారు.

వైసిపిని ఓడిస్తేనే ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కులకు రక్షణ : పిడిఎఫ్

శాసనమండలి ఎన్నికల్లో వైసిపిని ఓడించడానికి పిడిఎఫ్‌కు సహకరిస్తామంటూ టిడిపి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మొదటి ఓటు వేయాలని, టిడిపి పట్టభద్రుల అభ్యర్థులకు రెండో ఓటు వేయాలని ఉపాధ్యాయ, పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు హుందాగా, ప్రశాంతంగా జరుగుతున్న విద్యావంతుల ఎన్నికలను అధికార పార్టీ అక్రమాలమయం చేస్తోందని విమర్శించారు. విచ్చలవిడిగా

మిగతా 2లో

11 ఏళ్ల తర్వాత ఉద్యోగం

- హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

చిన్న కేసు నమోదైన సమాచారాన్ని గోప్యంగా ఉంచారన్న కారణంగా ఎక్సైజ్ ఎస్ఐగా నియామకాన్ని రద్దు చేస్తూ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టేసింది. కోర్టు నిర్దోషిగా తేల్చినందునే ఆ కేసు వివరాల్ని దరఖాస్తులో పేర్కొనలేదన్న పిటిషనరు వాదనను ఆమోదించింది. దీంతో 11 ఏళ్ల తర్వాత పిటిషనరు విజయభాస్కర్ ఎక్సైజ్ ఎస్ఐగా నియామకానికి మార్గం సుగమమైంది. విజయభాస్కర్‌కు అనుకూలంగా గతంలో ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు సవాల్ చేసిన పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్‌తో కూడిన ధర్మాసనం కొట్టేస్తూ తీర్పు చెప్పింది. విజయభాస్కర్‌ను సదరు పోస్టులో నియమించే ప్రక్రియ చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. 2008లో ఎస్ఐ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. నెల్లూరు జిల్లాకు చెందిన విజయభాస్కర్ ఆ పోస్టుకు ఎంపికయ్యారు. నియామక ఉత్తర్వులు కూడా పొందారు. 2012లో ఆ ఉత్తర్వుల్ని అధికారులు రద్దు చేశారు. దీనిని ట్రిబ్యునల్ రద్దు చేస్తూ అదే ఏడాది తీర్పు చెప్పింది. దీనిని సవాల్ చేస్తూ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు హైకోర్టును ఆశ్రయించింది. దీనిని కొట్టేస్తూ తాజాగా ధర్మాసనం తీర్పు వెలువరించింది.

ముందు ఇడి.. తర్వాత మోడీ

- ప్రతిపక్షాలే లక్ష్యంగా బిజెపి అధికార దుర్వినియోగం
- కెసిఆర్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు విఫలయత్నం
- కేంద్రంపై ఢిల్లీలో నిప్పులు చెరిగిన కవిత
- ఏచూరితో భేటీ
- నేడు జంతర్‌మంతర్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల నేపథ్యంలో అధికారంలో లేని రాష్ట్రాల్లో మోడీ కంటే ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వస్తోందని, ఆ తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజెపి తరపున ఎన్నికల ప్రచారానికి వస్తున్నారని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో విచారణకు హాజరవ్వాలని ఇడి నోటీసులు జారీ చేసిన ఢిల్లీలో గురువారం పర్యటించిన ఆమె పలువురు నేతలతో సమావేశమయ్యారు. మహిళా బిల్లు ఆమోదంలో జాప్యాన్ని నిరసిస్తూ శుక్రవారం జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నారు. ఈ దీక్షను సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. ఇడి నోటీసులు, కవిత ఢిల్లీ పర్యటన, నిరాహార దీక్షకు తొలుత అనుమతులు ఇచ్చిన ఢిల్లీ పోలీసులు ఇడి నోటీసుల నేపథ్యంలో విరమించుకున్నారన్న కథనాలు, ఆ తర్వాత అదే ప్రాంతంలో బిజెపి మహిళా మోర్చా కార్యక్రమం జరగనుందన్న ప్రచారం..ఆ కొద్ది సేపటికి స్థలం మార్పు..మళ్లీ గురువారం సాయంత్రానికి ఢిల్లీ పోలీసులు కవిత నిరాహారదీక్షకు అనుమతివ్వడం ఈ వరుస పరిణామాలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి.

ఈ నెల 8న బుధవారం రాత్రే హైదరాబాద్ నుంచి ఢిల్లీ చేరుకున్న కవిత గురువారం ఢిల్లీలో బిజిబిజీగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బిఆర్ఎస్ ఎంపి ప్రభాకర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తొలుత ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 9న విచారణకు రావాలని ఇడి నోటీసులు ఇచ్చిందని, 11న విచారణకు తమ ఇంటికి రమ్మని తాము కోరామని ఆమె తెలిపారు. అయితే ఇడి అందుకు సమ్మతించలేదని పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థలు మహిళల ఇంటికి వెళ్లి విచారించాలని చెబుతున్నా ఇడి కనీసం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా విచారించేందుకు అంగీకరించడం లేదన్నారు. మహిళలను విచారించడంలో అనుసరించాల్సిన తీరుపై అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని కవిత తెలిపారు.

అది సాధ్యం కానందునే ఈ వేధింపులు..

తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు తీవ్ర ప్రయత్నం చేశారని, అది సాధ్యం కానందునే తనను టార్గెట్ చేశారని కవిత విమర్శించారు. ఇడి వంటి దర్యాప్తు సంస్థలతో తమ పార్టీ నేతలను వేధింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 15 మంది బిఆర్ఎస్ నేతలపై దర్యాప్తు సంస్థల దాడులు చేశాయన్నారు. మోడీ వన్ నేషన్ - వన్ ఫ్రెండ్ (అదానీ) స్కీమ్ తెచ్చారని, ప్రతిపక్షాలను టార్గెట్ చేయడమే పనిగా

మిగతా 2లో

దేశంలో కోటి మందికి పైగా వృద్ధులకు మతిమరుపు

- ఎఐ అధ్యయనంలో వెల్లడి

లోపలి పేజీలో..

5న రాములోరి కల్యాణం : టిటిడి

లోపలి పేజీలో..

జగన్ హయాంలో సంక్షేమ పథకాలు రద్దు

- చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం : లోకేష్
- 500 కిలో మీటర్లకు చేరిన యువగళం పాదయాత్ర

ప్రత్యేక గుర్తింపు

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుపై సమీక్షలో సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడలో ఏర్పాటు చేసే అంబేద్కర్ విగ్రహం ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణంపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. స్మృతివనంలో ఏర్పాటవుతున్న కన్వెన్షన్ సెంటర్ కూడా అత్యంత ప్రధానమైనదని అన్నారు. నిర్మాణంలో నాణ్యతతోపాటు సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, పనుల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సిఎం సూచించారు. స్మృతివనం ప్రాంగణంలో పనులు చురుగ్గా జరుగుతున్నాయని, అన్ని స్లాబ్‌వర్కులు ఈ నెలాఖరునాటికి పూర్తవుతాయని సిఎంకు అధికారులు తెలిపారు. విగ్రహ విడిభాగాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని, ఒక్కొక్కటి అమర్చుకుంటూ మొత్తం 13 దశల్లో

విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. విగ్రహ నిర్మాణంలో 353 మెట్రిక్ టన్నుల ఉక్కు, 112 మెట్రిక్ టన్నుల ఇత్తడి వినియోగిస్తున్నామని అధికారులు తెలిపారు. విగ్రహం తయారీతోపాటు దానిచుట్టూ సివిల్ వర్క్, సుందరీకరణ, మైదానాన్ని ప్రధాన రహదారితో అనుసంధానం చేసే పనులను అధికారులు సిఎంకు వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు కొట్టు సత్యనారాయణ, బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, సిఎస్ జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొరివితో తలగోక్కుంటున్న ఉక్రెయిన్

- రష్యా సరిహద్దు ప్రాంతాల ఆక్రమణకు యత్నం
- దీటుగా రష్యా సమాధానం

లోపలి పేజీలో..

ఒకే వ్యక్తికి 11మంది తండ్రులు!

- తిరుపతి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరో విచిత్రం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. తిరుపతిలో మొన్న ఓ మహిళకు 18 మంది భర్తలను సృష్టించి దొంగ ఓట్లను నమోదు చేశారు. తాజాగా తిరుపతిలోని 221వ పోలింగ్ బూత్ పరిధిలో కెబిలేఅవుట్ నందు 6-19-57-354 ఇంటి నంబరులో మణి అనే వ్యక్తి పేరు మీద 11 ఓట్లు నమోదయ్యాయి. ఓటర్ల జాబితాలోని 760, 763, 765, 766, 768, 769, 770, 772, 773, 775, 778 సీరియల్ నంబర్లలో ఓటరుగా 11 సార్లు నమోదు కావడమే కాకుండా, ఒక్కో నంబరు దగ్గర మణి తండ్రి పేరును 11 రకాలుగా పేర్కొన్నారు.



PS NO 221	759	C SRAVANTHI	C VENKATESWARULU	6-19-5
PS NO 221	762	D YOGANJANEYULU	D MUNESWAR NAIDU	6-19-5
PS NO 221	776	P JYOTHI	P SREENIVASULU	6-19-5
PS NO 221	767	K V DAMODARAM K V DAMODARAM	M VARADARAJULU M VARADARAJULU	6-19-5
PS NO 221	771	P NAVEEN KUMAR	P SREENIVASULU	6-19-5
PS NO 221	768	A MANI	P VENKATARAYULUSE TTY	6-19-5
PS NO 221	775	A MANI	G RAMADASS	6-19-5
PS NO 221	772	A MANI	BALAKRISHNA NAIDU C	6-19-5
PS NO 221	766	A MANI	P SATYANARAYANA	6-19-5
PS NO 221	763	A MANI	P SOMASEKHAR	6-19-5
PS NO 221	770	A MANI	U GOVINDASWAMY	6-19-5
PS NO 221	769	A MANI	L CHINNA MACHI REDDY	6-19-5
PS NO 221	778	A MANI	R J RAJARATHNAM	6-19-5
PS NO 221	765	A MANI	P KESAVAN	6-19-5
PS NO 221	773	A MANI	KOLA SUBRAMANYAM	6-19-5
PS NO 221	760	A MANI	K RAMA MURTHY	6-19-5
PS NO 221	784	M SARITHA	K VIJAYA SRIHARI	6-19-5
PS NO 221	774	M VENKATESH	M CHINNACHENGAIAH	6-19-5
PS NO 221	777	NAGA VIJAYALAKSHMI	N RAMA KOTI	6-19-5
PS NO 221	779	REDDISUNEETHAG UGGILLA	GIRI BABUR GIRI BABUR	6-19-5
PS NO 221	780	GIRI BABURASETTY GIRI BABURASETTY	REDDEPPAR REDDEPPAR	6-19-5
PS NO 221	782	VENKATA SUBBAMMAB	SEETHA RAMAIAHT SEETHA RAMAIAHT	6-19-5
PS NO 221	1018	TEJASWIn	VENKATADRI NAIDUn	6-19-5
PS NO 221	409	A SIREESHA		

సిపిఎం, సిపిఐ నాయకుల క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థి గెలుపుకోసం అప్రజాస్వామిక పద్ధతులను రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తోందని వామపక్ష నాయకులు విమర్శించారు. అధికార పార్టీ నాయకులు తప్పుడు మార్గంలో గెలవాలనుకుంటున్న వైనాన్ని పట్టభద్రులు, ఉపాధ్యాయులు అర్థం చేసుకోవాలని కోరారు.

సిపిఎస్ రద్దు చేయండి

- సిఎం మాట నిలుపుకోవాలి
- వి శ్రీనివాసరావు డిమాండ్
- సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ధర్నాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సిపిఎస్ రద్దు చేస్తామని సిఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేస్తారన్న ఆశతో గత ఎన్నికల్లో వైసిపికి ప్రభుత్వ ఉద్యోగులు అండగా నిలబడ్డారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వారిపై నిర్బంధానికి పాల్పడటాన్ని తప్పుబట్టారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో తిరుపతిలో అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించలేని పరిస్థితికి రాష్ట్ర ప్రభుత్వం దిగజారిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ పెత్తనం ఎక్కువయ్యిందని, టీచర్ల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

తిరుపతిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నాలో పాల్గొన్న వి.శ్రీనివాసరావు, పి.హరినాథరెడ్డి, తదితరులు

పి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని సిఎం చెప్పడం అన్యాయమన్నారు. వలంటీర్లు ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్నపుడు వాళ్లను ఎందుకు ఎన్నికల ప్రచారానికి వాడుకుంటున్నారని ప్రశ్నించారు.

ఒంగోలులో చీరాల గడియార స్తంభం సెంటర్ వద్ద నిరసన తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, ధనలక్ష్మి పాల్గొన్నారు. చిత్తూరులో గాంధీ విగ్రహం వద్ద ధర్నా జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు ధోరణి మానుకోవాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద, కాకినాడ జిల్లాలోని కాకినాడ రూరల్ ఇంద్రపాలెం వంతెన వద్ద ఆందోళనలు చేపట్టారు. డిఎ బకాయిలు విడుదల చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని నినదించారు. విజయనగరం జిల్లా కొత్తవలస పట్టణంలోని అంబేద్కర్ జంక్షన్‌లో నిరసన చేపట్టారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు.

గృహ రుణాలపై బరోడా బ్యాంకు ఆఫర్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన గృహ రుణ గ్రహీతలకు ఆకర్షణీయ ఆఫర్‌ను ప్రకటించింది. గృహ రుణాలపై వడ్డీ రేటును 40 బేసిస్ పాయింట్లు (0.40%) తగ్గించి 8.50గా నిర్ణయించినట్లు తెలిపింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ) రుణాలపై ప్రారంభ వడ్డీ రేటును 8.50గా ప్రకటించింది. గృహ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు వంద శాతం రద్దు చేస్తున్నామని, ఎంఎస్ఎంఇ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తున్నామని పేర్కొంది. ఈ ఆఫర్లన్నీ ఈ నెల 31 వరకే అందుబాటులో ఉంటాయని తెలిపారు. రుణ గ్రహీతల సిబిల్ స్కోర్ ఆధారంగా నూతన గృహ రుణాల జారీపైనే వడ్డీ రేటును తగ్గిస్తున్నామని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ కె ఖురానా తెలిపారు. ఎంఎస్ఎంఇలకు మద్దతును అందించే ఉద్దేశ్యంతో ఆ రంగానికి వడ్డీ రేట్లను తగ్గించామన్నారు. బిఒబి వాల్డ్ మొబైల్ బ్యాంకింగ్ యాప్ లేదా బ్యాంక్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే గృహ రుణాలకు అనుమతులిస్తున్నామని, లేదా తమ బ్యాంక్ శాఖలను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బడ్జెట్ సమావేశాలు 11 రోజులే!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వార్షిక బడ్జెట్ సమావేశాలు ఈ సారి 11 రోజులు మాత్రమే జరగనున్నాయి. ఈ నెల 14న ప్రారంభమయ్యే ఈ భేటీలు 29 వరకు జరపాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. మధ్యలో శని, ఆదివారాలు, ఉగాది సెలవు రోజులు మినహా మిగిలిన రోజుల్లో సభ జరగనుంది. 17వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టి, 18, 19 సెలవులు ప్రకటించనుంది. 25, 26 తేదీల్లో శని, ఆదివారాలు కాగా, 22న ఉగాది సందర్భంగా సెలవు రానుంది. 30న శ్రీరామనవమి సెలవు కావడంతో 29నే సమావేశాలను ముగించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ తేదీలను అధికారికంగా బిజినెస్ సలహా మండలి సమావేశంలో ఖరారు చేయాల్సి ఉంటుంది.

9 మందికి ఐపిఎస్‌లుగా పదోన్నతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర పోలీసు విభాగంలో పనిచేస్తున్న తొమ్మిది మంది సీనియర్ పోలీస్ అధికారులు ఐపిఎస్‌లుగా పదోన్నతులు పొందారు. 2020కు సంబంధించి ఇద్దరికి, 2021కు సంబంధించి ఏడుగురికి కలిపి మొత్తం తొమ్మిది మందికి పదోన్నతులు కల్పిస్తూ.. కేంద్ర హోంమంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ ఎకె శరణ్ గెజిట్ విడుదల చేశారు. 2020 జాబితాలో ఎబిటిఎస్ ఉదయరాణి, జి శ్రీకాంత్, 2021 జాబితాలో షేక్ షరీన్ బేగం, కెవి మురళీకృష్ణ, కెఎం మహేశ్వరరాజు, కె శ్రీనివాసరావు, ఎస్ శ్రీధర్, కె తిరుమలేశ్వరరెడ్డి, ఎస్‌వి మాధవరెడ్డి ఉన్నారు.

మహిళా ఉద్యోగుల కృషి అభినందనీయం

- ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆర్‌టిసి పురోగతి కోసం మహిళా ఉద్యోగుల కృషి అభినందనీయమని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. విజయవాడలోని ఆర్‌టిసి హౌస్‌లో ఆర్‌టిసి మహిళా ఉద్యోగుల ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం జరిగాయి. డిప్యూటీ సిపిఎం సామ్రాజ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొదట కేక్ కట్‌చేశారు. ఎమ్‌డి తిరుమలరావు మాట్లాడుతూ.. ఆర్‌టిసిలో 5300 మంది మహిళా ఉద్యోగులు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ఎక్కడైనా మహిళా ఉద్యోగుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విధినిర్వహణలో అంకితభావంతో పనిచేసిన పలువురు మహిళా ఉద్యోగులను ఎమ్‌డి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పి కృష్ణమోహన్, సిఎఒ రాఘవరెడ్డి, చీఫ్ ఇంజినీరు సుధాకర్, ఎడి శోభామంజరి తదితరులు పాల్గొన్నారు.

కౌంటర్ దాఖలు చేయండి: హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల్లో ఎనిమిది ప్రశ్నలకు తప్పుడు జవాబులు ఇచ్చారనే కేసులో కౌంటర్ దాఖలు చేయాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ఆదేశాలిచ్చింది. దేహదారుఢ్య పరీక్షలకు అనుమతి వ్యవహారంలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. కౌంటర్ దాఖలు చేశాకే ఆ విషయంపై తగిన ఉత్తర్వులు ఇస్తామని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ప్రకటించారు. పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రిలిమ్స్‌లో 8 ప్రశ్నలకు తప్పుడు జవాబులు నిర్ణయించిన అంశాన్ని నిపుణుల కమిటీకి నివేదించాలని, తమను దేహదారుఢ్య పరీక్షకు అనుమతించేలా రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశాలు ఇవ్వాలంటూ పలువురు వేసిన పిటిషన్‌పై విచారణను ఈ నెల 26కు హైకోర్టు వాయిదా వేసింది.

డిసిఐకి రూ.64 కోట్ల కాంట్రాక్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

సదరన్ నావల్ కమాండ్ (కొచ్చి) రూ.64 కోట్ల విలువైన ప్రతిష్టాత్మకమైన నేవల్ ఛానల్ నిర్వహణ కాంట్రాక్టును 2022-23 సంవత్సరానికిగాను డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) లిమిటెడ్‌కు అప్పగించింది. సురక్షితమైన నావిగేషనల్ ఛానెల్‌ను మరింత లోతుగా చేయడం, నిర్వహించడం ద్వారా మేజర్ పోర్టులు, మైనర్ పోర్టులు, ఇండియన్ నేవీ, ఫిషింగ్ హార్బర్లు, ఇతర సముద్ర సంస్థలకు ప్రయోజనం కలిగించే పనులను డ్రెడ్జింగ్ కార్పొరేషన్ చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజా కాంట్రాక్టును డిసిఐ దక్కించుకుంది.

ఆదిత్యున్ని తాకిన సూర్యకిరణాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం



శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యనారాయణ స్వామి మూలవిరాట్‌ను భానుని లేలేత కిరణాలు గురువారం స్పృశించాయి. ఐదు నిమిషాలపాటు సూర్య కిరణాలు ఆదిత్యుని పాదాలను తాకాయి. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు సందర్శకులు బారులుతీరారు. ఏటా మార్చి 9, 10, అక్టోబర్ 1, 2 తేదీల్లో ఆదిత్యుని మూలవిరాట్‌ను సూర్యుడి కిరణాలు తాకుతుంటాయి. శుక్రవారం కూడా ఆదిత్యుని కిరణస్పర్శ ఉంటుందని, యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా దర్శనం కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

'ఫెర్రో' మొర వినరా!

- 1 నుంచి విద్యుత్తు టారిఫ్ బాదుడు
- వేల మంది కార్మికులు వీధిన పడాల్సిందేనా?

గరివిడిలోని ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ



ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

పరిశ్రమల ఏర్పాటు కోసం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ పేరుతో భారీ అట్టహాసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం... విద్యుత్తు ఛార్జీల పెంపు ద్వారా ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల ఉసురు తీయాలని చూస్తోంది. ప్రస్తుతం ఈ పరిశ్రమల నుంచి యూనిట్ ఒక్కంటికీ రూ.5.95 చొప్పున వసూలు చేస్తోంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఏకంగా రూ.1.91 పెంచి రూ.7.86 చొప్పున వసూలు చేయనుంది. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల్లో విద్యుత్తుతే కీలక పాత్ర. ఫెర్రో ఉత్పత్తికి విద్యుత్తు ఖర్చే 35 నుంచి 70 శాతం అవుతుంది. ఈ నేపథ్యంలో విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని, విద్యుత్తు రాయితీలు ఇవ్వాలని ఈ పరిశ్రమ వర్గాలు ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం వీరు మొర వినకపోగా ఛార్జీలు భారం మోపేందుకు నిర్ణయం తీసుకుంది. విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జిఐఎస్) నిర్వహించి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఒయులను కుదుర్చుకున్నామని, దీనివల్ల వేలాది మందికి ఉద్యోగాలు వస్తాయని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి గొప్పగా ప్రకటించారు. అయితే, ఇందులో ఎన్ని పరిశ్రమలు కార్యరూపం దాలుస్తాయో? ఎన్ని ఉద్యోగాలు వస్తాయో? భవిష్యత్తులో తేలనుంది. ఫెర్రో పరిశ్రమను ఆదుకోకపోతే మాత్రం పరిశ్రమలు యాజమాన్యాలు, వాటిపై ఆధారపడిన 30 వేల కార్మిక కుటుంబాలు వీధిన పడనున్నాయి. ఇందులో వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలు చెందిన వారే 90 శాతంపైగా ఉంటారు. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ వల్ల అధికంగా విదేశీ మారక ద్రవ్యం కూడా ప్రస్తుతం సమకూరుతోంది. దీనికి కూడా గండి పడనుంది. దేశంలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఉన్న ఐదు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ 2002 నుంచి మంచి స్థానంలో ఉంది. ప్రస్తుతం ఈ పరిశ్రమను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. విద్యుత్తు టారిఫ్‌ల విషయంలో మిగతా పరిశ్రమలకు ఒక లెక్క, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమకు ఒక లెక్కగా రాష్ట్ర ప్రభుత్వం ధరలు నిర్ణయించింది. దీంతో, వచ్చే ఏప్రిల్ తర్వాత ఈ పరిశ్రమలను నడపగలమో? లేదో? అని వాటి యాజమాన్యాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి.

ఇప్పటికే అధికం... మరింత భారం

రాష్ట్రంలోని విజయనగరం జిల్లా గరివిడి, గర్భాం, విశాఖ జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఆంజనేయ, అభిజిత్, శ్రీకాకుళం, చిత్తూరు జిల్లా కాళహస్తి తదితర వెనుకబడిన ప్రాంతాల్లో 30 వరకూ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఉన్నాయి. కుటీర పరిశ్రమగా ఇది అభివృద్ధి చెందింది. గరివిడి మేజర్ ఇండస్ట్రీగా ఉండేది. ప్రభుత్వాల విధానాల ఫలితంగా ఇది కూడా బలహీన పడింది. ఒక మిలియన్ టన్ను ఉత్పత్తికి రూ.5 వేల కోట్లు లభిస్తుంది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో ఫెర్రో క్రోమ్‌కు అధిక డిమాండ్ ఉండడంతో మిగతా పరిశ్రమలతో పోల్చితే విదేశీ మారకద్రవ్యం అధికంగా సమకూరుతోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రస్తుతం మన రాష్ట్రంలోనే ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్ టారిఫ్ ధర అధికంగా ఉంది. పైగా, వచ్చే నెల నుంచి మరింత పెరిగి రూ.7.86కు చేరుకోనుంది. ఇతర రాష్ట్రాలు విద్యుత్తు ఛార్జీలు పెంచడం లేదు. ఛత్తీస్‌గఢ్‌లో రూ.4.89, పశ్చిమబెంగాల్‌లో రూ.4.75, జార్ఖండ్‌లో రూ.4.25 విద్యుత్తు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఖతర్, ఒమన్, మలేషియాల్లో యూనిట్ ధర రూ.3.00 మాత్రమే ఉంది. పెంచిన విద్యుత్తు భారంపై తమ అభ్యర్థనలు తెలిపేందుకు రాష్ట్రంలోని గరివిడి ఫేకర్ యజమాని షరాఫ్ సహా పలు యాజమాన్యాలు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలవాలని ఇటీవల ప్రయత్నించినా ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదని సమాచారం.

ధాన్యం సేకరణ లక్ష్యం పెంపు

- అరకొరగా కొనుగోళ్లకు నిర్ణయం
- ఐదు జిల్లాల్లో 2.59 లక్షల టన్నులకు ప్రభుత్వం అనుమతి

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

ధాన్యం సేకరణ లక్ష్యాన్ని ప్రభుత్వం ఎట్టకేలకు పెంచింది. అయితే, అధికార యంత్రాంగం పంపిన ప్రతిపాదనలకు అనుగుణంగా కాకుండా అరకొరగానే సేకరణ లక్ష్యాన్ని నిర్దేశించింది. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో మరో 2.59 లక్షల టన్నుల ధాన్యాన్ని అదనంగా సేకరించాలని నిర్ణయించింది. లక్ష్యం పూర్తయిందనే కారణంతో ప్రభుత్వం వారం రోజులుగా కృష్ణా జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం సేకరణను నిలిపివేసింది. దీంతో, రైతుల వద్ద మిగిలిపోయిన ధాన్యాన్ని సేకరించాలంటూ రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు అందించారు. పలు ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించారు. 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలోనూ అధికార పార్టీ ప్రజాప్రతినిధుల వద్ద రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ నేపథ్యంలోనే కృష్ణా జిల్లా గుడివాడ, మచిలీపట్నం, అవనిగడ్డ ఎంఎల్‌ఎలు ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని కలిసి ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. రైతుల నుంచి వస్తోన్న ఒత్తిడిని గ్రహించిన ప్రభుత్వం తాజాగా లక్ష్యాన్ని పెంచింది. కృష్ణా జిల్లాలో పది లక్షల టన్నుల దిగుబడి రాగా, ఇందులో 5.06 లక్షల టన్నులను మాత్రమే ప్రభుత్వం సేకరించింది. మరో రెండు లక్షల టన్నుల మేర బిపిటి (కర్నూలు సోనా)లను బహిరంగ మార్కెట్లో అమ్ముకునేందుకు రైతులకు వెసులుబాటు కల్పించింది. 1.26 లక్షల టన్నుల ధాన్యాన్ని స్థానిక అవసరాలకు ఉపయోగిస్తారు. ఈ నేపథ్యంలో ఇంకా 1.68 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అవకాశం కల్పించాలని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక పంపింది. ప్రభుత్వం 94 వేల టన్నులు మాత్రమే అదనంగా కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చింది. మిగిలిన జిల్లాల్లోనూ ఆయా జిల్లా యంత్రాంగాలు పంపిన నివేదికలకూ, అనుమతి ఇచ్చిన అదనపు లక్ష్యానికి పొంతన లేదని సమాచారం. దీంతో, ఆర్‌బికెల ద్వారా ధాన్యం సేకరణ ప్రారంభించినా మళ్లీ కొద్ది రోజులకే కొనుగోళ్లు నిలిచిపోయే అవకాశం ఉంది.

అదనంగా నిర్దేశించిన ధాన్యం సేకరణ లక్ష్యం

జిల్లా పేరు	టన్నులు
కృష్ణా	94 వేలు
శ్రీకాకుళం	40 వేలు
విజయనగరం	40 వేలు
పశ్చిమగోదావరి	30 వేలు
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ	30 వేలు
కాకినాడ	25 వేలు
మొత్తం	259 వేలు

5 వరకు నల్లబ్యాడ్జీలతో నిరసనలు

- ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను మరోమారు మోసం చేసిందని ఎపి జెఎసి అమరావతి పేర్కొంది. ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం ఇచ్చిన లిఖిత పూర్వక హామీల్లో ఎక్కడా స్పష్టత లేదని తెలిపింది. తమ ఉద్యమం కొనసాగుతుందని, ఏప్రిల్ 5 వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొంది. విజయవాడలో జరిగిన ఎపి జెఎసి అమరావతి అత్యవసర కార్యవర్గం తీర్మానాలను జెఎసి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు గురువారం మీడియాకు వివరించారు. ఉద్యోగుల డబ్బును రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకుందని, నెలాఖరులోపు చెల్లిస్తామని చెబుతుందని, డిఎ, ఎరియర్స్ ఎంత అనే అంశాలపై స్పష్టత లేదని అన్నారు. పిఆర్‌సి ఒప్పందాలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి పే స్కేల్ గురించి స్పష్టత ఇవ్వకుండా మొక్కుబడిగా చర్చలకు పిలిచారని తెలిపారు. రిటైర్డు అయిన వారికి బెనిఫిట్స్ అందని పరిస్థితి ఉందన్నారు. వేతనాలు ప్రతినెలా ఒకటో తారీఖున ఇవ్వడం సాధ్యపడదని ప్రభుత్వం అంటోందన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు సంబంధించి రూ.2,600 కోట్లు చెల్లించలేదని చెప్పారు. సిపిఎస్ రద్దు మినహా మరే ప్రత్యామ్నాయాన్ని అంగీకరించలేమని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేశారని, అందుకే కార్యాచరణ అమలుకు తీర్మానించామని తెలిపారు. ఈ నెల 17, 23 తేదీల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యమానికి మద్దతును కూడగట్టే చేయిచేయి కలుపుదాం అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. 21 నుంచి ఏప్రిల్ 5 వరకు వర్క్ టు రూల్‌ను కొనసాగిస్తామని అన్నారు. ఈ నెల 27న కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులను కలిసే కార్యక్రమం చేపడతామన్నారు. అప్పటికీ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఏప్రిల్ 5న మరోసారి ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కార్యవర్గం సమావేశమై తదుపరి ఉద్యమ కార్యాచరణ రూపొందించనుందని తెలిపారు.

పట్టభద్రుల ఓటర్లలో 30 శాతం బోగస్

- ఎన్నికల సంఘానికి 'వర్ల' ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనమండలి పట్టభద్ర నియోజకవర్గ ఓటర్లలో 30 శాతం బోగస్ ఓటర్లు ఉన్నారని రాష్ట్ర ఎన్నికల సంఘానికి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. న్యాయవాది వజ్జా శ్రీనివాస్‌తో కలిసి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనాను గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వర్ల మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి వేల సంఖ్యలో బోగస్ ఓట్లు చేర్చి ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తోందని విమర్శించారు. పట్టభద్రుల ఓటర్ లిస్టులో 30 శాతం బోగస్ ఓట్లేనని తెలిపారు. పదో తరగతి చదవని వారిని కూడా గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేశారని పేర్కొన్నారు. ఒకే ఇంటి అడ్రస్‌తో 44 ఓట్లు, వైసిపి కార్యాలయం అడ్రస్‌తో 38 ఓట్లు ఉన్నాయని వివరించారు. తిరుపతిలోనే 7 వేల బోగస్ ఓట్లు ఉన్నాయని తెలిపారు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ప్రజాస్వామ్యాన్ని ఇంకెవరు కాపాడతారని ప్రశ్నించారు. తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బోగస్ ఓట్లు ప్రక్రియ సాగుతోందని విమర్శించారు. భూమన కరుణాకర్ రెడ్డి చెప్పినట్లు తిరుపతి ఎస్‌పి బోగస్ ఓట్లకు సహకరిస్తున్నారని తెలిపారు. వీటిపై ఆధారాలతో సహా ఎన్నికల సంఘం ప్రధాన అధికారికి అందజేశామన్నారు. వీటిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. రెండు రోజుల్లో పోలీసులు, రిటర్నింగ్ అధికారులతో నివేదిక తెప్పించుకుని విచారణ చేపడతామని ముకేష్ కుమార్ మీనా హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మహిళా అధికార ప్రతినిధి కంభంపాటి శిరీష, ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు కోడూరి అనిల్, నాయకులు బి నాగరాజు, రాంబాబు, సురేష్ తదితరులు ఉన్నారు.

ముందు ఇడి.. తర్వాత మోడీ

(మొదటిపేజి తరువాయి)

పెట్టుకున్నారని ఆమె నిప్పులు చెరిగారు. ఇప్పటికైనా వేధింపులు మానుకుని దేశం ఎదుర్కొంటున్న అధిక ధరలు, నిరుద్యోగం వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నం చేయాలని హితవు పలికారు. మోడీ ఎన్ని కుట్రలు చేసినా ధర్మం, సత్యం గెలుస్తుందని పేర్కొన్నారు.

కోల్డ్ స్టోరేజ్‌లో మహిళా బిల్లు

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లు కోసం 27 ఏళ్లుగా పోరాటం జరుగుతోందని కవిత తెలిపారు. 2014, 2018 మహిళా బిల్లుపై బిజెపి మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారని, కానీ ఆ వాగ్దానం విస్మరించి మహిళా బిల్లును కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టేశారని విమర్శించారు. పూర్తి మెజార్టీతో గెలిపించినా మహిళా బిల్లుపై బిజెపి మాట తప్పిందని, మహిళా బిల్లుపై రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని ఆమె కోరారు. ఈ బిల్లు తేవడంలో సోనియా పాత్ర అమోఘమని, 2010లో ఆమె చొరవతోనే రాజ్యసభలో ఆమోదం పొందిందని గుర్తు చేశారు.

జంతర్‌మంతర్‌లో నేడు నిరాహార దీక్ష

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం శుక్రవారం నాడు ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు కవిత తెలిపారు. ఈ ఆందోళనలో 18 పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని చెప్పారు. ఈ నిరాహార దీక్షను ఉదయం 10 గంటలకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభిస్తారని, ఇందులో శివసేన పార్టీకి చెందిన ప్రియాంక చతుర్వేది, ఇతర నేతలు హాజరవుతారని చెప్పారు.

తనతో పాటు దాదాపు 500 మంది నిరహార దీక్ష చేపడుతారని పేర్కొన్నారు. బిఆర్ఎస్, టిఎంసి, జెడియు, ఆర్జెడి, సమాజ్ వాదీ పార్టీ, సిపిఐ, సిపిఎం, డిఎంకె, ఎన్సీపి, శివసేన, ఆప్, ఆర్ఎల్డి, జెఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి, అకాలీదళ్ పార్టీ ప్రతినిధులు సంఘీభావంగా పాల్గొంటారన్నారు. అలాగే 29 రాష్ట్రాలకు చెందిన మహిళ హక్కుల పోరాట సంస్థల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. సుమారు 6 వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొనేవీలుందన్నారు. ఈ దీక్షలో పాల్గొనేందుకు తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి ఇప్పటికే పెద్ద సంఖ్యలో మహిళలు ఢిల్లీ చేరుకున్నారు.

ఏచూరితో కవిత భేటీ

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిని గురువారం ఎమ్మెల్సీ కవిత భేటి అయ్యారు. సిపిఎం కేంద్ర కార్యాలయంలో ఈ భేటి జరిగింది. మహిళ రిజర్వేషన్ల సాధన కోసం చేపట్టే దీక్షపై దాదాపు అరగంటకు పైగా ఇరువురు చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... సీతారాం ఏచూరిని దీక్షకు ఆహ్వానించామని తెలిపారు. 1996లో అప్పటి ప్రధాని దేవగౌడ మహిళ రిజర్వేషన్ల బిల్లు కోసం ప్రయత్నం చేశారని చెప్పారు. అనంతరం ప్రతి ప్రధాని అనేక రకాలుగా ప్రయత్నాలు చేసారన్నారు. కానీ ప్రస్తుత ప్రధాని మోడీ మాత్రం మహిళ రిజర్వేషన్ల బిల్లు తెచ్చే ఆలోచన కూడా చేయడం లేదన్నారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో బిల్లు పెట్టుకునేందుకు వీలున్నా మోడీ సర్కార్ తేల్చడం లేదన్నారు. అందుకనే నిరాహార దీక్ష చేపట్టి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. 131 ఫైనాన్స్ బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించుకుందని, జిఎస్టి, ట్రిపుల్ తలాక్ బిల్లు, పౌరసత్వ సవరణ బిల్లు ఇలాంటి బిల్లులను గంటలలో చర్చలు లేకుండా ఆమోదించారని అన్నారు. కానీ మహిళా బిల్లును మాత్రం అటకెక్కించారని వాపోయారు. దేశానికి, ప్రజాస్వామ్య బలోపేతానికి మహిళా బిల్లు ఉపయోగకరమైందని కవిత పేర్కొన్నారు.

వైసిపి ఓటమే లక్ష్యం

(మొదటిపేజి తరువాయి)

దొంగ ఓట్లు చేర్చడం, నిరంకుశంగా అధికారులను బదిలీ చేయడం, మంత్రులు, ఎమ్మెల్యేలను బరిలోకి దించి ఓటర్లను భయభ్రాంతుల్ని చేసి మొత్తం ఎన్నికల స్వభావాన్నే మార్చే దుర్మార్గానికి పూనుకుంటోందని విమర్శించారు. ఎన్నికల వేళ ఇంకెన్ని దౌర్జన్యాలకు సిద్ధపడుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి కూడా తనను గట్టెక్కించలేవన్న భయంతో విచ్చలవిడిగా విద్యావంతుల్ని కూడా కొనేందుకు డబ్బు కుమ్మరిస్తోందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గం పట్ల ప్రభుత్వం ఎన్నడూ లేని అణచివేత వైఖరిని ప్రదర్శిస్తోందని పేర్కొన్నారు. ఏ ఒక్క సమస్య పరిష్కరించకపోగా వారి ప్రజాస్వామిక హక్కులన్నింటినీ నిస్సిగ్గుగా కాలరాస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయుల గొంతును బలంగా వినిపించే పిడిఎఫ్ అభ్యర్థులను అడ్డుకునేందుకు అన్ని కుయుక్తులూ పన్నుతోందని మండిపడ్డారు. ఈ దశలో వైసిపి అభ్యర్థుల్ని ఓడించడం ద్వారా మాత్రమే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గ ప్రజాస్వామిక హక్కుల్ని కాపాడుకోగలమని తెలిపారు. పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న ఉత్తరాంధ్ర, తూర్పు రాయలసీమ, పశ్చిమ రాయలసీమ నియోజక వర్గాల పిడిఎఫ్ అభ్యర్థులు కోరెడ్ల రమాప్రభ, మీగడ వెంకటేశ్వరరెడ్డి, పి నాగరాజు, తూర్పు రాయలసీమ, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజక వర్గాల పిడిఎఫ్ అభ్యర్థులు పి బాబురెడ్డి, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

విద్యావంతులు విజ్ఞత ప్రదర్శించండి : సిపిఐ

రాష్ట్రంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి నియోజక వర్గ స్థానాలకు జరుగనున్న ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటును, టిడిపి అభ్యర్థులకు రెండో ప్రాధాన్యత ఓటు వేయడం ద్వారా వైసిపిని ఓడించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పిలుపునిచ్చారు.

ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామిక విలువలు అంతరించిపోతున్నాయని విమర్శించారు. సిఎం స్థాయిలో ఉన్న జగన్ వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేశారని, ప్రతి అంశంలో నియంతృత్వ వైఖరితో అవలంభిస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ప్రాథమిక హక్కులను కాలరాశారని విమర్శించారు. కోట్లాది రూపాయలను వెదజల్లి విద్యావంతులను సంతలో పశువుల మాదిరిగా కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ఈ నియంతృత్వాన్ని, దుర్మార్గాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత విద్యావంతులపై ఉందని తెలిపారు.

ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పంచుమర్తి అనురాధ!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎమ్మెల్యేల కోటాలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి తన అభ్యర్థిని పెట్టాలని ఆలోచన చేస్తోంది. ఎమ్మెల్యేల కోటాలో ఏడు ఎమ్మెల్సీ స్థానాలు ఈ నెలఖారుతో ఖాళీ కానున్నాయి. అధికార పార్టీ ఇప్పటికే తన అభ్యర్థులకు బి-ఫారాలను అందించింది. అయితే ఇప్పుడు ఒక స్థానానికి అభ్యర్థిని దించాలని టిడిపి భావిస్తోంది. ఆ పార్టీ మహిళా నేత పంచుమర్తి అనురాధను పోటీకి దించాలని చూస్తోంది. దీనిపై టిడిపి అధినేత చంద్రబాబు పార్టీ నేతలతో చర్చించారు. ఒక అభ్యర్థి గెలవాలంటే 23 ఓట్లు అవసరం ఉంటుందని భావిస్తుంది. ప్రస్తుతం ఆ పార్టీ తరపున 23 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. వీరిలో ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, కరణం బలరాం, వాసుపల్లి గణేష్, మద్దాల గిరిధర్ వైసిపికి మద్దతు ప్రకటించారు. ఇప్పటికే నెల్లూరులో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఆనం వెంకట రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆ పార్టీతో విభేదించారు. శ్రీధర్ రెడ్డి వంటి వారు ఇంకా ఎవరైనా ఉంటారనే ఆశతో టిడిపి ఎదురుచూస్తోంది.

ఎమ్మెల్సీ పోలింగ్ రోజున ప్రారంభమయ్యే

ఎస్‌సిటి కానిస్టేబుల్ పరీక్షలు వాయిదా వేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసన మండలి ఎన్నికల రోజున 13.3.2023న జరగనున్న ఎస్‌సిటి కానిస్టేబుల్ ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్‌లను వాయిదా వేసి మరునాడు నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి గురువారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. పరీక్షలకు సంబంధించి ఫిబ్రవరి 20వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ పరీక్షలతో అర్హులైన ఓటర్లు ఓటు వేయలేని పరిస్థితులు ఏర్పడి పోలింగ్‌పై ప్రభావం పడే అవకాశం ఉన్నందున పోలింగ్ రోజున మినహాయించి తరువాతి రోజునుండి పరీక్షలు ప్రారంభమయ్యేలా సంబంధిత డిపార్ట్‌మెంట్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

లైంగిక వేధింపుల నివారణ కమిటీలు

- స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపుల నివారణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి కెవి ఉషశ్రీ చరణ్ తెలిపారు. లైంగిక వేధింపుల నివారణకు ఈ కమిటీలు ప్రధాన భూమిక పోషిస్తాయని చెప్పారు. భారత ఉన్నత న్యాయస్థానం మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పలు ఉత్తర్వుల ప్రకారం అన్ని శాఖాధిపతుల కార్యాలయాలు, ప్రైవేట్ కార్యాలయాల్లోనూ ఈ కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యాన 'పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013' అమలు తీరుపై సమీక్షా సమావేశం సచివాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఉషశ్రీ మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళా ఉద్యోగులపై ఎటువంటి లైంగిక వేధింపులకు ఆస్కారం లేకుండా ఉండేందుకు, మహిళలు వారి సమస్యలను నిర్భయంగా వెల్లడించేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ప్రధాన వేదికలుగా పనిచేస్తాయని తెలిపారు. ఈ కమిటీలు ఏర్పాటు చేయని శాఖాధిపతులు వెంటనే తమ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ పనిచేసే మహిళా ఉద్యోగుల్లో ఈ కమిటీలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, శిశువులకు పాలిచ్చే ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలన్నారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ.. మహిళల భద్రత, సాధికారత సాధనలో దేశానికే ఆదర్శంగా రాష్ట్రం నిలుస్తుందన్నారు. గుంటూరు, ఏలూరు, కర్నూలు, విశాఖపట్నం జోన్లలో 'సబల' కార్యక్రమాల్లో భాగంగా పలు అవగాహన సదస్సులు నిర్వహించామని, వీటిలో గుర్తించిన సమస్యలను పరిష్కరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశుసంక్షేమశాఖ డైరెక్టరు బి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

4 విడతల విద్యాదీవెన నిలిపేసిన జగన్

- టిడిపి నేత బోండా ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యా దీవెన పథకం నాలుగేళ్లలో నాలుగు విడతలను సిఎం జగన్ నిలిపేశారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. పేదవారి చదువుకయ్యే ఖర్చంతా భరిస్తామని 2019 ఎన్నికల మేనిఫెస్టోలో జగన్ హామీ ఇచ్చి మాట తప్పారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. బిటెక్ 4వ ఏడాది విద్యార్థులకు 8వ సెమిస్టర్ ఏప్రిల్ 24తో ముగుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వీరికి ఒక్క విడత కూడా ఫీజు చెల్లించలేదన్నారు. ఫిబ్రవరి 28న చెల్లిస్తామని మార్చి 7వ తేదీకి వాయిదా వేశారని, మళ్లీ ఎప్పటికి వాయిదా వేస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

విపత్తుల నిర్వహణ డిజిగా పివి సునీల్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విపత్తులశాఖ నిర్వహణ, అగ్నిమాపక నిర్వహణ డైరెక్టర్ జనరల్‌గా పివి సునీల్ కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన జిఒ 481ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి గురువారం విడుదల చేశారు. విపత్తుల నిర్వహణ డిజిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్ సంజయ్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది.

అదాని కంపెనీల మరిన్ని షేర్ల తనఖా

- ఎస్‌బిఐ క్యాప్ వెల్లడి

న్యూఢిల్లీ : అదాని గ్రూపునకు చెందిన మరిన్ని షేర్లను తనఖాగా పెట్టుకుని రుణాలు జారీ చేసినట్లు ఎస్‌బిఐ కాప్ ట్రస్టీ వెల్లడించింది. ఈ విషయాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఎస్‌బిఐకాప్ ట్రస్టీ తెలిపింది. అదాని గ్రీన్ ఎనర్జీలోని మరో 0.99 శాతం షేర్లను తనఖాగా పెట్టుకున్నట్లు తెలిపింది. అదాని ట్రాన్స్‌మిషన్‌కు చెందిన 0.76 శాతం షేర్లను కూడా తనఖాగా పెట్టుకున్నట్లు పేర్కొంది. ఎస్‌బిఐకి చెందిన ఎస్‌బిఐకాప్ అదాని ఎంటర్‌ప్రైజెస్‌కు కూడా తనఖా అప్పులిచ్చినప్పటికీ ఆ వివరాలను వెల్లడించలేదు. తాజా రుణాలతో కలుపుకుని అదాని గ్రీన్ ఎనర్జీలో 2 శాతం, అదాని ట్రాన్స్‌మిషన్‌లో 1.32 శాతం షేర్లను తనఖాగా పెట్టుకుంది. వీటిని తనఖా పెట్టిన తర్వాతే అదాని గ్రూపు ఇటీవల పలు విత్త సంస్థలకు రూ.7,374 కోట్ల అప్పులు చెల్లించినట్లు తెలుస్తోంది. అదాని గ్రూపు కంపెనీలు 2023 ప్రారంభం నాటికి రూ.1.89 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నాయి. 2019 ముగింపు నాటికి ఈ అప్పులు రూ.1.11 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లను తనఖాగా పెట్టుకుని ఇది వరకు కూడా ఎస్‌బిఐకాప్ అప్పులిచ్చింది. అయితే ఎంత మొత్తం రుణాలు ఇచ్చిన విషయాన్ని ఎప్పుడూ వెల్లడించలేదు. అదాని గ్రూపు కంపెనీలు తీవ్ర ఆర్థిక అవకతవకలకు పాల్పడటంతో పాటుగా కృత్రిమంగా షేర్ల ధరలను పెంచుకుంటున్నాయని జనవరిలో హిండెన్‌బర్గ్ ఓ రిపోర్టులో ఆరోపించిన విషయం తెలిసిందే.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తాం

- వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ఖాదర్‌బాషా

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ వి.ఖాదర్‌బాష అన్నారు. గుంటురులోని ప్రసిద్ధ పెద్ద మసీదును ఆయన గురువారం సందర్శించి ముతవల్లిలతో సమవేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ స్థలాల పరిరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, వక్ఫ్ బోర్డు పరిధిలోని ఎకరం స్థలాన్ని కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆస్తుల పరిరక్షణకు మసీదు నిర్వాహకులూ పాటుపడాలన్నారు. మసీదు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని, రంజాను మాసానికి ముందే మరమ్మత్తులు పూర్తి చేస్తామని తెలిపారు. ఆయనవెంట వక్ఫ్‌బోర్డు ఇఒ షేక్ ముఖ్తర్ బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు షేక్ జిలాని, తదితరులు ఉన్నారు.

దక్షిణ మధ్య రైల్వేకు రూ.12,016 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సరుకు రవాణాలో ఈ ఏడాది మార్చి 8వ తేదీ వరకూ రూ.12,016 కోట్లు ఆర్జించి దక్షిణ మధ్య రైల్వే మరో అరుదైన ఘనతను సాధించింది. ఈ మేరకు రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ జోన్ సిబ్బందిని, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఆర్ ధనుంజయులు, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ జాన్‌ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి సిహెచ్ రాకేష్ గురువారం ప్రకటన విడుదల చేశారు. సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే దేశంలో రెండోస్థానంలో నిలిచిందని తెలిపారు. జోన్ ఏర్పాటైన తరువాత ఇదే అత్యధిక ఆదాయమని ప్రకటించారు. 2018-19లో 122.498 మిలియన్ టన్నులు సరుకు రవాణా చేయగా, ఈ ఏడాది 122.628 టన్నుల సరుకును రవాణా చేసిందని వివరించారు. గతేడాదితో పోలిస్తే 12 శాతం అధికంగా సరఫరా చేశామని తెలిపారు. 62.195 మిలియన్ టన్నుల బొగ్గు మొదటి స్థానంలో ఉందని, 31.883 మిలియన్ టన్నులతో సిమెంటు రెండోస్థానంలో ఉందని వివరించారు. ఆహార ధాన్యాలు 6.731 మిలియన్ టన్నులు, ఎరువులు 7.516, ఆర్ఎంఎన్‌పి 4.181, ఇనుప ఖనిజం 1.45, కంటెయినర్లు, పెట్రోలియం ఉత్పత్తులు ఇతర వస్తువుల లోడింగ్ 8.872 టన్నులు సరఫరా చేశామని పేర్కొన్నారు. సరుకు రవాణాకు సంబంధించి వినియోగదారుల అవసరాలను తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వేగంగా, సులభంగా సరఫరా చేసేందుకు వీలుగా టెర్మినల్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గూడ్స్‌షెడ్‌ల వద్ద మెరుగైన సదుపాయాలు కల్పించే పనులు సాగుతున్నాయని తెలిపారు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR
ANANTHAPURAMU 515 002 .A.P. INDIA
APSCHE
AP EAPCET - 2023 NOTIFICATION

Engineering, Agriculture and Pharmacy Common Entrance Test – 2023 is being conducted through computer based test on behalf of APSCHE by JawaharlalNehru Technological University Anantapur, Ananthapuramu for entry into the firstyear of the professional courses offered for the academic year 2023-2024 in the state of Andhra Pradesh. Candidates who wish to apply shall submit their application through online mode only from 11-03-2023 onwards. The last date for submission without late fee is 15-04-2023. For detailed information refer to the website https://cets.apsche.ap.gov.in/EAPCET

09.03.2023: Ananthapuramu **Sd/- Convener, APEAPCET 2023**

ఏడుగురు వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు

- బి-ఫామ్‌లు అందజేసిన సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర శాసనమండలిలో ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు వైసిపికి చెందిన ఏడుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. పెనుమత్స వరాహ వెంకట సూర్యనారాయణ రాజు, కోలా గురువులు, బొమ్మి ఇజ్రాయిల్, మర్రి రాజశేఖర్, జయమంగళ వెంకటరమణ, పోతుల సునీత, చంద్రగిరి యేసురత్నం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లి సిఎం వైఎస్ జగన్ చేతులమీదుగా బి-ఫామ్‌లు గురువారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం శాసనమండలి జాయింట్ సెక్రటరీ, ఎమ్మెల్యే ఎన్నికల రిటర్నింగ్ అధికారి పివి సుబ్బారెడ్డి వద్ద ఏడుగురు వైసిపి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వారివెంట ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపిలు అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, లావు శ్రీకృష్ణ దేవరాయలు, నందిగం సురేష్, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరి శంకరరావు, ఉండవల్లి శ్రీదేవి, దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, తలసీల రఘురామ్, జంగా కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.



జగన్‌తోనే సామాజిక న్యాయం : సజ్జల

సామాజిక న్యాయాన్ని సిఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. నామినేషన్ల కార్యక్రమం ముగిశాక శాసనమండలి ఆవరణలో సజ్జల మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు బిసిలకు ఎందుకు ఇన్ని అవకాశాలు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. మొత్తం 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 స్థానాలు బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించామని, అందులో 11 స్థానాలు బిసిలకే ఎంపిక చేశామని చెప్పారు.

మదనపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న లోకేష్

జగన్ హయాంలో సంక్షేమ పథకాలు రద్దు

- చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం : లోకేష్
- 500 కిలో మీటర్లకు చేరిన యువగళం పాదయాత్ర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేనేత కార్మికులకు, రైతులకు చేసింది శూన్యమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. అడుగడుగునా ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుకునేందుకే తాను పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. యువగళం పేరుతో లోకేష్ ప్రారంభించిన పాదయాత్ర 500 కిలో మీటర్లు పూర్తి చేసుకుంది. గురువారం అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని సిటిఎం పంచాయతీ-2 వద్ద ప్రత్యేక శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. 39వ రోజుపాదయాత్ర మదనపల్లెలోని పూలవాండ్లపల్లె నుండి ప్రారంభమై సిటిఎం క్రాస్‌రోడ్డు, సిటిఎం లేక్, కొత్తవారిపల్లి మీదుగా ఎనుములవారిపల్లె వరకు సాగింది. పాదయాత్ర సందర్భంగా చేనేత కార్మికులతో లోకేష్ మాట్లాడుతూ చేనేతలకు గతంలో కల్పిస్తున్న సబ్సిడీ కరెంట్ బిల్లు, పట్టుపై సబ్సిడీ, ఇన్సూరెన్స్ సౌకర్యం వంటివి జగన్ ప్రభుత్వం తొలగించిందని విమర్శించారు. చేనేత మగ్గాల వారికి 200 యూనిట్లు, పవర్‌లూమ్స్ నేతలకు 5 యూనిట్లు ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చి చేతులెత్తేశారని అన్నారు. వైఎస్సార్ బీమాను ఎత్తేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేత కార్మికుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పలుచోట్ల ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను రద్దు చేసిన చరిత్ర జగన్ ప్రభుత్వానికే దక్కిందని విమర్శించారు. పండుగ కానుకలు, పెళ్లి కానుకలు, విదేశీ విద్య, అన్న క్యాంటీన్ రద్దు చేశారని తెలిపారు. కరెంట్ ఛార్జీలు పెంచుతూ పేదల నడ్డివిరుస్తున్నారని అన్నారు. ఎనుమువారిపల్లెలో ముస్లిం మైనారిటీ నాయకులతో మాట్లాడారు. అనంతరం ఆరోగ్యవరం సమీపంలోని మెడికల్ కాలేజీ నిర్మాణం వద్ద యువతతో సమావేశం నిర్వహించారు. టిడ్కో ఇళ్లను పరిశీలించి స్థానిక దేవతనగర్ వరకు పాదయాత్ర కొనసాగించారు. రాత్రి అక్కడే బస చేశారు. శుక్రవారం ఉదయం మదనపల్లి పట్టణంలో పాదయాత్ర ప్రారంభించనున్నారు. పాదయాత్రలో మాజీ మంత్రులు అమరనాథ్‌రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దోమ్మలపాటి రమేష్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

5న రాములోరి కల్యాణం : టిటిడి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఈ నెల 30న శ్రీరామనవమితో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని టిటిడి ఇఒ ఎ.వి.ధర్మారెడ్డి అన్నారు. ఏప్రిల్ 3న హనుమంత వాహనం, ఏప్రిల్ 4న గరుడవాహనం, ఏప్రిల్ 5న సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై వైఎస్‌ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్‌పి అన్బురాజన్, జిల్లా యంత్రాంగంతో కలిసి గురువారం ఒంటిమిట్టలో ఇఒ సమీక్ష నిర్వహించారు. ఇఒ మాట్లాడుతూ.. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవ ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వైఎస్‌ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ.. సీతారాముల కల్యాణానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకుముందు టిటిడి ఇఒ, వైఎస్‌ఆర్ జిల్లా కలెక్టర్ కలిసి కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

తీవ్ర చర్యలు తీసుకోకుండా సిబిఐని ఆదేశించండి

- హైకోర్టులో అవినాష్‌రెడ్డి రిట్ పిటిషన్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

తనపై తీవ్రమైన చర్యలు తీసుకోకుండా సిబిఐని ఆదేశించాలని కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు గురువారం ఆయన రిట్ పిటిషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు దర్యాప్తులో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు అవినాష్ రెడ్డి సిబిఐ ఎదుట విచారణకు హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనను సిబిఐ అధికారులు విచారించే సమయంలో ఆడియో, వీడియో చిత్రీకరణ జరిపేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. తనతోపాటు న్యాయవాదిని కూడా అనుమతించాలని, సిబిఐ నమోదు చేసిన వాంగ్మూలం ప్రతిని ఇచ్చేలా ఆదేశించాలని కోరారు. వివేకా హత్యకేసులో ఎ4 నిందితుడిగా ఉన్న దస్తగిరిని ఇప్పటి వరకు సిబిఐ అరెస్టు చేయలేదని, అతని ముందస్తు బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకించలేదని తెలిపారు. దస్తగిరి నిరాధార మాటల ఆధారంగానే సిబిఐ విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. తనకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేకపోయినప్పటికీ తనను ఇరికించే ప్రయత్నం జరుగుతోందన్నారు. దర్యాప్తు అధికారి పనితీరు పక్షపాతంగా ఉందని, తప్పుడు సాక్ష్యాలు చెప్పేలా కొందరిపై ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. తాను విచారణలో చెప్పిన విషయాలను కూడా విచారణ అధికారి మార్చేస్తున్నారని అవినాష్‌రెడ్డి పిటిషన్‌లో వెల్లడించారు.

ప్రణాళికతో పరీక్షకు సిద్ధం కావాలి

- ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు
- గ్రూప్ -2 పరీక్షలపై అవగాహనసదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విద్యార్థులందరూ ప్రణాళికతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని పోటీ పరీక్షల నిపుణులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అల్లూరి స్టడీ సర్కిల్, డివైఎఫ్ఐ సంయుక్తాధ్వర్యంలో గ్రూప్ - 2 పరీక్షలపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు.

ఈ సదస్సుకు కెఎస్.లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అకడమిక్ పరీక్షల్లో 35 మార్కులు వస్తే ఉత్తీర్ణత అవుతామని.. కానీ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత అవ్వడం కుదరదని తెలిపారు. ఒక్క మార్కుతో ఉద్యోగాలు కోల్పోయిన వారు ఎంతోమంది ఉన్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తించి విద్యార్థులంతా ప్రణాళికతో పరీక్షకు సిద్ధం కావాలని సూచించారు.

సిలబస్‌ను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని, పాత ప్రశ్నాపత్రాలను అభ్యసించాలని, సబ్జెక్టును కాన్సెప్ట్‌లవారీగా అర్థం చేసుకోవాలని తెలిపారు. పోటీ పరీక్షల్లో గతంలో అడిగిన కొన్ని ప్రశ్నలను విద్యార్థులకు వివరించారు. విశ్రాంత ఎఎస్‌పి కె.సత్యనారాయణ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సమాయత్తమయ్యేవారు పుస్తకాలను బట్టీ పట్టడం కాకుండా నైపుణ్యంతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో పిడిఎఫ్ ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, గాయత్రి కోచింగ్ సెంటర్ అధ్యాపకులు ఎస్.శ్రీనివాసరావు, అల్లూరి స్టడీ సర్కిల్ బాధ్యులు అభిమన్యు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విధులకు ఉద్యోగులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ , కర్నూలు కార్పొరేషన్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఎపి జెఎసి అమరావతి పిలుపులో భాగంగా గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. నంద్యాల జిల్లా కలెక్టరేట్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు నాగమణి, రాముు సంజీవ, నారాయణ స్వామి మాట్లాడారు. ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.16 వేల కోట్ల అరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం ఉద్యోగుల సంఘాల నాయకులతో జరిగిన చర్చల్లో ఈ నెల చివరిలోగా రూ.మూడు వేల కోట్లు చెల్లిస్తామన్నారని, అది మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలన్నారు. కర్నూలులో ఆర్‌టిసి డిపో సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధుల్లో పాల్గొని నిరసన తెలిపారు. ఒటి, నైట్ అవుట్, ఇతర అలవెన్సులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - బ్రహ్మసముద్రం (అనంతపురం)

అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం బైరవానితిప్ప పంచాయతీలో గురువారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. కపటలింగనపల్లి గ్రామానికి చెందిన రాజన్న (45)కు నాలుగు ఎకరాల భూమి ఉంది. ఇందులో వేరుశనగ, ఉల్లి, మొక్కజొన్న పంటలు సాగు చేసేవారు. వ్యవసాయ పెట్టుబడులు, పిల్లల చదువు నిమిత్తం సుమారు రూ. ఎనిమిది లక్షలు అప్పుచేశారు. గత నాలుగేళ్లుగా పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక నష్టాలు వచ్చాయి. అప్పులు తీరేదారిలేక బుధవారం అర్ధరాత్రి గ్రామ సమీపంలో పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. వారు కర్నాటక రాష్ట్రం బళ్లారిలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మరణించారు. ఆయనకు భార్య రాధమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నెలాఖరులోగా రూ.3 వేలకోట్లు

- సర్కారు రాతపూర్వక హామీ
- 16న మరోసారి ఉద్యోగ సంఘాలతో భేటీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రివర్గ ఉపసంఘం నిర్వహించిన చర్చలపై ప్రభుత్వం ఒక స్పష్టతనిచ్చింది. చర్చల సారాంశాన్ని, అంగీకరించిన అంశాలను రాతపూర్వకంగా ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేయడంతో తాజాగా ప్రభుత్వం అధికారికంగా తన నిర్ణయాలను ప్రకటించింది. ఇందులో కొన్ని అంశాలను ఎప్పటిలోగా పరిష్కరిస్తామన్న దానిపైనా వివరణ ఇచ్చింది. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న జిపిఎఫ్, మెడికల్ అలవెన్సులు, ఇతర అంశాలతోపాటు 12వ పిఆర్‌సి, డిఎ వంటివాటిపైనా స్పష్టత ఇచ్చింది. కొద్ది రోజుల క్రితం జరిగిన సమావేశంలో చెప్పినట్లుగానే ఈ నెలాఖరునాటికి జిపిఎఫ్ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, హెల్త్ స్కీమ్ నిధులు, బీమా, టిఎ వంటివి చెల్లించనున్నట్లు, దీనికి సుమారు రూ.3 వేలకోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఆర్జిత సెలవులు, పింఛనుదారులకు గ్రాట్యుటీ కూడా నెలాఖరులోగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. మరికొన్ని అంశాలను సెప్టెంబరులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొంది. 2018 జులై ఒకటి, 2019 జనవరి ఒకటికి సంబంధించిన డిఎ బకాయిలను, ఆర్జిత సెలవులను రెండు విడతలుగా చెల్లించనున్నట్లు పేర్కొంది. ప్రతియేటా సొంత ఆదాయం రూ.1.25 లక్షల కోట్లు వస్తుండగా, అందులో రూ.90 వేల కోట్ల వరకు ఉద్యోగుల జీతాలు, పింఛన్లకు చెల్లిస్తున్నట్లు వివరించింది. అయినప్పటికీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొంది. 12వ వేతన సవరణ, ఇతర ఉద్యోగ సంబంధిత అంశాలపై ఈ నెల 16న మరోసారి ఉద్యోగ సంఘాల నేతలతో భేటీ కానున్నట్లు వివరించింది. అన్ని అంశాలపై ప్రతినెలా తొలి, రెండో సోమవారాల్లో ఉద్యోగులతో చర్చించాలని అన్ని శాఖలకూ ఆదేశాలు జారీ చేశారు. సిఎస్ స్థాయిలో కూడా నెలకోసారి సమావేశం నిర్వహించనున్నారు. గురుకులాలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే విషయం కోర్టులో ఉందని, తరువాత దీనిపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. ఇక ప్రభుత్వ నిర్ణయాలను అధ్యయనం చేసిన అనంతరం ఉద్యోగ సంఘాలు ఎలాంటి ఉద్యమ విధానాలు అవలంభిస్తాయో చూడాల్సి ఉంది.

రూపాయి అస్థిరతపై సన్నద్ధంగా ఉండాలి : ఆర్‌బిఐ

ముంబయి : విదేశీ మారకపు మార్కెట్‌లో తలెత్తే అనివార్యమైన రూపాయి అస్థిరతను నిర్వహించడానికి సన్నద్ధంగా ఉండాలని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఎటువంటి పరిమితులు లేకుండా దిగుమతి, ఎగుమతి కోసం రూపాయి కరెన్సీని ప్రోత్సహించడం ద్వారా అస్థిరతను ఎదుర్కోవచ్చన్నారు. గత జూలైలో ఎగుమతులను ప్రోత్సహించడం, దిగుమతులను సులభతరం చేయడం లక్ష్యంగా అంతర్జాతీయ వాణిజ్యాన్ని రూపాయల్లో స్థిరీకరించడానికి ఆర్‌బిఐ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

यूनियन बैंक Union Bank of India — ఎడ్లపాడు బ్రాంచి (ఇ-ఎబి) డోర్ నం.4-53/1, మెయిన్ రోడ్డు, ఎడ్లపాడు-522 233, టెలి నం.లు: 08647276610 8

స్వాధీనతా ప్రకటన
(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్-8(1))
(స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (యాక్టు 54 ఆపు 2002)క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, డిమాండ్ నోటీసు జారీచేసి, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలును సదరు నోటీసు స్వీకరణ తేది నుండి స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు మరియు దానిపై వడ్డీ& ఖర్చులతో తిరిగి చెల్లించవలసిందిగా కోరబడుచున్నది. రుణగ్రహీతలు మొత్తంను తిరిగి చెల్లించుటలో విఫలంచెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలకు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని **క్ర.సం.1&2 కొరకు 04 మార్చి 2023**న స్వాదీనంచేసుకున్నారు.
ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, యూనియన్ బ్యాంక్ ఇండియాకు రుణ మొత్తాలును మరియు దానిపై వడ్డీ& ఖర్చులతో తిరిగి చెల్లించుటకులోబడి ఉంటుంది. సెక్యూర్డు అసెట్స్ విడిపించుటకు, అందుబాటులోగల సమయంకు సంబందించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలకు రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

క్ర.సం.1: రుణగ్రహీత/ల పేరు: శ్రీ ముద్దన సీతా రమ్య తండ్రి హనుమంత రావు, **డిమాండ్ నోటీసు తేది: 17.10.2022. బకాయి మొత్తాలు: 17.10.2022 నాటికి రూ.20,27,548.17 పై.లు** (రూపాయలు ఇరువై లక్షల ఇరువై ఏడు వేల ఐదు వందల నలభై ఎనిమిది మరియు పదిహేడు పైసలు మాత్రమే) మరియు దానిపై చార్జీలు& వడ్డీ. **స్థిరాస్తి వివరణ:** ముద్దన సీతా రామయ పేరున 242చ.గ.ల విస్తీర్ణంతో జగ్గాపురం గ్రామం, జలాడి ఎడ్లపాడు మండలం, గుంటూరు, ఆం.ప్ర.-522233 వద్ద సర్వే నం.310, డోర్ నం.1-46/2లో ల్యాండ్& బిల్డింగ్- నివాసిత ఇల్లు కలిగియున్న ఆస్తి యొక్క మొత్తం భాగం. మరియు సరిహద్దులు: **తూర్పు:** బజార్, **దక్షిణం:** పెల్లూరి హనుమంత రావు సైటు, **పడమర:** ముద్దన శ్రీనివాస రావు సైటు, **ఉత్తరం:** సర్కార్ డొంక.

క్ర.సం.2: రుణగ్రహీత/ల పేరు: శ్రీ నాగభీరు శ్రీరామ్మూర్తి తండ్రి వెంకటేశ్వర్లు, **డిమాండ్ నోటీసు తేది: 16.07.2022. బకాయి మొత్తాలు: 16.07.2022 నాటికి రూ.10,44,395/-లు** (రూపాయలు పది లక్షల నలభై నాలుగు వేల మూడు వందల తొంబై ఐదు మాత్రమే) మరియు దానిపై చార్జీలు& వడ్డీ. **స్థిరాస్తి వివరణ:** శ్రీ నాగభీరు శ్రీరామమూర్తి తండ్రి వెంకటేశ్వర్లుకు చెందిన గుంటూరు జిల్లా, ఎడ్లపాడు గ్రామం& మండలం, సొసైటీ బ్యాంక్ దగ్గర, డోర్ నం.298/2, 321/2 వద్ద నిర్మించిన భవనము మరియు 202.60చ.గ.ల విస్తీర్ణంలోని ల్యాండ్ కలిగియున్న ఆస్తి యొక్క మొత్తం భాగం. మరియు సరిహద్దులు: **ఉత్తరం:** నాగభీరు పుష్పవతి సైటు 136 లింకులు, **దక్షిణం:** 20 లింకుల వెడల్పు బజార్ 113 లింకులు, **తూర్పు:** ఉమ్మడి గోడ 100 లింకులు, **పడమర:** పోపూరి హనుమయ్య సైటు 85 లింకులు.

తేది: 04.03.2023 **చీఫ్ మేనేజర్& అధీకృత అధికారి**
ప్రదేశం: ఎడ్లపాడు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.**

జతపత్రం IV
(చూడండి నిబంధన 8(1)
స్వాధీన నోటీసు
(స్థిరాస్తి కోసం)

పేర్కొనడం ఏమనగా,

దిగువ సంతకం చేసిన వారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఇన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 కింద **ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (CIN:L65922DL2005PLC136029)** యొక్క అధికృత అధికారి మరియు సెక్యూరిటీస్ ఇంట్రెస్ట్ (ఇన్ఫోర్స్‌మెంట్) నిబంధన, 2002 యొక్క నిబంధన 3 లోని సెక్షన్ 13 (12) కింద హక్కులను వినియోగించుకుంటూ, లోన్ అకౌంట్ నం **HLAPGUN00253056** లో తేదీ **07.12.2022** నాటికి నోటీసులో పేర్కొన్న రూ. **57,95,403.68 (యాభై ఏడు లక్షల తొంభై ఐదు వేల నాలుగు వందల మూడు రూపాయల అరవై ఎనిమిది పైసలు మాత్రమే)** అసలు మొత్తాన్ని దానిపై అయ్యే వడ్డీతో సహా, ఈ నోటీసు అందిన తేదీ నుంచి 60 రోజులలోపున తిరిగి చెల్లించవలసిందిగా ఋణం తీసుకున్న వారైన **శ్రీ బాలాజీ టెక్స్‌టైల్స్ (దాని భాగస్వాముల ద్వారా), చుండూరు శ్రీనివాస రావు పార్టనర్ శ్రీ బాలాజీ టెక్స్‌టైల్స్, చుండూరు నాగా వీరంజా నేయులు భాగస్వామి శ్రీ బాలాజీ టెక్స్‌టైల్స్, చుండూరు వివిఎన్ఆర్ విశాలాక్షి, చుండూరు వెంకటా వెంకోటి శివశ్రీ నాగిని (కో-బారోవర్, కూతురు అలాగే దివంగత చుండూరు వెంకటేశ్వరరావు యొక్క చట్టపరమైన వారసురాలు), చుండూరు సాయి శ్రీ వెంకట చిరంజీవి సమర్ధ (కుమారుడు అలాగే దివంగత చుండూరు వెంకటేశ్వరరావు యొక్క చట్టపరమైన వారసుడు)** లను కోరుతూ తేదీ **08.12.2022** నాడు డిమాండ్ నోటీసు జారీ చేయడం జరిగింది.

ఋణం తీసుకున్న వారు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు, పేర్కొన్న చట్టం సెక్షన్ 13(4) లోని పేర్కొన్న నిబంధన 8 ప్రకారం తేదీ **04.03.2023** నాడు అతనికి గల హక్కును వినియోగించుకుంటూ దిగువ సంతకం చేసిన వారు దిగువ **ఆస్తిని స్వాధీనం** చేసుకున్నారని ఋణం తీసుకున్న వారికి మరియు సాధారణ ప్రజానికానికి నోటీసు జారీ చేస్తున్నారు.

ప్రత్యేకించి ఋణం తీసుకున్న వారికి మరియు సాధారణ ప్రజానీకానికి ఈ ఆస్తి విషయంలో వ్యవహారాలు కొనసాగించవద్దని హెచ్చరించడమైనది మరియు దీని విషయంలో ఏవైనా లావాదేవీలు జరిపితే తేదీ **07.12.2022** నాటికి **ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌**కి రూ. **57,95,403.68 (యాభై ఏడు లక్షల తొంభై ఐదు వేల నాలుగు వందల మూడు రూపాయల అరవై ఎనిమిది పైసలు మాత్రమే)** మొత్తాన్ని మరియు దీనిపై అయ్యే వడ్డీతో సహా చెల్లించవలసి ఉంటుంది.

సెక్యూర్డ్ ఆస్తులని రిడీమ్ చేసుకునేందుకు లభించే సమయానికి చట్టంలోని సెక్షన్ 13 కోని ఉప-సెక్షన్ (8) నిబంధనలపై దృష్టి పెట్టవలసిందిగా రుణ గ్రహీతను ఆహ్వానించడం జరుగుతోంది.

స్థిరాస్తి వివరాలు

రెసిడెన్షియల్ ఫ్లాట్ నం. 204 రెండవ అంతస్తులో ప్లింత్ ఏరియా 1312 చదరపు అడుగులతో పాటు 72.5 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న భూమి యొక్క విభజించబడని వాటాతో పాటు. మొత్తం 1827 చదరపు గజాలు 40 చదరపు అడుగులతో పాటు ''మయూరి డీలక్స్ అపార్ట్‌మెంట్'' అని పిలవబడే భవనంలో స్టిల్ట్ ఫ్లోర్‌లో కార్ పార్కింగ్ స్థలం ఉన్నది. బేరింగ్ డోర్ నెం. 4-5-67, వార్డ్ నం. 18 బ్లాక్ నం.25, డోర్. నం. 206/1టి.ఎస్. నెం.గా మార్చబడింది. 1823 టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ పక్కన రింగ్ రోడ్ వద్ద కోరిటేపాడు గ్రామం గుంటూరు-522007 ఆంధ్ర ప్రదేశ్. ఈ క్రింది విధంగా సరిహద్దులు కలది:

తూర్పు : ఆకాశం — పశ్చిమం : ఫ్లాట్ నెం. 203
ఉత్తరం : ఆకాశం — దక్షిణం : ఆకాశం మరియు కారిడార్

తేదీ : 04.03.2023 **అధికృత అధికారి**
స్థలం : గుంటూరు **ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

यूनियन बैंक — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిగడప బ్రాంచి (e-AB) తాడిగడప, కృష్ణా జిల్లా.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) : 1) శ్రీ నదికట్ల పూర్ణచంద్రరావు, [illegible]

షెడ్యూల్ ఆస్తి

[illegible]

తేది : 02-03-2023 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : తాడిగడప — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — ఆంధ్రా — కార్పొరేషన్
పట్టాభిపురం బ్రాంచి
(బ్రాంచి చిరునామా: మెయిన్ రోడ్డు, శ్రీ మాన్సన్ అపార్ట్‌మెంట్, పట్టాభిపురం, గుంటూరు-522006. ☎ 0863-2230722

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
{సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1)}

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీ ఆళ్ళ ప్రకాష్‌రావు** వారు **చెల్లించవలిసిన బకాయిమొత్తం రూ.9,79,176/- (అక్షరాల తొమ్మిది లక్షల డెబ్బైతొమ్మిది వేల నూట డెబ్బై ఆరు రూపాయలు మాత్రమే)** + వడ్డీ + బ్యాంక్ ఛార్జీలు సదరు నోటీసు తేదీనుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.30.07.2022న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**
ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 8 ప్రకారము **7 మార్చి 2023 తేదీన** దిగువ పేర్కొన్న **ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.
ముఖ్యంగా ఋణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా **30.07.2022 తేదీనాటికి చెల్లించవలిసిన బకాయిమొత్తం రూ.9,79,176/- (అక్షరాల తొమ్మిది లక్షల డెబ్బైతొమ్మిది వేల నూట డెబ్బై ఆరు రూపాయలు మాత్రమే)** + వడ్డీ + బ్యాంక్ ఛార్జీలు మొ॥ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

తనఖావుంచిన ఆస్తి వివరములు

సెక్యూరిటీ వివరాలు: గుంటూరు, చైతన్యపురి, సౌభాగ్యనగర్, 2వ లైను, వార్డు నెం.4, కొరిటెపాడు, టి.యస్.నెం.191/జి3, డి.నెం.4-22-27/6సి, న్యూ డి.నెం.20-3-337 నందు **శ్రీ ఆళ్ళ ప్రకాష్‌రావు పేరునగల** 235 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ స్థలము మరియు అందులోని జి+2 ఫ్లోర్స్ కలిగిన ఆర్‌సిసి రూఫ్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. **ఆస్తికి హద్దులు: తూర్పు:** 25 అ॥ వెడల్పుగల రోడ్డు; **పడమర:** వై.అంజమ్మ ఇంటి యొక్క సరిహద్దు గోడ కొరకు ప్రదేశము; **ఉత్తరం:** 30 అ॥ వెడల్పుగల రోడ్డు; **దక్షిణం:** గద్దం పెద సుబ్బారెడ్డికి చెందిన ఆస్తి. **కొలతలు: తూర్పు:** 58'-8''; **పడమర:** 57'-7''; **దక్షిణం:** 36'-5''; **ఉత్తరం:** 36'-7''.

తేది : **07-03-2023** — సం/- ఏజియమ్/ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
ప్రదేశము : **గుంటూరు** — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — ఆంధ్రా — కార్పొరేషన్
పట్టాభిపురం బ్రాంచి
(బ్రాంచి చిరునామా: మెయిన్ రోడ్డు, శ్రీ మాన్సన్ అపార్ట్‌మెంట్, పట్టాభిపురం, గుంటూరు-522006. ☎ 0863-2230722

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
{సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1)}

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీ మదమంచి జనార్ధనరావు మరియు శ్రీమతి మదమంచి సుమతి** వారు **చెల్లించవలిసిన బకాయిమొత్తం రూ.3,16,756/- (అక్షరాల మూడు లక్షల పదహారు వేల ఏడు వందల యాభై ఆరు రూపాయలు మాత్రమే)** + వడ్డీ + బ్యాంక్ ఛార్జీలు సదరు నోటీసు తేదీనుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.30.07.2022న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**
ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 8 ప్రకారము **7 మార్చి 2023 తేదీన** దిగువ పేర్కొన్న **ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.
ముఖ్యంగా ఋణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా **30.07.2022 తేదీనాటికి చెల్లించవలిసిన బకాయిమొత్తం రూ.3,16,756/- (అక్షరాల మూడు లక్షల పదహారు వేల ఏడు వందల యాభై ఆరు రూపాయలు మాత్రమే)** + వడ్డీ + బ్యాంక్ ఛార్జీలు మొ॥ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

తనఖావుంచిన ఆస్తి వివరములు

సెక్యూరిటీ వివరాలు: గుంటూరు, యస్‌వియన్ కాలనీ ఎక్స్‌టెన్షన్, సాయి తులసి రెసిడెన్సీ, మొదటి అంతస్తులో **శ్రీ మదమంచి జనార్ధనరావు పేరునగల** ఫ్లాట్ నెం.101కు సంబంధించిన యావదాస్తి. **అపార్ట్‌మెంట్‌కు హద్దులు: తూర్పు:** బిల్డింగ్ నెం.సి-67; **పడమర:** మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు; **ఉత్తరం:** బిల్డింగ్ నెం.65; **దక్షిణం:** బిల్డింగ్ నెం.63. **ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు:** గ్రౌండ్‌లోని ఖాళీప్రదేశము; **పడమర:** ఉమ్మడి మెట్లు, ఉమ్మడి వరండా మరియు ఉమ్మడి లిఫ్ట్; **ఉత్తరం:** గ్రౌండ్‌లోని ఖాళీప్రదేశము; **దక్షిణం:** గ్రౌండ్‌లోని ఖాళీప్రదేశము.

తేది : **07-03-2023** — సం/- ఏజియమ్/ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
ప్రదేశము : **గుంటూరు** — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

HDB FINANCIAL SERVICES
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
రిజిష్టర్డు ఆఫీసు: రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్, నవరంగ్‌పుర, అహ్మదాబాద్-09.
బ్రాంచి : **76-8-10/1, ఫ్లాట్ నం.4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, భవానిపురం, విజయవాడ-520012.**

అనుబంధం-4 (రూల్-8(1)చూడండి)
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **మెసర్స్ హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8&9తో చదువబడే & సెక్షన్ 13(12)(3) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేదీ: 25.08.2022 నాటి డిమాండ్ నోటీసు** జారీచేసి, దరఖాస్తుదారు/సహ-అభ్యర్థులు/హామీదారును **రుణ ఖాతా నం.లు 4982073 లో 1.శ్రీ సాయి జ్యోతి కాటన్ & చిల్లీస్,** డోర్ నం.5-50-33/ఎ, 6/14 బ్రోడిపేట్, గుంటూరు-522002, ఆం.ప్ర. **2. వెంకట సాయి పార్వతి దేవి అదక,** డోర్ నం.5-78-11 6/3, పండరిపురం టెలిఫోన్ ఎక్స్ఛేంజి, గుంటూరు-522007, ఆం.ప్ర. **3. శ్రీనివాస రావు అదక,** డోర్ నం.5-78-11 6/3, పండరిపురం టెలిఫోన్ ఎక్స్ఛేంజి, గుంటూరు-522007, ఆం.ప్ర **4. సాయి జ్యోతి సిల్క్స్,** డోర్ నం.5-87-86/ఎ/2/3, లక్ష్మీపురం, గుంటూరు-522002, ఆం.ప్ర. అనువారిని సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన 24.08.2022 నాటికి గల మొత్తాలు **రూ.3,35,99,325.33పై.లు (రూపాయలు మూడు కోట్ల ముప్పై ఐదు లక్షల తొంబై తొమ్మిది వేల మూడు వందల ఇరువై ఐదు మరియు ముప్పై మూడు పైసలు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
దరఖాస్తుదారు/సహ-అభ్యర్థులు/హామీదారు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా దరఖాస్తుదారు/సహ-అభ్యర్థులు/హామీదారుకు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు రూల్ 8&9తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **08 మార్చి, 2023న స్వాధీనపరచుకున్నారు.**
ప్రత్యేకించి దరఖాస్తుదారు/సహ-అభ్యర్థులు/హామీదారులను మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **మెసర్స్ హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌కు** 24.08.2022 నాటికి గల మొత్తాలు **రూ.3,35,99,325.33పై.లు (రూపాయలు మూడు కోట్ల ముప్పై ఐదు లక్షల తొంబై తొమ్మిది వేల మూడు వందల ఇరువై ఐదు మరియు ముప్పై మూడు పైసలు మాత్రమే)**లను మరియు దానిపై వడ్డీ& చార్జీలను చెల్లించుటకులోబడి ఉంటుంది.
దరఖాస్తుదారు/సహ-అభ్యర్థులు/హామీదారు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ 8 యొక్క నియమాలను శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.
స్థిరాస్తి వివరణ: సెక్యూరిటీస్-1 యొక్క షెడ్యూలు:
గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-రిజిస్ట్రీ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, మున్సిపల్ వార్డు పాత నం.7, బ్లాక్ నం.1, టి.ఎస్.నం.23/2, ఎక్స్‌టెన్షన్ ఏరియా, 78వ స్ట్రీట్ బ్రాడిపేట్, డోర్ నం.5-78-11, అసెస్మెంట్ నం.4465 తో దానిపై ఆర్‌సిసి భవనముతోపాటు 325చ.గ.లు (271-73చ.మీ.)ల విస్తీర్ణపు సైటు. **సరిహద్దులు:** ఉత్తరం: మున్సిపల్ బజార్, దక్షిణం: కె. సంపత్ కుమార్ ఆచార్యులు ఆస్తి, తూర్పు: తాల్లం నరసింహా రావు ఆస్తి, పడమర: ఇక్కుర్తి ఎం.ఎస్.వి.వి.ప్రసాద్ రావు ఆస్తి.

తేది: **08.03.2023** — సం/- అధీకృత అధికారి
ప్రదేశం: **గుంటూరు** — హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — ఆంధ్రా Andhra — Corporation
బెంజ్ సర్కిల్ శాఖ,
సితార టవర్స్, యన్.సి.బి.యన్ కాలని,
విజయవాడ-520010.
ఫోన్: 0866-2496647.

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 54 / 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3 తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెంజ్‌సర్కిల్ శాఖ** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు **తేది. 20-04-2022** న డిమాండ్ నోటీసు జారీచేసి సదరు నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన బకాయి **రూ. 4,81,881.46 పై** (అక్షరాల నాలుగు లక్షల ఎనభై ఒక్క వేల ఎనిమిది వందల ఎనభై ఒక్క రూపాయల నలభై ఆరు పైసలు మాత్రమే). చెల్లించవలసినదిగా ఋణగ్రహీత మరియు హామీదారులు **1) కొప్పుల హారిక (దరఖాస్తుదారుడు), తండ్రి: వెంకట రత్నం, 2) కొప్పుల వెంకటరత్నం (సహ-దరఖాస్తుదారుడు),** తండ్రి: వెంకటరావు, **3) రాజపుత్ర మహేంద్ర కార్తీక్ సింగ్ (సహ-దరఖాస్తుదారు/హామీదారు)** ను కోరియున్నారు.
సదరు మొత్తాన్ని చెల్లించుటలో ఋణగ్రహీతల మరియు తనఖాదారు విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని దిగువ సంతకందారు **తేది. 06-03-2023** న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.
ఈ స్థిరాస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన యెడల అవి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,** వారికి బకాయి మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలకు బద్ధులై ఉంటారని ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

షెడ్యూల్-ఏ: కృష్ణాజిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రేషన్ ఆఫీస్, గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్, విజయవాడ పరిధి, భవానిపురం, యం.పి.దాస్ వీధి, ఆర్.యస్.నెం.72/2, డి.నెం. 76-8/9-12జి, మొత్తం 517 చ.గ.లు లేదా 432.279 చ.మీ.లలో 31.00 చ.గ.లు లేదా 25.92 చ.మీ.ల అవిభాజ్యపు ఉమ్మడి వాటా ఈ దిగువ హద్దులలో **తూర్పు:** పిసిపాటి శ్రీమన్నారాయణ గారి ఆస్తి 55.10 అడుగులు, **దక్షిణం:** 30 అడుగుల వెడల్పు యం.పి దాస్ వీధి, ఏ మున్సిపల్ రోడ్ 82.08 అడుగులు, **పడమర:** క్రాంబే రోడ్, మున్సిపల్ రోడ్ 56.10 అడుగులు, ఉత్తరం: యస్.కె అలీ సాహెబ్ గారి ఆస్థి-82.08 అడుగులు. ఈ నాలుగు సరిహద్దుల మధ్య 517 చ.గ.లు లేదా 432.2798 చ.మీ.లలో 31.00 చ.గ.లు లేదా 25.92 చ.మీ.ల ఉమ్మడి అవిభక్త వాటా గల స్థలం.
షెడ్యూల్-బి: పైన పేర్కొన్న షెడ్యూల్‌లో ఆఫీస్ రూమ్ మరియు స్టోర్ రూమ్‌తో కూడిన ఆర్.సి.సి రూఫ్డ్ అపార్ట్‌మెంట్ "శ్రీ పద్మజ టవర్స్" పేరుతో మరియు శైలిలో నిర్మించబడిన గ్రౌండ్ ఫ్లోర్, శ్రీ రాజపుత్ర మహేంద్ర కార్తీక్ సింగ్, తండ్రి: నాగేంద్ర బాబు గారికి చెందినది (వైడ్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం.2604/2007, తేది: 21.03.2007, యస్.ఆర్.ఓ జిల్లా రిజిస్ట్రేషన్ విజయవాడ) ఈ దిగువ హద్దులలో **తూర్పు:** ఎగ్జిక్యూటెంట్ కార్ పార్కింగ్ ఆస్థి మరియు పాత్‌వే స్థలం, **దక్షిణం:** ఈ దుకాణం మరియు కె.ఆర్ లింగప్రసాద్ గారి దుకాణం మధ్య గల ఉమ్మడి గోడ, బి.సునీత మరియు వి.సరస్వతి, **పడమర:** ఎగ్జిక్యూటెంట్ ఆస్తి, **ఉత్తరం:** ఎగ్జిక్యూటెంట్ ఆస్థి మరియు పాత్‌వే స్థలం యొక్క ఆస్తి. పైన పేర్కొన్న నాలుగు సరిహద్దుల మధ్య 271 చ.అ.ల ప్లింత్ ఏరియా, అన్ని సులభ హక్కులతో.

తేది : **06-03-2023** — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : **విజయవాడ** — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సంపాదకీయం

బొగ్గు కొరత

రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు కనిష్ట స్థాయికి పడిపోవడానికి ప్రణాళిక రాహిత్యమే కారణం. జెన్‌కో ఆధ్వర్యంలో నడిచే అన్ని విద్యుత్ ప్లాంట్లలోనూ ఒక్క రోజుకు సరిపడా బొగ్గు నిల్వలు మాత్రమే ఉండటం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. వేసవిలో విద్యుత్‌కు డిమాండ్ పెరగడం, పెరిగే డిమాండ్‌కు తగ్గట్టు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం కొత్తేమీ కాదు. కొద్దిరోజుల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ దిశలోనే ఒక సమావేశం నిర్వహించి, విద్యుత్ కొరత రాకుండా చూసుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయితే అందుకు తగిన విధంగా ఆచరణ లేదు. పూర్తిస్థాయిలో వేసవి కాలం రాకముందే బొగ్గు కోసం దేవులాడుకునే పరిస్థితి రావడాన్ని ఏమనాలి? నిబంధనల ప్రకారం ప్రతి ప్లాంటులోను కనీసం 15 రోజులకు అవసరమైన బొగ్గును నిలువ ఉంచుకోవాలి. పదహేను రోజుల సంగతి అలా ఉంచి కనీసం రెండు, మూడు రోజులకు కూడా నిల్వలు లేని స్థితికి చేరడానికి కారణం ఏమిటి? అంత కనీస స్థాయికి బొగ్గు నిల్వలు పడిపోతుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తోంది? ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారా లేదా? తీసుకువస్తే ప్రభుత్వ స్థాయిలో స్పందన ఏమిటన్న విషయాలు తేలాల్సి వుంది. ప్రైవేటు ప్లాంట్లకు కూడా బొగ్గును అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ కోల్ ఇండియా ప్రభుత్వ ప్లాంట్లకు సరిపడినంతగా సరఫరాలు ఉండటం లేదని వార్తలు వస్తున్నాయి. ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడింది? కోల్ ఇండియా పూర్తిస్థాయిలో బొగ్గు సరఫరా చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదు? మహానంది గనులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లిస్తే సరఫరాలు కొంత మెరుగుపడే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశలో ఎందుకు ప్రయత్నాలు జరగడం లేదు? వీటికి సంబంధించి పూర్తి వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిఉంది.

దేశీయ బొగ్గు కొరతను సాకుగా చూపుతూ విదేశాల నుండి దిగుమతి చేసుకోవడానికి రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించిన కాంట్రాక్టును అదానీ సంస్థ దక్కించుకోవడం మరింత ఆందోళనకరం. అదానీ గ్రూపు అక్రమాలపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నా, సాక్షాత్తు సుప్రీంకోర్టే ఆ వ్యవహారంపై విచారణ జరుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి ఇసుమంత కూడా పట్టినట్టులేదు. కనీసం విచారణ ప్రక్రియ పూర్తయి, వాస్తవాలు వెలుగులోకి వచ్చేంతవరకు ఆగాలన్న స్పృహ కూడా ప్రభుత్వానికి కొరవడుతోంది. ఒకదాని తరువాత ఒకటిగా వివిధ రంగాలను, మౌలిక వనరులను ఆ సంస్థకు అప్పగించి రాష్ట్రాన్ని అదానీ ప్రదేశ్‌గా మార్చడానికి పరుగులు తీస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో అనేక పోర్టులు, సెజ్‌లు, పంప్డ్ స్టోరేజి, సౌర విద్యుత్ ప్రాజెక్టులను అదానీ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా విదేశీ బొగ్గు సరఫరా కాంట్రాక్టునూ కట్టబెట్టడం ద్వారా కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్వహణను దాదాపుగా అదానీకి అప్పగించినట్టేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో పాటు రాష్ట్ర విద్యుత్ రంగంపై అదానీ పట్టు మరింత బిగియనుంది.

విదేశీ బొగ్గును టన్ను 9 వేల రూపాయలకు మించి కొంటే పెనుభారంగా మారుతుందంటూ గతంలోనే నిపుణులు చేసిన హెచ్చరికలను కూడా బేఖాతరు చేసి అదానీ సంస్థ నుండి 13 వేల రూపాయలకు కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీనివల్ల జరిగే మేలు ఎవరికో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు అవసరమైన ప్రత్యామ్నాయ ప్రణాళికలను అమలు చేయాలి. ప్రభుత్వ రంగ సంస్థల నుండి దేశీయ బొగ్గును సరసమైన ధరకు, సకాలంలో పొందేందుకు ప్రయత్నించాలి. ఈ మేరకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి. మేధావులను, నిపుణులను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలి. ప్రజలపై భారాలు మోపే ఈ తరహా చర్యలను తక్షణం విడనాడాలి. విద్యుత్ రంగంలో ప్రజానుకూల చర్యలను చేపట్టాలి.

మహనీయుల మాట



మన నాగరికతకు యుద్ధం ఎలా చేయాలో తెలుసు కాని, శాంతి ఎలా సాధించాలో తెలియదు.

- గుల్మిల్మో పేరేరో, ఇటాలియన్ రచయిత

విద్యావంతుల విజ్ఞతనే సవాలు చేస్తారా?

విశ్లేషణ

ఎం.వి.ఎస్. శర్మ

"ఈ శాసనమండలి ఎన్నికలు సెమీ ఫైనల్స్"–ఈ మాటలు అన్నది వైఎస్సార్‌సిపి అగ్రనేతల్లో ఒకరైన వై.వి. సుబ్బారెడ్డి. జగన్ కూడా తమ పార్టీ శ్రేణులను ఈ ఎన్నికలలో సర్వశక్తులూ ఒడ్డి పని చేయమని ఆదేశించారు. శాసనమండలిలో ప్రతీ రెండేళ్ళకూ మూడో వంతు స్థానాలు ఖాళీ అవుతూంటాయి. వాటిని భర్తీ చేసేందుకు ఎన్నికలు జరుగుతూంటాయి. ఈ ఎన్నికల్లో ఓటు చేసేవారు సాధారణ ఓటర్లు కారు. కొన్నింటికి కేవలం ఎమ్మెల్యేలే ఓటర్లు. కొన్నింటికి స్థానిక సంస్థల ప్రతినిధులు మాత్రమే ఓటర్లు. కొన్నింటికి ఉపాధ్యాయులే ఓటర్లు. మరికొన్నింటికి పట్టభద్రులు మాత్రమే ఓటర్లు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్లుగా నమోదు చేయించుకున్న పట్టభద్రులు పది లక్షలమంది సుమారుగా ఉంటారు. ఈ విధంగా చాలా పరిమితమైన పరిధిలో ఓటర్ల అభిప్రాయాలు వ్యక్తం అయ్యే ఎన్నికలు సెమీఫైనల్స్ ఎలా అవుతాయి? అదే ఏవో కొన్ని శాసనసభా స్థానాలకు ఉప ఎన్నికలు జరిగినా లేక లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగినా అక్కడ అన్ని తరగతులకూ చెందిన ప్రజానీకం అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఈ శాసనమండలి ఎన్నికలలో ఆ విధంగా వ్యక్తం కాదు. అయినా వైసిపి నేతలు అతిగా హడావుడి చేస్తున్నారు. ఏమిటి కారణం?

వీటిలో ఎమ్మెల్యే కోటా లోని సీట్లు ప్రస్తుతం శాసనమండలిలో ఉన్న బలాబలాలను బట్టి అన్నీ వైఎస్సార్‌సిపి కే దక్కుతాయి. స్థానిక సంస్థల కోటాలో భర్తీ కావలసిన స్థానాలూ ఆ పార్టీకే దక్కుతాయి. ఇక గవర్నర్ నామినేట్ చేసేవి ఎటూ పాలకపార్టీ సిఫార్సు ఆధారంగానే భర్తీ అవుతాయి గనుక అవీ అధికార పార్టీవే.

ఇక మిగిలిపోయినవి రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాల స్థానాలు, మూడు పట్టభద్రుల నియోజకవర్గ స్థానాలు. వీటి విషయంలో వైసిపి ఈ మారు ఎందుకింత ఉలికిపడుతోంది?

పట్టభద్రుల స్థానాల్లో కూడా రాజకీయ పార్టీలు పోటీ పడవచ్చు. దానికి ఎవరూ అభ్యంతరం చెప్పనవసరం లేదు. కాని అధికారంలో ఉన్న పార్టీ హుందాగా, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తే ఓటర్లు గౌరవిస్తారు కాని ఇలా అన్ని విలువలనూ గాలికి వదిలి చౌకబారుతనంగా, అడ్డగోలుగా దిగజారిపోతే ఆ విద్యావంతులు, మేధావులు అయిన ఓటర్లు ఈసడించుకుంటారన్న కనీసమైన ఇంగిత జ్ఞానం కూడా లేకుండా పోవడం చూస్తే కొంత జాలీ, కొంత "అది" కలుగుతోంది.

కనీస విద్యార్హతలు కూడా లేనివారిని ఓటర్లుగా చేర్చేశారు. అంటే అచ్చంగా విద్యావంతులైనవారే ఓటర్లుగా ఉంటే తాము గెలవడం సాధ్యం కాదు అని అధికార పార్టీ ఎన్నికలకు ముందే ఒప్పేసుకుందన్నమాట! అబ్బే, అటువంటిదేమీ కాదు అని వైసిపి చెప్పదలచుకుంటే అర్హత లేని ఓటర్ల పేర్లు తొలగించడంలో తామే ముందుండి వ్యవహరించి వుండాలి. ఎందుకు అలా చేయలేకపోయింది? కనీస స్థాయిలో కూడా నైతిక స్థైర్యం లేని దుస్థితిలో ఆ పార్టీ ఎందుకుంది? వలంటీర్ల వ్యవస్థ స్థాయిలో మొదలుపెట్టి అత్యున్నత స్థాయి అధికారులవరకూ అందరి అధికారాలనూ ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారు? ఎంతో ప్రఖ్యాతి కల ఆంధ్రా యూనివర్సిటీకి ఉపకులపతి హోదాలో ఉండడం అంటే ఎంత ప్రతిష్టాత్మకమైన విషయం! అటువంటి స్థానంలోని వ్యక్తి తన అధికారాన్ని దుర్వినియోగం చేసి మరీ అధికారపార్టీ అభ్యర్థికి ప్రచారం నిర్వహించారంటే వైసిపి దిగజారుడు అధ:పాతాళానికి పోయిందని వేరే చెప్పాలా? అధికార పార్టీ తరఫున కులసంఘాల పేరుతో ప్రచారం జరిగిపోతోంది. డబ్బు విచ్చలవిడిగా వెదజల్లి, కానుకల పేరుతో ప్రలోభపెట్టి ఓటర్లను లొంగదీసుకోవాలన్న పథకాలు అమలులో పెడుతున్నారు. అంటే ఓటర్ల విద్యాస్థాయి పట్ల, వారి మేధో స్థాయి పట్ల పాలక పార్టీకి ఎంత గౌరవం ఉందో తెలిసిపోతూనే వుంది.

2007లో శాసనమండలి పునరుద్ధరణ జరిగింది. అందుకు వై.ఎస్. రాజశేఖరరెడ్డి చొరవ చేశారు. అప్పుడు జరిగిన ఎన్నికలలో గాని, ఆ తర్వాత గాని ఉపాధ్యాయుల, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలలో అధికారికంగా కాంగ్రెస్ పార్టీ జోక్యం చేసుకోబోదని ఆయన స్పష్టంగా ప్రకటించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల పట్ల, సమాజంలోని విద్యావంతుల పట్ల, వారి అభిప్రాయాల పట్ల తనకెంతో గౌరవం ఉందని, తమ పార్టీని విమర్శించినా, వాటిని సలహాలుగానే స్వీకరిస్తానని ఆయన అన్నారు. ఆ కాలంలో ఎమ్మెల్సీలుగా పని చేసిన మాబోటివారు చెప్పిన సలహాలను అన్నింటినీ ఆయన అమలు చేశాడని చెప్పను. చాలా సలహాలను ఆయన అమలు చేయలేదు కూడా. కాని సలహాలను, సూచనలను, విమర్శలను వినే సహనాన్ని ఆయన ప్రదర్శించారు. ఆ రాజశేఖరరెడ్డి బొమ్మ పెట్టుకుని తిరుగుతూ, ఆయన పేరు చెప్పి ఓట్లు దండుకుంటున్న వైసిపికి, ఆ పార్టీ అధినేతకు మాత్రం ఆ అధినేతకున్న సహనంలో వెయ్యో వంతు కూడా లేదు.

> పట్టభద్రుల స్థానాల్లో కూడా రాజకీయ పార్టీలు పోటీ పడవచ్చు. దానికి ఎవరూ అభ్యంతరం చెప్పనవసరం లేదు. కాని అధికారంలో ఉన్న పార్టీ హుందాగా, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తే ఓటర్లు గౌరవిస్తారు కాని ఇలా అన్ని విలువలనూ గాలికి వదిలి చౌకబారుతనంగా, అడ్డగోలుగా దిగజారిపోతే ఆ విద్యావంతులు, మేధావులు అయిన ఓటర్లు ఈసడించుకుంటారన్న కనీసమైన ఇంగిత జ్ఞానం కూడా లేకుండా పోవడం చూస్తే కొంత జాలీ, కొంత 'అది' కలుగుతోంది.

2019లో అధికారం చేపట్టాక ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి నేరుగా ఎన్నిసార్లు సమావేశాలు జరిపారు? ఎన్నిసార్లు వారి అభిప్రాయాలను విన్నారు? ప్రభుత్వం ఆదర్శ యజమానిగా ఉండాలంటారు. ఇదేనా ఆదర్శం? ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్టు జగన్ ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ప్రతినిధులను కలుసుకోడానికి గాని, వారి వినతి పత్రాలను స్వీకరించడానికి గాని సిద్ధంగా లేరు.

జగన్ హయాంలో ఒక్కటంటే ఒక్క అఖిలపక్ష సమావేశం కూడా జరగలేదు. విద్యార్థి, యువజన, మహిళా, నిరుద్యోగ సంఘాల ప్రతినిధులను ఒక్కసారి కూడా చర్చలకు పిలిచింది లేదు. రైతుల గురించి చాలా కష్టపడిపోతున్నట్టు ప్రకటించుకునే ఈ ప్రభుత్వం రాష్ట్రంలోని రైతు సంఘాలతోగాని, రైతుకూలీ సంఘాలతోగాని, దళిత సంఘాలతో గాని ఎప్పుడైనా, ఎక్కడైనా ముఖాముఖి చర్చలు జరిపిందా? ఇది కూడా గత ప్రభుత్వం మాదిరి ముందస్తు అరెస్టుల ప్రభుత్వమే తప్ప ముందస్తు చర్చల ప్రభుత్వం ఎంతమాత్రమూ కాదన్న సంగతి అందరికీ తేటతెల్లం అయిపోయింది.

అదానీలకు, అంబానీలకు రాష్ట్రంలోని పరిశ్రమలను, భూములను కట్టబెట్టే పనిలో చాలా జోరుగా ఈ ప్రభుత్వం ముందుకు పోతోంది. అందుకే రాష్ట్రానికే తలమానికమైన విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేస్తానని మోడీ ప్రభుత్వం ప్రకటించినా, అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని చేయడం మినహా ఇక చేసిందేమీ లేదు. రాష్ట్ర ప్రజానీకపు మనోభావాలను ప్రతిబింబించే విధంగా ఒక అఖిల పక్ష బృందాన్ని ఎందుకు ఢిల్లీ తీసుకుపోలేకపోయారు? ఎందుకు అన్ని సందర్భాలలోనూ బిజెపి కి అనుకూలంగా పార్లమెంటులో వైసిపి ఎంపీలు ఓటు చేస్తున్నారు? విద్య, వైద్యం, విద్యుత్తు, మునిసిపల్ తదితర రంగాలలో మోడీ ప్రభుత్వం ఏం చెప్తే దానికల్లా తలాడించి అమలు చేస్తున్నారు. ఇక ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న స్వయంప్రతిపత్తి ఏమిటి?

ఇదిగో ఇటువంటి విషయాలను శాసనమండలిలోను, వెలుపల లేవనెత్తుతున్నారు గనుకనే పిడిఎఫ్ ఎమ్మెల్సీలంటే అధికార పార్టీకి అంత అక్కసు, గుండెల్లో అంత గుబులు. అందుకే కక్షగట్టి ఈ పిడిఎఫ్ అభ్యర్థులు ఎలాగైనా గెలవకూడదన్న దుగ్ధతో అన్ని విలువలకూ తిలోదకాలిచ్చేశారు. అడ్డగోలు దోవలు తొక్కుతున్నారు.

వైసిపి, దాని అధినేత ఒక్క విషయం మరిచిపోయినట్టు ఉన్నారు. ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజా ఉద్యమాలు వచ్చిన తర్వాతనే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఆ తర్వాత భారత రాజ్యాంగం వచ్చింది. ఆ తర్వాతనే ఈ అసెంబ్లీ, పార్లమెంటు వచ్చాయి. ఎమర్జెన్సీ వంటి అత్యంత నిరంకుశ చర్యలనూ ఓడించనది ప్రజాఉద్యమాలే. చివరికి సైనిక పాలన పెట్టినా, దానిని కూలదోసి మళ్ళీ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలంటే ప్రజా ఉద్యమాలే శరణ్యం. ప్రజా ఉద్యమాలను, ప్రజా సంఘాలను అణగదొక్కజూసిన ప్రతీ నాయకుడూ కాలగర్భంలో కలిసిపోయాడు. కాని ప్రజా సంఘాలు, ప్రజా ఉద్యమాలు కొనసాగుతూనే వున్నాయి. అవి ప్రజల్లోంచి, ప్రజల కోసం పుట్టుకొచ్చినవి. అధికార దాహం లోంచి పుట్టినవి కావు. వాటి ప్రతినిధులు శాసనమండలిలో సభ్యులుగా ఉండడం శాసనమండలికే గౌరవాన్ని ఇచ్చింది, ఇస్తుంది.

డబ్బు పంచిపెట్టకుండా, కానుకలు పంచిపెట్టకుండా, కులం, మతం వంటి అంశాల ప్రస్తావనలు తేకుండా, ప్రచారార్భాటానికి పోకుండా ఓటర్ల విజ్ఞత మీద సంపూర్ణ గౌరవంతో తాము గెలిస్తే ఆ ఓటర్ల వాణిని శాసనమండలిలో బలంగా వినిపిస్తామని మాత్రమే హామీ ఇస్తూ ఓట్లిమ్మనమని అడగగలిగే నైతిక స్థైర్యం ఉన్నది కేవలం ఒక్క పిడిఎఫ్ అభ్యర్థులకు మాత్రమే. గెలిచాక తాము ముందస్తుగా ప్రకటించిన విధానాలకు, విలువలకు పూర్తిగా కట్టుబడి నిస్వార్థంగా, నిజాయితీగా పనిచేస్తూ మాట దక్కించుకోగలుగు తున్నదీ పిడిఎఫ్ అభ్యర్థులు మాత్రమే. ప్రజాస్వామ్య విలువలను, ప్రజాతంత్ర వ్యవస్థను బలంగా నిలుపుకోవాలంటే ఈ తరహా ప్రజాప్రతినిధులే కావాలి అని ఓటర్లు భావించేలా వ్యవహరిస్తున్నదీ పిడిఎఫ్ అభ్యర్థులు మాత్రమే.

పిడిఎఫ్ అభ్యర్థుల మీద కక్ష గట్టి వ్యవహరించడం అంటే అది ప్రజాస్వామ్యానికి ద్రోహం చేయడమే. అటువంటి ద్రోహానికి పాల్పడుతున్న వైసిపికి ఈ 'సెమీ ఫైనల్స్'లో గట్టిగా గుణపాఠం నేర్పడానికి మన రాష్ట్రంలోని విద్యావంతులకు, మేధావులకు వచ్చిన మంచి అవకాశం మార్చి 13న జరగబోయే ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజక వర్గాల ఎన్నికలు. ఈ అవకాశాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకుందాం.

/ వ్యాసకర్త : పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ /

★

కత్తిరింపులు



ప్రశ్నార్థకమవుతున్న ప్రజాస్వామ్యం

ప్రధాని నరేంద్ర మోడీని 'విశ్వగురువు'గా అభివర్ణిస్తూ బిజెపి ప్రచారం చేస్తోంది. భారతదేశం జి–20 అధ్యక్ష బాధ్యతలు స్వీకరించినపుడు ఈ ప్రచారం గరిష్ట స్థాయికి చేరుకుంది. అదే సమయంలో మోడీ ప్రభుత్వాన్ని అంతర్జాతీయ సమాజం ఎలా చూస్తున్నదో స్పష్టం చేసే నివేదికలు వస్తున్నాయి. భారతదేశంలో అత్యంత దారుణమైన నియంతత్వం నెలకొందని పాశ్చాత్య పరిశోధనా సంస్థలు ఎత్తిచూపుతున్నాయి. స్వీడన్ లోని గోథెన్‌బర్గ్ విశ్వవిద్యాలయానికి చెందిన వి–డెమ్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక ప్రకారం పదేళ్లలో అత్యంత దారుణమైన నియంతృత్వం ఉన్న దేశాల్లో భారత్ ఒకటిగా మారిందని పేర్కొంది. 2021 నివేదికలో, వి–డెమ్ భారతదేశాన్ని ఓటింగ్ ద్వారా నియంతృత్వం వచ్చిన దేశంగా అభివర్ణించింది. భారతదేశంలో స్వేచ్ఛ పాక్షికంగా వుందని అదే సంవత్సరంలో వాషింగ్టన్ డి.సి ఆధారిత ఫ్రీడమ్ హౌస్ ఒక నివేదికలో పేర్కొంది. గత ఏడాది ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారత్ 142వ స్థానానికి పడిపోయింది.

తప్పుడు సమాచారం, నిరంకుశత్వం, మత సమీకరణ పరస్పర సంబంధం కలిగి ఉన్నాయని వి–డెమ్ నివేదిక పేర్కొంది. దేశ ఎన్నికలలో బిజెపి విజయం సాధించడం వల్ల మత సమీకరణలు మరింత గట్టిపడుతున్నాయి. నకిలీ వార్తలను విస్తృతంగా వ్యాప్తి చేయడం ద్వారా ప్రజలను మతపరమైన మార్గాల్లో విభజిస్తున్నది. ఈ విధంగా అధికారం చేజిక్కించుకున్న తర్వాత కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ బిజెపి ప్రభుత్వాలు నియంతృత్వ ధోరణిలో పనిచేస్తున్నాయి. రాజకీయ వ్యతిరేకతను తొలగించడానికి అన్ని మార్గాలను ఉపయోగిస్తాయి. వీలున్న చోట కొనుగోళ్లకూ వెనకాడవు. కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేయడమే కాకుండా, అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై బిజెపి కార్యకర్తలు భౌతిక దాడులు చేస్తున్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ఒక కలగా మారుతోంది.

బిజెపి ని, సంఘ్‌పరివార్‌ను విమర్శించే నాయకులు, సాంస్కృతిక కార్యకర్తలు, జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలను జైళ్లలో పెడుతున్నారు. ఇందులో భాగంగానే స్టాన్‌స్వామి జ్యుడీషియల్ కస్టడీలో మరణించారు. మోడీ ప్రభుత్వ క్రోనీ క్యాపిటలిజాన్ని బట్టబయలు చేసే జర్నలిస్టులపై వేటు పడింది. కోవిడ్ కాలంలో మానవ హక్కుల ఉల్లంఘనలను, ప్రభుత్వ తప్పుడు నిర్వహణా పద్ధతులను బహిర్గతం చేసినందుకు అమ్నెస్టీ ఇంటర్నేషనల్‌పై ఇ.డి చర్య తీసుకుంది. దేశంలో బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసిన తర్వాత 2020 సెప్టెంబర్ నుండి ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ భారతదేశంలో కార్యకలాపాలను నిలిపివేసింది. గుజరాత్ మారణహోమంలో బిజెపి పాత్రను వెలుగులోకి తెచ్చినందుకు తీస్తా సెతల్వాద్, రాణా అయూబ్‌లపై కేసులు నమోదయ్యాయి.

దేశంలోని సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. బిజెపి యేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లను ఉపయోగించుకుని ఆ యా ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నది. విద్య, వ్యవసాయం, అటవీ, ఓడరేవుల రంగాల్లో రాష్ట్రాలు దోపిడీకి గురవుతున్నాయి. కొలీజియం విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి స్వతంత్ర న్యాయవ్యవస్థ ఆలోచనకు వ్యతిరేకమైనది. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు సుప్రీంకోర్టును సవాలు చేసే విధంగా మాట్లాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ రాజకీయ ప్రయోజనాలను కాపాడేందుకు ఎన్నికల కమిషన్ సహా రాజ్యాంగ సంస్థలను సాధనాలుగా మార్చుకున్నారన్న ఆరోపణలు వెలువడుతున్నాయి.

దేశ వ్యాప్తంగా హిందీ భాషను ప్రయోగించాలనే ఎత్తుగడ, దుస్తులు, తిండి పేరుతో నిషేధాలు, అణచివేతలు, మైనార్టీలపై దాడులు వంటివి నిరంకుశత్వానికి సంకేతాలు. దేశంలో మైనారిటీల మీద జరుగుతున్న వేధింపులపై యూరప్, అమెరికాలోని పార్లమెంటరీ గ్రూపులు ఆందోళన వ్యక్తం చేశాయి. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ట బిజెపి చేస్తున్న ప్రచారార్భాటానికి పూర్తి వ్యతిరేకంగా వుంది. మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాలను, వాటి విమర్శలను నిందిస్తూ అణిచివేసేందుకు పదే పదే ప్రయత్నిస్తూ...దేశాన్ని ఈ సమస్య నుంచి బైటపడవేయలేదు.

('దేశాభిమాని' సంపాదకీయం)

చైనా ద్రవ్య రంగ క్రమబద్ధీకరణకు కొత్త అడుగు!

విమర్శ

ప్రపంచంలో రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశం చైనా. కొనుగోలు శక్తి (పిపిపి) పద్ధతిలో లెక్కించినపుడు జిడిపిలో అది తొలి స్థానంలో ఉంది. సాంప్రదాయ లెక్కింపులో త్వరలో అమెరికాను అధిగమించి అగ్రస్థానానికి చేరనుందని అందరూ చెబుతున్నదే. దీని అర్థం అమెరికా లేదా ఐరోపా ధనిక దేశాల స్థాయికి చేరిందని కాదు. ఇటీవలి కాలంలో తలెత్తిన సమస్యల పూర్వరంగంలో చైనా ద్రవ్య లేదా విత్త రంగాన్ని మరింతగా క్రమబద్ధీకరించే పెను మార్పులను ప్రకటించారన్నది తాజా వార్త. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో దానికి తుదిరూపం ఇస్తారు. మారుతున్న పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా మారకపోతే అదే పెద్ద ఆటంకంగా మారుతుంది. చైనాలో ఏం జరిగినా అది కొంత మందికి వింతగానూ మరి కొందరికి ప్రతికూలంగా కనిపిస్తుంది. అనేక దేశాల్లో ముందుగానే టాంటాం వేస్తే ఒక విధానంపై చైనాలో అంతర్గతంగా చర్చ జరిపి సిద్ధంకాగానే ప్రకటన, అమలు చేస్తారు. ఏ పద్ధతిలో చేశారు అనేదానికంటే ప్రకటించిన విధానం ఎలాంటి ఫలితాలను ఇచ్చిందన్నదాన్ని గీటురాయిగా తీసుకోవాలి. మన దేశ మార్కెట్‌ను స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విదేశాలకు తెరిచాము. కానీ చైనా 1978లో ఆ పని చేసింది. రెండు దేశాలూ సాధించిన వృద్ధిని చూస్తే నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా కనిపిస్తుంది.

తమ దేశ లక్షణాలతో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం జరుపుతున్నట్లు చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. దాన్లో భాగంగానే గత నాలుగున్నర దశాబ్దాల్లో వచ్చిన అనుభవాలు, తలెత్తిన ప్రతికూల సమస్యలు, తాజాగా అమెరికా, ఇతర ధనిక దేశాల నుంచి ఎదురవుతున్న కొత్త సవాళ్ల నేపథ్యంలో విత్త రంగ నియంత్రణలో పెను మార్పులను తలపెట్టింది. బ్యాంకింగ్, బీమా రంగాల్లో ఉన్న సంపద విలువ 400 లక్షల కోట్ల ఇవాన్‌లు లేదా 57.7 లక్షల కోట్ల డాలర్లు. ఇటీవలి కాలంలో కొన్ని చోట్ల పేలినట్లు చెబుతున్న నిర్మాణ రంగ బుడగలు, దివాలా తీసిన బ్యాంకులు, వీధుల్లోకి వచ్చిన జనం, జాక్ మా వంటి వారు చిన్న కంపెనీలను మింగివేసేందుకు చూడగా అదుపు చేసిన తీరు, కంపెనీల్లో మదుపుదార్లకు రక్షణ వంటి అనేక అంశాలు ఒక సమగ్రమైన నియంత్రణ వ్యవస్థను తీసుకురావాల్సి అవసరాన్ని ముందుకు తెచ్చాయి. అంతేకాదు బిఆర్‌ఐ పేరుతో వివిధ దేశాల్లో పెడుతున్న పెట్టుబడులు, ఇస్తున్న రుణాల గురించి పెద్ద ఎత్తున చైనా వ్యతిరేకులు చేస్తున్న తప్పుడు ప్రచారం గురించి తెలిసిందే. ఏక గవాక్షం ద్వారా ఇలాంటి వాటిని నడిపించటం, జవాబుదారీతనాన్ని పెంచటం కూడా తాజా మార్పుల వెనుక ఉంది.

> చైనా పార్లమెంటు ప్రస్తుతం చర్చిస్తున్న మరో ప్రధాన అంశం ఆర్థిక, విత్త రంగాల డిజిటలైజేషన్ వంటి కృత్రిమ మేధ పద్ధతుల ద్వారా జనానికి, ఇతర దేశాలకు సులభంగా సేవలను అందించటం. అమెరికా, ఐరోపా దేశాలతో పోటీ పడేట్లు తీర్చిదిద్దటం. అలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని చైనాకు అందకుండా కట్టడి చేసేందుకు ఆ రంగంలో ముందున్న దేశాలను కూడగట్టుకొని అమెరికా సాంకేతిక పోరును ప్రారంభించింది. దాన్ని అధిగమించకపోతే చైనా పురోగమనానికి తాత్కాలికంగానైనా కొన్ని ఆటంకాలు తలెత్తుతాయి. అందుకే యుద్ధ ప్రాతిపదికన అవసరమైన శాస్త్ర, పరిశోధన అభివృద్ధి రంగాలను నడిపించాలని చైనా నిర్ణయించింది.

దీని అర్థం అక్కడేదో అదానీ కంపెనీల వంటి భారీ కుంభకోణాలో, ఆర్థిక రంగాన్ని కుదేలు చేసే పరిణామాలో జరిగినట్లు కాదు. మన దేశం ప్రతి రాష్ట్రానికి ఒక రిజర్వుబ్యాంకు శాఖ ఉంటే చైనా రిజర్వుబాంకు శాఖలు కేవలం పదకొండు మాత్రమే. మన జిడిపి మూడున్నర లక్షల కోట్ల డాలర్లు కాగా పదిహేడున్నర లక్షల కోట్ల డాలర్లతో చైనా ఉంది. అందువలన చైనా రిజర్వుబాంకు విస్తరణ కూడా తాజాగా తలపెట్టిన మార్పుల్లో ఒకటి. వివిధ రంగాలకు ఉన్న నియంత్రణ వ్యవస్థలు ఒకదానికి మీదకు ఒకటి రావటం వంటి లోపాలను అవకాశంగా తీసుకొని అక్రమాలకు పాల్పడిన వారిని అనేక మందిని శిక్షించారు. పెద్ద సంఖ్యలో ఉన్న విదేశీ సంస్థలు వాటి ఆర్థిక, ద్రవ్య సంబంధ లావాదేవీలు, వాటి సంపద కూడా తక్కువేమీ కాదు. వాటన్నింటిని మరింతగా నియంత్రించాల్సిన అవసరం ఉంది. ఈ చర్యల ద్వారా చైనా కమ్యూనిస్టు పార్టీ, తద్వారా అధినేత సీ జిన్‌పింగ్ నియంత్రణ, అధికారం మరింతగా విస్తరించుకొనేందుకే అని విదేశాల్లో కొందరు చిత్రించటంలో అర్థం లేదు. తమ అక్రమాలకు దారులు బంద్ అవుతున్నాయనే ఏడుపు తప్ప మరొకటి కాదు. మన దేశంలో హర్షద్ మెహతా, కేతన్ పరేఖ్ వంటి స్టాక్‌బ్రోకర్లు కంపెనీలతో కుమ్మక్కై వాటాలకు లేని విలువలను సృష్టించి మదుపుదార్లను నిలువునా ముంచిన సంగతి తెలిసిందే. సత్యం పేరుతో కంపెనీ తెరిచి అసత్యాలతో కొంపలు ముంచిన ఘనుల గురించి చెప్పనవసరం లేదు. ఇప్పుడు అదానీ కంపెనీల కథ కూడా అదే అన్న ఆరోపణ వస్తే వ్యవస్థ సంస్కరణ సంగతి తరువాత అసలు నిజాల నిగ్గుదేల్చే విచారణకే నరేంద్ర మోడీ సిద్ధం కాలేదు. ఇప్పుడు చైనాలో తలపెట్టిన మార్పుల్లో స్టాక్ మార్కెట్ నియంత్రణ కూడా కేంద్ర మంత్రివర్గ పరిధిలోకి రానుంది.

చైనా పార్లమెంటు ప్రస్తుతం చర్చిస్తున్న మరో ప్రధాన అంశం ఆర్థిక, విత్త రంగాల డిజిటలైజేషన్ వంటి కృత్రిమ మేధ పద్ధతుల ద్వారా జనానికి, ఇతర దేశాలకు సులభంగా సేవలను అందించటం. అమెరికా, ఐరోపా దేశాలతో పోటీ పడేట్లు తీర్చిదిద్దటం. అలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని చైనాకు అందకుండా కట్టడి చేసేందుకు ఆ రంగంలో ముందున్న దేశాలను కూడగట్టుకొని అమెరికా సాంకేతిక పోరును ప్రారంభించింది. దాన్ని అధిగమించకపోతే చైనా పురోగమనానికి తాత్కాలికంగానైనా కొన్ని ఆటంకాలు తలెత్తుతాయి. అందుకే యుద్ధ ప్రాతిపదికన అవసరమైన శాస్త్ర, పరిశోధన అభివృద్ధి రంగాలను నడిపించాలని చైనా నిర్ణయించింది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న జాతీయ విత్త క్రమబద్ధీకరణ కమిషన్ (ఎన్‌ఎఫ్ఆర్‌సి)లో ఇది కూడా భాగంగానే ఉండనుంది. సీ జిన్‌పింగ్ 2013లో అధికారానికి వచ్చిన తరువాత మూడు అంశాల పునర్వ్యస్థీకరణల మీద కేంద్రీకరించారు. ఒకటి ద్రవ్య స్థిరత్వము–అభివృద్ధి కమిషన్, రెండవది వృద్ధుల వ్యవహారాల మంత్రిత్వశాఖ, మూడవది తాజా అంశం. అనేక ఐరోపా దేశాలు వందల సంవత్సరాల పాటు అభివృద్ధి చెందిన తరువాత జనాభా పెరుగుదల తగ్గి, వృద్ధుల సంఖ్య పెరగటాన్ని చూశాము. ఇప్పుడు చైనా ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉండగానే ఆ సమస్యలను ఎదుర్కొంటున్నది. సోషలిస్టు వ్యవస్థలో మానవాభివృద్ధి, దానిలో భాగంగా జీవితకాలం పెరగటం దీనికి ఒక కారణంగా చెప్పవచ్చు. అందువలన చైనా సమాజం ఈ సవాళ్లను కూడా అధిగమించే సత్తా, ముందు చూపు కలిగి ఉందని చెప్పవచ్చు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

★

దేశంలో కోటి మందికి పైగా వృద్ధులకు మతిమరుపు

న్యూరో ఎపిడెమియాలజీ జర్నల్ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో 60 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న కోటి మందికిపైగా వృద్ధులు మతి మరుపు (డెమెంటియా)తో బాధపడుతున్నారు. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ వంటి దేశాలతో సమానంగానూ భారత్‌లోనూ ఈ వ్యాధి ప్రాబల్య రేటు ఉంది. అయితే ఆయా దేశాల్లో మాదిరిగా మనదేశంలో ఈ వ్యాధిని తీవ్రంగా పరిగణించడం లేదు. డెమెంటియా అనేది జ్ఞాపకశక్తి, ఆలోచన, తార్కికం, జడ్జిమెంట్ వంటి మానసిక ప్రక్రియల బలహీనతకు దారి తీస్తుంది. తద్వారా రోజువారీ విధులను నిర్వహించే వ్యక్తి సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. తాజాగా ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం 2050 నాటికి దేశంలో 60 ఏళ్లు దాటిన వారు మొత్తం జనాభాలో 19.1 శాతం ఉంటారని అంచనా. వృద్ధుల జనాభా

పెరుగుదలతో ఈ వ్యాధి బాధితులు కూడా పెద్ద సంఖ్యలో పెరుగుతారు. 31,477 మంది వృద్ధుల నుంచి సేకరించిన సమాచారాన్ని సెమీ-పర్‌వైజ్డ్ మెషిన్ లెర్నింగ్ అనే కృతమ మేధస్సు (ఎఐ) సాంకేతికత ఉపయోగించి విశ్లేషించారు. దీని ఆధారంగా న్యూరో ఎపిడెమియాలజీ జర్నల్‌లో తాజా పరిశోధన ప్రచురించారు. దేశంలో 60 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వృద్ధుల్లో డెమెంటియా ప్రాబల్యం రేటు 8.44 శాతంగా ఉంటుందని పరిశోధకుల బృందం అంచనా వేసింది. ఇది 10.08 మిలియన్ల జనాభాకు సమానం. అలాగే అమెరికాలో 8.8 శాతం, ఇంగ్లండ్‌లో 9 శాతం, జర్మనీలో 8.5 శాతం, ఫ్రాన్స్‌లో 9 శాతంగానూ ఈ వ్యాధి ప్రాబల్య రేటుకు సమానంగా భారత్‌లో ఉంది. మహిళలు, నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు ఈ వ్యాధితో ఎక్కువగా బాధపడుతున్నారు.

ఢిల్లీ మంత్రులుగా అతిషి, సౌరభ్ ప్రమాణం

న్యూఢిల్లీ : ఆమాద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలు సౌరభ్ భరద్వాజ్, అతిషి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేబినెట్‌లో నూతన మంత్రులుగా పదవీ స్వీకార ప్రమాణం చేశారు. స్థానిక రాజ్‌నివాస్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం 4 గంటలకు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సిఎం కేజ్రీవాల్ సమక్షంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా వీరిద్దరితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రామ్‌వీర్ సింగ్‌బిధురి సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఇటీవల ఢిల్లీ మద్యం కేసులో మనీశ్ సిసోడియాను సిబిఐ అరెస్టు చేయడం, అంతకముందు మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన సత్యేందర్ జైన్ తమ మంత్రి పదవులకు ఇటీవల రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఖాళీ అయిన రెండు మంత్రి పదవులను భర్తీ చేశారు. సిసోడియా నిర్వహించిన విద్యాశాఖతో పాటు పబ్లిక్ వర్క్స్, విద్యుత్, పర్యాటక శాఖలను అతిషీ చూడనున్నారు. అలాగే, గతంలో జైన్ చూసిన వైద్య ఆరోగ్య శాఖతో పాటు పట్టణాభివృద్ధి, జలవనరులు, పరిశ్రమల శాఖలను ఇకనుంచి భరద్వాజ్ నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ నెల 17 నుంచి జరిగే బడ్జెట్ సమావేశాల్లో వీరిద్దరు మంత్రులూ పాల్గొననున్నారు. 2013 నుంచి ఎమ్మెల్యేగా ఉన్న భరద్వాజ్.. కేజ్రీవాల్ సారథ్యంలో తొలిసారి ఏర్పాటైన ప్రభుత్వంలో కొద్ది కాలం పాటు మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం ఆప్ జాతీయ అధికార ప్రతినిధిగా ఉన్న ఆయన.. ఢిల్లీ జల్ బోర్డు ఉపాధ్యక్షులు కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అతిషీ విషయానికి వస్తే.. పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా ఉండే ఆమె 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. సిసోడియా విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆయనకు సలహాదారుగానూ కూడా ఆమె సేవలందించారు.

ప్రతిపక్షాల ఐక్యతకు పిలుపు ఇచ్చినందుకే బిజెపి కుట్ర

- తమిళనాడు సిఎం స్టాలిన్

చెన్నై : తమిళనాడులో వలస కార్మికులపై దాడులు జరుగుతున్నాయంటూ బిజెపి నేతలు ఇటీవల పుకార్లు సృష్టించడంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఇక్కడ జరిగిన 'ఉంగలిల్ ఒరువన్' అనే కార్యాక్రమంలో స్టాలిన్ మాట్లాడారు. కేంద్రంలో మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు ప్రతిపక్షాల ఐక్యతకు పిలుపు ఇచ్చినందునే బిజెపి ఈ విధమైన కుట్రకు పాల్పడిందని ఆయన విమర్శించారు. ప్రతిపక్షాల ఐక్యతకు తాను పిలుపునిచ్చిన మరుసటి రోజే బిజెపి తమిళనాడులో అశాంతి సృష్టించేందుకు వదంతులు వ్యాప్తి చేసిందని ఆయన తెలిపారు.

దీనిని బట్టే దీని వెనుక ఉన్న కుట్ర అర్థమవుతుందన్నారు. తమిళనాడులో అల్లర్లు సృష్టించాలనే ఉద్దేశ్యంతో ఉత్తర భారత్ చెందిన బిజెపి నాయకులు ఈ కుట్రకు పాల్పడ్డారని విమర్శించారు. 'ఉత్తర భారత్ బిజెపి నాయకులే ఈ కుట్రకు పాల్పడ్డారు. అక్కడి కార్మికులు ఇక్కడ ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్నారు. ఇటీవలకాలంలో వారి సంఖ్య పెరిగింది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నాం. కానీ దాడి జరిగినట్లు కొందరు నకిలీ వీడియోలు సృష్టించారు' అని స్టాలిన్ తెలిపారు. ఈ వదంతుల వ్యాప్తి కేసులో తమిళనాడు బిజెపి ఛీఫ్ అరెస్టు అయిన సంగతి తెలిసిందే.

ఆఫ్ఘనిస్తాన్ గవర్నర్ కార్యాలయంలో పేలుళ్లు

- ఆయనతో సహా ముగ్గురు మృతి

కాబూల్ : అఫ్గానిస్తాన్‌లో శాంతిభద్రతలు పూర్తిగా మెరుగుపడటం లేదు. పేలుళ్ల ఘటనలు తరుచూ కొనసాగుతూనేవున్నాయి. తాజాగా బాల్ ప్రావిన్సు గవర్నరు మహ్మద్ దావూద్ ముజమ్మిల్ కార్యాలయంలోని రెండో అంతస్తులో గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ పేలుళ్లలో గవర్నర్‌తో పాటు మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని, పలువురు గాయపడ్డారని స్థానిక పోలీసులు తెలిపారు. 2021లో తాలిబాన్ అధికారంలోకి వచ్చిన తర్వాత చనిపోయిన తాలిబాన్ నేతల్లో అత్యంత సీనియర్ నేత ముజమ్మిల్ కావడం విశేషం. వాస్తవానికి అమెరికా, నాటో సైనిక బలగాల నిష్క్రమణ తర్వాత అఫ్గానిస్తాన్‌లో హింస క్రమంగా తగ్గుముఖం పట్టింది. అయితే ఇస్లామిక్ స్టేట్ వంటి ఉగ్రవాద సంస్థలు దాడులకు పాల్పడుతూనేవున్నాయి. తాలిబాన్ అనుకూల నాయకులే ఈ దాడులకు ఎక్కువగా గురవుతున్నారు. చాలా దాడులకు తామే బాధ్యులమని ఇస్లామిక్ స్టేట్ ప్రకటించింది కూడా. గవర్నరు కార్యాలయంలో గురువారం జరిగిన దాడికి కారణాలు స్పష్టంగా తెలియరాలేదని స్థానిక పోలీసులు చెప్పారు. అయితే, 'ఇస్లాం శత్రువులు జరిపిన పేలుడులో గవర్నర్ మరణించారు' అని తాలిబాన్ ప్రతినిధి జబివుల్లా ముజాహిద్ ట్విట్టర్‌లో తెలిపారు. ముజమ్మిల్ గతంలో నంగర్‌హర్ ప్రావిన్సులో ఇస్లామిక్ స్టేట్ ఫైటర్స్‌పై జరిగిన పోరాటానికి గవర్నర్‌గా నాయకత్వం వహించినట్లు చెబుతారు. ఆయన గతేడాది అక్టోబర్‌లో బాల్‌కు వచ్చారు.

నేపాల్ కొత్త అధ్యక్షుడిగా రామ్ చంద్ర పౌడెల్

ఖాట్మండు: నేపాల్ కొత్త అధ్యక్షుడిగా రామ్ చంద్ర పౌడెల్ ఎన్నికయ్యారు. నేపాలీ కాంగ్రెస్‌కు చెందిన 78 ఏళ్ల పౌడెల్‌కు 33,702 ఎలక్టొరల్ ఓట్లు (64 శాతం)లభించగా, ఆయన ప్రత్యర్థి సిపిఎన్(యుఎంఎల్)కు చెందిన సుభాష్ చంద్ర నెంబ్‌వాంగ్‌కు 18, 518 ఓట్లు (35.23 శాతం) లభించాయి. దీంతో పౌడెల్ ఎన్నికైనట్లు నేపాల్ ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. ఎలక్టొరల్ కాలేజీలో మొత్తం 882 మంది ప్రజా ప్రతినిధులు (332 మంది ఎంపీలు, 550 మంది ఎమ్మెల్యేలు)ఉండగా ఓటింగ్‌లో 831 మంది (313 మంది ఎంపీలు, 518 మంది ఎమ్మెల్యేలు) మాత్రమే పాల్గొన్నారు. రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ (ఆర్‌పిపి), నేపాల్ వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ ఓటింగ్‌లో పాల్గొనలేదు. పౌడెల్‌కు అనుకూలంగా 214 మంది ఎంపీలు, 352 మంది ఎమ్మెల్యేల ఓటు చేశారు.పౌడెల్‌కు నేపాలీ కాంగ్రెస్‌తోబాటు ప్రధాని పుష్ప కమల్ దహల్ 'ప్రచండ' నేతత్వంలోని ఎనిమిది పార్టీల కూటమి మద్దతు తెలిపింది. మొదట నేపాలీ కమ్యూనిస్టు పార్టీ (యుఎంఎల్) అభ్యర్థికి మద్దతు ఇస్తానని చెప్పి, ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ప్లేటు ఫిరాయించి, నేపాలీ కాంగ్రెస్ అభ్యర్థిని బలపరుస్తున్నట్టు ప్రధాని ప్రచండ ప్రకటించడంతో ఆయన ప్రభుత్వానికి యుఎంఎల్ తన మద్దతు ఉపసంహరించుకోవడం.ఆ వెంటనే నేపాలీ కాంగ్రెస్ ఆయనకు మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. 'అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు నా స్నేహితుడు రామ్ చంద్ర పౌడెల్‌కి హదయపూర్వక అభినందనలు' అని నేపాలీ కాంగ్రెస్ చీఫ్ షేర్ బహదూర్ దేవ్‌బా ట్వీట్ చేశారు.2008లో నేపాల్ రిపబ్లిక్‌గా అవతరించిన తర్వాత జరిగిన మూడవ అధ్యక్ష ఎన్నిక ఇది. ప్రస్తుత అధ్యక్షురాలు బిద్యా దేవి భండారీ పదవీ కాలం ఈ నెల 12తో ముగియనుంది. అధ్యక్షుని పదవీకాలం ఐదు

సంవత్సరాలు ఉంటుంది. 1944 అక్టోబరు 14న ఓ మధ్యతరగతి రైతుల కుటుంబంలో జన్మించిన పౌడెల్ తన16 వయేటనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా, పార్లమెంటు స్పీకర్‌గా, ప్రతిపక్ష నాయకునిగా వివిధ హెూదాల్లో పనిచేశారు. ప్రజాస్వామ్యం, సోషలిజం, వ్యవసాయం గురించి డజనుకు పైగా పుస్తకాలను రచించారు.. వివిధ వార్తాపత్రికలలో డజన్ల కొద్దీ వ్యాసాలు రాశారు. కొంతకాలం పాత్రికేయుడిగా కూడా పనిచేశారు..పౌడెల్ నేపాలీ భాష ప్రధాన సబ్జెక్ట్‌గా ఆర్ట్స్‌లో మాస్టర్స్ డిగ్రీని పొందారు ఆయనకు భార్య, ఒక కుమారడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

మహిళా ఆర్థిక సాధికారతకు కృషి : లూలా

బ్రెసిలియ : మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా, లింగ సమానత్వంతోపాటు, ఆర్థిక సమానత్వం కోసం లూలా ప్రభుత్వం కృషి చేస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవంనాడు మహిళలకు అనుకూలమైన విధానాలను రూపొందించి.. వాటిని అమలు చేయనున్నట్లు బ్రెజిల్ అధ్యక్షులు లూలా ప్రకటించారు. బుధవారం రోజు (మార్చి 8)న బ్రెసిలియాలోని ప్లానాల్టో ప్యాలెస్‌లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకులకు ఆయన హాజరయ్యారు. ఈ వేడుకల్లో లింగ సమానత్వానికి అనుకూలంగా బిల్లును ఆయన ప్రవేశపెట్టారు. ఈ బిల్లుతో రాబోయే రోజుల్లో పురుషులతో సమానంగా మహిళలకు అక్కడ జీతం వర్తించనుంది. ప్రస్తుతం బ్రెజిల్‌లో పురుషులతో సమానంగా పనిచేస్తున్నా..వారికంటే 22 శాతం తక్కువ జీతాన్ని పొందుతున్నారు. పనితోపాటు, జీతం సమానం కోసమే లూలా ఈ బిల్లును ప్రవేశపెట్టారు.

కొరివితో తలగోక్కుంటున్న ఉక్రెయిన్

- రష్యా సరిహద్దు ప్రాంతాల ఆక్రమణకు యత్నం
- దీటుగా రష్యా సమాధానం

మాస్కో : అమెరికా, నాటో దేశాల చేతిలో కీలుబొమ్మగా మారిన ఉక్రెయిన్ అక్కడి ప్రజల ప్రాణాలను సైతం పణంగా పెడుతోంది. రష్యా సరిహద్దు ప్రాంతాలను ఆక్రమించేందుకు యత్నిస్తూ భారీ మూల్యం చెల్లిస్తోంది. ఈ పరిణామాలతో ఉక్రెయిన్‌లోని పలు నగరాలపై రష్యా మళ్లీ సైనిక ఆపరేషన్ చేపట్టింది.ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని పశ్చిమ, దక్షిణ భాగాలపై దాడులు నిర్వహించింది. ఈ దాడిలో చాలా వాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రజలు షెల్టర్లలోనే ఉండాలని కీవ్ మేయర్ అభ్యర్థించారు. నగరంలో ప్రతి 10 ఇళ్లలో నాలుగు చోట్ల విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని ఉక్రెయిన్ రక్షణశాఖ ధ్రువీకరించింది. రష్యాకు చెందిన 34 క్షిపణులను, షాహిద్ డ్రోన్లను కూడా కూల్చివేసినట్లు వెల్లడించింది. అయితే సరిహద్దు ఆక్రమణకు ఉక్రెయిన్ పాల్పడుతున్నందునే సైనిక దాడులు చేయాల్సివస్తోందని రష్యా ప్రకటించింది. కాగా రష్యా స్వాధీనంలో ఉన్న జపోరిజియా అణు విద్యుత్తు కేంద్రానికి ఉక్రెయిన్ విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని అణుకేంద్రం నిర్వహిస్తున్న ఎనర్గోఆటమ్ ఉద్యోగి ఒకరు వెల్లడించారు. అణువిద్యుత్తు కేంద్రానికి ఉక్రెయిన్ విద్యుత్తు సరఫరా నిలిపివేయడం కవ్వింపు చర్యే అని రష్యా వ్యాఖ్యానించింది. రేవు నగరమైన ఒడెస్సాలో విద్యుత్తు వ్యవస్థలపై భారీగా క్షిపణి దాడులు జరిగాయి. దీంతో చాలా చోట్ల విద్యుత్తు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. జనవరి తర్వాత ఉక్రెయిన్‌పై జరిగిన రష్యా ఇంత భారీ స్థాయిలో సైనిక చర్యకు పాల్పడటం ఇదే తొలిసారి.

క్యూబాలో కొలంబియా శాంతి చర్చలు

బొగోటా : కొలంబియా ప్రభుత్వానికి, నేషనల్ లిబరేషన్ ఆర్మీ (ఇఎల్ఎన్) మధ్య జరగనున్న శాంతి చర్చలకు క్యూబా ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మేరకు క్యూబా అధ్యక్షులు గుస్తావో పెట్రో పార్టీ హ్యూమన్ కొలంబియా, ఇఎల్ఎన్ పార్టీలు మెక్సికో సిటీ నుండి ఉమ్మడి ప్రకటన చేశాయి. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశాల జాబితాలో కరేబియన్ దీవిని చేర్చడం అన్యాయమని ఈ ప్రకటన తెలిపింది. కొలంబియన్ల మధ్య సయోధ్యకు, శాంతి చర్చలకు క్యూబా ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందని ఈ ప్రకటన పేర్కొంది. త్వరలో క్యూబాలో జరగనున్న శాంతి చర్చలకు రెండు పార్టీలకు సంబంధించిన ప్రతినిధులు క్యూబాకు వెళ్లనున్నారు. కాగా, ఈ శాంతి చర్చలపై క్యూబా అధ్యక్షులు మిగ్యుల్ డియాజ్ కానెల్ మాట్లాడుతూ శాంతి చర్చలకు తాము చేసిన అభ్యర్థనను అంగీకరించడం ఇరు పార్టీలూ క్యూబా ప్రభుత్వానికి ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు.

ఈ చర్చలు సోదర దేశంలో శాంతి చేకూర్చడానికి దోహదం చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మొదటి దఫా చర్చలు వెనిజులాలోని కారకాస్‌లో జరిగాయి. రెండో దఫా చర్చలు మెక్సికో సిటీలో జరుగుతున్నాయి. ఈ సమావేశాల తదనంతరం మూడో దఫా చర్చలు క్యూబాలో జరగనున్నాయి. తొలి రెండు శాంతి సమావేశ చర్చల్లో క్యూబా పాల్గొంది.

నేడు బెంగాల్‌లో ఉద్యోగుల సమ్మె

కోల్‌కతా : డిఎ పెంచాలని కోరుతూ పశ్చిమ బెంగాల్‌లో ఉద్యోగులు శుక్రవారం సమ్మెకు దిగనున్నారు. ఈ మేరకు శుక్రవారం సమ్మెకు పశ్చిమ బెంగాల్‌లో కొన్ని ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. మరోవైపు ఉద్యోగుల సమ్మెపై మమతా ప్రభుత్వం కూడా పట్టుదలగా ఉంది. శుక్రవారం సెలవు అనుమతించమని, శుక్రవారం విధులకు హాజరు కాకపోతే సర్వీస్‌లో బ్రేక్‌గా పరిగణిస్తామని బెదిరించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ గురువారం ఒక ఉత్తర్వు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డిఎ పెంచాలని బెంగాల్‌లో కొన్ని రోజుల నుంచి ఉద్యోగులు ఆందోళనలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల బడ్జెట్‌లో 3 శాతం పెంపు నిర్ణయాన్ని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. అయితే ఆందోళనకారులు తన తల తీసేసినా డిఎ పెంచేది లేదని మమతా బెనర్జీ స్పష్టం చేయడంపై ఉద్యోగులు మరింత ఆగ్రహంగా ఉన్నారు.

మహిళలను దూషించిన కర్ణాటక బిజెపి ఎంపి

బెంగళూరు : మహిళా దినోత్సవం రోజున ఓ మహిళపై కర్ణాటక బిజెపి ఎంపి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బొట్టు పెట్టుకోలేదంటూ ఓ మహిళను దూషించారు. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక బిజెపి నేత ఎస్ మునిస్వామి ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్న కోలార్‌లో మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా సేల్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఒక దుకాణం వద్ద వస్తువులను విక్రయిస్తున్న మహిళ నుదిటిపై బొట్టు లేకపోవడంతో ఎంపి బహిరంగంగా తిట్టారు. 'మొదట బొట్టు పెట్టుకోండి.. మీ భర్త బతికే ఉన్నాడు కదా..? మీకు ఇంగితజ్ఞానం లేదు' అంటూ నానా దుర్భాషలాడారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ గా మారింది.

మెడికల్ సీట్ల అమ్మకం కేసులో ఇడి సోదాలు

శ్రీనగర్ : పాకిస్థాన్‌లోని మెడికల్ సీట్లను జమ్ముకాశ్మీర్ విద్యార్థులకు విక్రయించారనే ఆరోపణలకు సంబంధించిన కేసులో గురువారం ఇడి సోదాలు నిర్వహించింది. హురియత్ నేతల నివాసాలతో పాటు మూడు ప్రదేశాల్లో సోదాలు జరిపినట్లు ఇడి అధికారులు తెలిపారు. అనంతనాగ్‌లోని ఖాజీ యాసిర్ నివాసం, శ్రీనగర్‌లో జమ్ముకాశ్మీర్ సాల్వేషన్ మూమెంట్ చైర్మన్ జఫర్ భట్, అనంత్‌నాగ్‌లోని మట్టాన్ ప్రాంతంలో ఉన్న మహమ్మద్ ఇక్బాల్ ఖాజా నివాసంలో ఈ సోదాలు జరిపారు. సోదాల్లో ఇడి అధికారులతో పాటు జమ్ముకాశ్మీర్ పోలీసులు కూడా పాల్గొన్నారు. పాకిస్థాన్‌లోని మెడికల్ సీట్లను జమ్ముకాశ్మీర్ విద్యార్థులకు విక్రయించడంతో వచ్చిన సొమ్ము ఉగ్రవాద నిధులకు, ఉగ్రవాద మద్దతుకు ఉపయోగించినట్లు ఇడి అధికారులు ఆరోపిస్తున్నారు.

తమిళనాడులో బిజెపికి ఎదురుదెబ్బ..

చెన్నై : తమిళనాడులో బిజెపికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఐటి విభాగానికి చెందిన 13 మంది ఆ పార్టీకి రాజీనామా చేశారు. తామంతా ఐటి విభాగం మాజీ చీఫ్ సి.టి.ఆర్. నిర్మల్ కుమార్ నాయకత్వంలో అన్నాడిఎంకెలో చేరుతున్నామని ఐటి విభాగం ప్రస్తుతం చీఫ్ ఓరతి అన్బరసు అన్నారు. గతవారం నిర్మల్‌కుమార్‌తో పాటు రాష్ట్ర బిజెపి కార్యదర్శి దిలిప్ కన్నన్, మరో నలుగురు నేతలు బిజెపికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో బిజెపి నాయకత్వం తమ కార్యకర్తల ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేస్తోందని ఓరతి అన్బరసు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా 'కళ్యాణ కర్ణాటక'కు నిధులు

బెంగళూరు : కర్ణాటకలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల ఘనంగా నిర్వహించిన కళ్యాణ కర్ణాటక ఉత్సవాలకు నిబంధనలకు విరుద్ధంగా నిధులు మంజూరు చేసినట్లు వెల్లడయింది. కలబురగిలో ఫిబ్రవరి 24 నుంచి మూడు రోజుల పాటు జరిగిన కళ్యాణ కర్ణాటక ఉత్సవాలకు ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, ఇతర మంత్రులు హాజరయ్యారు. ఈ ఉత్సవాల కోసం ప్రభుత్వ నిధుల నుంచి వచ్చిన వడ్డీలకు చెందిన రూ. 4 కోట్లను విడుదల చేశారు. ఈ విధంగా చేయడం గతంలో ఆర్థిక శాఖ జారీ చేసిన నిబంధనలను ఉల్లంఘించడమేనని ప్రణాళిక విభాగం తాజాగా అభ్యంతరం తెలిపింది. దీనిపై వివరణ ఇవ్వాలని కళ్యాణ కర్ణాటక రీజియన్ డెవలప్‌మెంట్ బోర్డు (కెకెఆర్‌డిబి)ను ప్రణాళిక, గణాంకాల శాఖ కోరింది. కెకెఆర్‌డిబి ఆధ్వర్యంలోనే ఈ ఉత్సవాలు జరిగాయి. ప్రభుత్వ నిధులను ప్రాజెక్టులు లేదా పథకాల కోసం ఖర్చు చేయాల్సి ఉండగా, ఉత్సవాలుపై వ్యయం చేయడమే అభ్యంతరం వ్యక్తం చేసింది. 2019లో ఆర్థిక శాఖ జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం ప్రభుత్వ నిధులపై వచ్చే వడ్డీను ఆమోదం తరువాతే బదిలీ చేయాలి.

పదవీ విరమణ పెంపునకు ఫ్రాన్స్ సెనేటర్లు ఓటు

పారిస్ : పదవీవిరమణకు చట్టబద్ధమైన వయస్సును 62 నుంచి 64 ఏళ్లకు పెంచడానికి అనుకూలంగా ఫ్రాన్స్ సెనేటర్లు గురువారం ఓటు వేశారు. దీనిని అధ్యక్షులు ఇమ్మాన్యుల్ మాక్రాన్ తీసుకుని వచ్చిన పెన్షన్ల సంస్కరణ ప్రణాళికకు దక్కిన తొలి విజయంగా భావిస్తున్నారు. ఈ ప్రణాళికకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగుతున్నాయి. అయినా ప్రభుత్వం ప్రణాళికపై ముందుకే వెళుతుంది. గురువారం జరిగిన ఓటింగ్‌లో పదవీ విరమణ వయస్సు పెంపునకు అనుకూలంగా 201 మంది సెనేటర్లు ఓటు వేయగా, వ్యతిరేకంగా 115 మంది సెనేటర్లు ఓటు వేశారు. సెనేటర్ల ఆమోదంతో ఈ వారంలోనే ఫ్రాన్స్ ఎగువ సభ కూడా దీనిని ఆమోదించే అవకాశం ఉంది.

సిసోడియా మళ్లీ అరెస్టు

- ఈ దఫా ఇడి వంతు
- బెయిల్ పై విచారణ దశలో అరెస్టుపై అనుమానాలు

న్యూఢిల్లీ : మద్యం కుంభకోణం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) అరెస్టు చేయడంతో ఇప్పటికే జైలులో ఉంటున్న ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా మరోమారు అరెస్టు అయ్యారు. ఈ దఫా మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆయనను అరెస్టు చేసింది. సిసోడియా ప్రస్తుతం తీహార్ జైలులో ఉంటున్న సంగతి తెలిసిందే. ఆయనకు బెయిల్ మంజూరు విషయంలో శుక్రవారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో వాదనలు జరగనున్నాయి. ఈ తరుణంలో ఇడి ఆయనను అరెస్టు చేయడం గమనార్హం. గత రెండు రోజులుగా తిహార్ జైలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిలో సిసోడియాను ప్రశ్నించిన ఇడి అధికారులు.. తాజాగా ఆయనను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. శుక్రవారం ఉదయం ఆయనను కోర్టులో హాజరపర్చనున్నట్లు తెలిపారు.

మద్యం కుంభకోణం కేసులో ఫిబ్రవరి 26న సిబిఐ అరెస్టు చేసిన తర్వాత బెయిల్ కోసం సిసోడియా తొలుత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అయితే, పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. పిటిషన్‌దారుకి ట్రయల్ కోర్టు, ఢిల్లీ హైకోర్టుల నుంచి రక్షణ పొందే వీలుండగా నేరుగా సుప్రీంకోర్టుకు రావడమేంటని ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో ఆయన బెయిల్ కోసం ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ.. రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మార్చి 4న దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం వాదనలను శుక్రవారానికి వాయిదా వేసింది. బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరగాల్సిన తరుణంలో మరో దర్యాప్తు సంస్థ ఆయనను అరెస్టు చేయడం కక్షపూరిత చర్యగా బిజెపేతర పక్షాల నేతలు విమర్శించారు.

కేసు నేపథ్యమిది..

ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా 2022 జులై 20న కేంద్ర హెూంశాఖకు లేఖ రాయడంతో ఈ కుంభకోణాన్ని కేంద్రం తెరపైకి తీసుకొచ్చింది. దాన్ని పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు జరపాలని ఆదేశిస్తూ హెూంశాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబిఐ అవినీతి నిరోధక విభాగానికి లేఖరాయడంతో సిబిఐ కేసు నమోదు చేసి ఎఫ్‌ఐఆర్‌లో ఏ1గా సిసోడియా పేరును చేర్చింది. సమాంతరంగా ఇదే కేసును దర్యాప్తు చేస్తున్న ఇడి ఇప్పటి వరకు సమీర్ మహేంద్రు, విజయ్‌నాయర్, పి.శరత్‌చంద్రారెడ్డి, బినయ్‌బాబు, అభిషేక్ బోయిన్‌పల్లి, అమిత్ అరోడా, మాగుంట రాఘవరెడ్డిలను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

సిసోడియాను ఇడి అందుకే అరెస్టు చేసింది : కేజ్రీవాల్

మనీశ్ సిసోడియాను ఇడి అరెస్టు చేయడంపై ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సిఎం అర్వింద్ కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. 'మనీశ్‌ను తొలుత సిబిఐ అరెస్టు చేసింది. సిబిఐకి ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఎక్కడా వారికి డబ్బు దొరకలేదు. శుక్రవారం మనీశ్ బెయిల్ పిటిషన్ విచారణ ఉంది. ఆయన రేపు విడుదలయ్యేవారు. అందువల్ల మళ్లీ సిసోడియాను ఇడి ద్వారా అరెస్టు చేయించారు. వాళ్ల లక్ష్యమంతా ఒక్కటే.. ఎట్టిపరిస్థితుల్లో మనీశ్‌ను లోపలే ఉంచడం. రోజుకో కొత్త నకిలీ కేసును సష్టిస్తుండటం ప్రజలు చూస్తున్నారు. సమాధానం చెబుతారు' అని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.

'తిప్రాల్యాండ్'కు బిజెపి మద్దతు ఇవ్వదు

- త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా

అగర్తల : తిప్రాలాండ్ లేదా గ్రేటర్ తిప్రాల్యాండ్‌కు బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ఎప్పటికీ మద్దతు ఇవ్వదని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా గురువారం వెల్లడించారు. అగర్తలలో కేంద్ర మంత్రి అమిత్ షా, తిప్రా మోత అధ్యక్షులు ప్రద్యోత్ కిషోర్ దేవ్‌వర్మ మధ్య అత్యున్నత స్థాయి సమావేశం జరిగిన ఒకరోజు తరువాత మాణిక్ సాహా ఈ విషయాన్ని వెల్లడించడం గమనార్హం. తిప్రాలాండ్ డిమాండ్‌తో ఇటీవల జరిగిన త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన తిప్రా మోత పార్టీ 13 స్థానాలు సాధించి రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. 'సమావేశంలో ఆదివాసీల సామాజిక-ఆర్థిక స్థితిగతులను ఎలా మెరుగుపరచాలనే దానిపైనే చర్చించాం. ఈ సమావేశంలో మధ్యవర్తి నియామకంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు' అని సాహా చెప్పారు. అమిత్‌షాతో సమావేశం ముగిసినవెంటనే ఆదివాసీల సమస్యలను పరిష్కరించేందుకు ఒక మధ్యవర్తిని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుందని ప్రద్యోత్ కిషోర్ దేవ్‌వర్మ చెప్పాగా, దానికి విరుద్ధంగా మాణిక్ సాహా మాట్లాడారు. అలాగే తమ మొదటి క్యాబినెట్ సమావేశంలో ప్రొటెం స్పీకర్‌గా బినోయ్ భూషణ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ — **డిమాండ్ నోటీసు**

రిజిస్టర్డ్ ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సాయిదా పేట, చెన్నై-600015, ఇండియా.
రీజినల్ ఆఫీస్: హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 54-20-10/ఎ, ప్లాట్ నం.43, 3వ అంతస్తు, ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురు, మెయిన్ రోడ్డు, గురునానక్ కాలనీ, విజయవాడ-520 008. www.hindujahousingfinance.com

దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు హామీదారుల మీ స్థిరాస్తులను తాకట్టుపెట్టుట ద్వారా హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నుండి గృహ రుణాలు/ఆస్తి సదుపాయంపై రుణం పొందారు. వాటిని తిరిగి చెల్లించుటలో డిఫాల్టిచెందారు.మీ రుణాలు నాన్ పెర్ఫామింగ్ అసెట్స్‌గా వర్గీకరించబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ మరియు ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 అమలులోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీచేసింది. చివరిగా తెలిసిన చిరునామాలకు బకాయిల రికవరీ కోసం నోటీసులు పంపబడినవి అయితే అవి తిరిగి ఇవ్వబడలేదు. అందులో ఉన్న సమాచారం ఏమంటే మీపై కంటెంట్ రూపేనా ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1)తో చదువబడే సెక్షన్ 13 (2) ప్రకారం మీకు ప్రత్యామ్నాయ సేవ ద్వారా ఇక్కడ ప్రచురించబడుచున్నది. రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, హామీదారులు, సెక్యూరిటీలు, బకాయి మొత్తం, సెక్షన్ 13(2) కింద పంపిన డిమాండ్ నోటీసు మరియు క్లయిమ్ చేయబడిన మొత్తం వివరలు ఈ క్రింది విధంగా ఇవ్వబడ్డాయి.

క్ర. సం	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/హామీదారులు యొక్క పేర్లు/ఎల్‌ఎఎన్/లోన్ మొత్తం/శాఖ	ఎన్‌పిఎ తేది	డిమాండ్ నోటీసు తేది & బాకీపడిన మొత్తం
1	శ్రీ. శివనాగరాజు ఆరేపల్లి, 2. శ్రీ. శిరీష ఆరేపల్లి, ఎల్ఎఎన్ నెం. AP/VWD/ BENZ/A000000462 మరియు AP/VWD/VJDA/ A000000213, రూ. 40,00,000/- + రూ.2,06,300/- = రూ.42,06,300/- (నలభై రెండు లక్షల ఆరు వేల మూడు వందల రూపాయలు మాత్రమే) ఇరువురి నివాసం: ఫ్లాట్ నం.102, ఆదిత్య ఎన్‌క్లేవ్, అంకిరెడ్డిపాలెం రోడ్డు, చల్లావారిపాలెం, గుంటూరు, ఎ.పి.-522005.	31-12-2022	28.01.2023 రూ॥ 43,21,952/- (నలభై మూడు లక్షల ఇరవై ఒక వేల తొమ్మిది వందల యాభై రెండు రూపాయలు మాత్రమే) 28.01.2023 నాటికి దానిపై వడ్డీ తో సహా.
	వడ్డీ సృష్టించబడిన దానికి సంబంధించి సెక్యూర్డ్ అసెట్స్ వివరణ: గుంటూరు జిల్లా, నల్లపాడు గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ లక్ష్మీ దీపిక అపార్ట్‌మెంట్ గా పిలువబడే భవనం యొక్క 1వ అంతస్తులో ఫ్లాట్ నం.205 కొలిచే 1120 చ.అడుగులు. తో కలిపి స్థలం యొక్క అవిభక్త వాటా 49.33 చ.అడుగులు. బేరింగ్ డో.నం.438 మరియు క్రింది విధమైన హద్దులు: తూర్పు: ఉమ్మడి పాసేజ్ కొంత వరకు మరియు సిహెచ్. వసుంధరదేవి కి చెందిన ఆస్తి కొంత వరకు, దక్షిణం: చల్లా మల్లికార్జునరెడ్డి కి చెందిన ఆస్తి, పడమర: చల్లా మల్లికార్జునరెడ్డి, ఉత్తరం: ఎమ్.సదాశివరెడ్డి కి చెందిన ఆస్తి, ఫ్లాట్ యొక్క సరిహద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: కామన్ కారిడార్, పడమర: తోట్లాట్, ఉత్తరం: ఓపెన్ టు స్కై.		

పైన పేర్కొన్న రుణగ్రహీతలు యు/ఎస్ 13(2) నోటీసు జారీ చేసిన తేది నుండి 60 రోజుల లోపు బకాయిల చెల్లింపులు చేయాలని సూచించారు. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002, యు/ఎస్ 13(2) పైన పేర్కొన్న నిబంధనల ప్రకారం విఫలమైతే నోటీసు జారీ చేసిన తేది నుండి 60 రోజుల గడువు ముగిసిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోబడతాయి.

తేది: 10.03.2023, పదేశం: విజయవాడ. సం/- ఆధీకృత అధికారి హిందూజా హైసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

ADITYA BIRLA CAPITAL
ఆర్థిక పెట్టుబడుల రక్షిత సలహా
ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు: ఇండియన్ రాయన్ కాంపౌండు, వేరవల్, గుజరాత్ 362266.
బ్రాంచి ఆఫీసు: ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నం.40-2-5ఎ, సి.వి.ఆర్ చాంబర్, 6వ అంతస్తు, కళానికేతన్ ప్రక్కన, ఎం.జి.రోడ్, విజయవాడ-520010.
1ఎబిహెచ్‌ఎఫ్‌ఎల్: అధీకృత అధికారి, శ్రీ రవి కుమార్ యాదవ్, సంప్రదించాల్సిన నం.7899965229, శ్రీ. దినేష్ ఆర్, సంప్రదించాల్సిన నం.-9940544482 మరియు చిరాగ్ లోఖండే సంప్రదించాల్సిన నం.9773758208
2. వేలం సర్వీస్ ప్రొవైడర్ (ఏఎస్‌పి) మెసర్స్ ఇ-ప్రొక్యూర్మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్-వేలం టైగర్, శ్రీ రాం శర్మ; సంప్రదించాల్సిన నం.+91 8000023297.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద, స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (సర్ఫేసీ) యొక్క సెక్షన్ 13(2) కింద ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి/సెక్యూర్డ్ క్రెడిటార్ జారీ చేసిన నోటీసుకు అనుగుణంగా కింది సెక్యూర్డ్ అసెట్స్‌ని స్వాధీనం చేసుకున్నారు. సెక్యూర్డ్ క్రెడిటార్ కు ఉన్న బకాయి తదుపరి చార్జీలు మరియు దానిపై వ్యయాలతో రికవరీ కొరకు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సహ రుణగ్రహీతలు ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ బకాయి పడిన అప్పుల యొక్క రియలైజేషన్ కొరకు రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది సురక్షిత అప్పులు "ఏది ఎక్కడ ఎలా ఉన్నది అది అక్కడ అలాగే" ప్రాతిపదికన క్రింద వివరించిన ఆస్తిని ఇ-వేలం ద్వారా అమ్మకానికి పెట్టబడుతుంది

క్ర. సం	రుణగ్రహీత(లు)/ సహ రుణగ్రహీత(లు)	ఆస్తులు/సెక్యూర్డ్ అసెట్స్ యొక్క వివరణ	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం	రిజర్వు ధర (ఆర్‌పి)	ఇఎమ్‌డి	చివరి ఇఎమ్‌డి తేది	తనిఖీ తేది మరియు సమయం	ఇ-వేలం యొక్క తేది
1.	శ్రీ. రామకృష్ణ కుటాడ మరియు శ్రీమతి. సుజాత కుటాడ.	కృష్ణాజిల్లా, మైలవరం సబ్ రిజిస్ట్రీ, గ్రామ పంచాయతీ మరియు మండలం, మైలవరం గ్రామం వద్ద ఉన్న సైట్ యొక్క విస్తీర్ణం 197 చ.గజాలు. తో ఆర్.ఎస్.నం.166/1లో దానిపై ఆర్‌సిసి రూఫ్ నిర్మాణాలు, డో.నం.8-97, మూల్యాంకనం నం.1500, ఉన్న హద్దులు: ఉత్తరం: వేముల నరసింహ సైట్, దక్షిణం: పోరంబోక (కెనాల్), తూర్పు: వేముల నాగేశ్వరరావు యొక్క సైట్, పడమర: పంచాయతీ బజార్.	రూ.41,01,377.14/- (నలభై ఒక లక్షా ఒక వేల మూడు వందల డెభై ఏడు రూపాయల పద్నాలుగు పైసలు మాత్రమే) 12.05.2021 నాటికి మరియు తదుపరి వడ్డీ మరియు రియలైజేషన్ తేది వరకు దానిపై ఇతర ఖర్చులు.	రూ.21,22,431/- (ఇరవై ఒక లక్షా ఇరవై రెండు వేల నాలుగు వందల ముప్పై ఒక రూపాయలు మాత్రమే)	రూ.2,12,243.10/- (రెండు లక్షల పన్నెండు వేల రెండు వందల నలభై మూడు రూపాయల పది పైసలు మాత్రమే)	28-03-2023.	27-03-2023 between 11:00 am to 04:00 pm	29-03-2023
2.	శ్రీ. శేషగిరి బాబు బడుగు, శ్రీమతి. ఉష బడుగు మరియు జి.ఆర్. కలర్ స్టూడియో	కృష్ణాజిల్లా, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ జిల్లా రిజిస్ట్రార్ (తూర్పు), నాగర పంచాయతి, ఉయ్యూరు మండలం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ 'రామ్ ఎన్‌క్లేవ్' 3వ అంతస్తు లో ఫ్లాట్ నం.403, తో 1154 చ.అడుగులు. ప్లింత్ ఏరియా తో కామన్ ఏరియా మరియు పార్కింగ్ ఏరియాతో కలిసి 44 చ.గజాలు. లేదా 36.78 చ.మీటర్లు. మొత్తం నుండి బయటకు 1066.66 చ.గజాలు. తో ఆర్.ఎస్.నం.648, 933, 649లో కుదించబడిన అన్నీ సౌలభ్యాలు, బేరింగ్ ప్లాట్ నం.లు.139, 140,145 మరియు 146 మరియు ఫ్లాట్ హద్దులు: ఉత్తరం: లిఫ్ట్ మరియు ఓపెన్ టు స్కై, దక్షిణం: మెట్లకేస్ మరియు ఓపెన్ టు స్కై, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: కామన్ కారిడార్.	రూ.43,45,975.95/- (నలభై మూడు లక్షల నలభై ఐదు వేల తొమ్మిది వందల డెభై ఐదు రూపాయల తొంభై ఐదు పైసలు మాత్రమే) 22.11.2021 నాటికి మరియు తదుపరి వడ్డీ మరియు రియలైజేషన్ తేది వరకు దానిపై ఇతర ఖర్చులు.	రూ.23,49,625/- (ఇరవై మూడు లక్షల నలభై తొమ్మిది వేల ఆరు వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే)	రూ.2,34,962.53/- (రెండు లక్షల ముప్పై నాలుగు వేల తొమ్మిది వందల అరవై రెండు రూపాయల యాభై మూడు పైసలు మాత్రమే)	28-03-2023.	27-03-2023 between 11:00 am to 04:00 pm	29-03-2023

అమ్మకం యొక్క వివరణాత్మక నియమ& నిబంధనల కొరకు, దయచేసి ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్/సెక్యూర్డ్ క్రెడిటార్ సూచించిన వెబ్‌సైట్ అనగా., https://homefinance.adityabirlacapital.com-ఆస్తుల-కొరకు-వేలం-క్రింద -సర్ఫేసీ యాక్ట్ లేదా https://sarfaesi.auctiontiger.net లో ఇవ్వబడిన లింకును పరిశీలించండి.

తేది: 10.03.2023,
ప్రదేశం: విజయవాడ

ఆధీకృత అధికారి,
ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

చిన్నారి

మీకోసం

రాత్రి పూట ముఖానికి పాల మీగడ కొంచెం రాసుకుని, ఉదయాన్నే చల్లటి నీటితో కడుక్కుంటే ముడతలు, మచ్చలు పోయి నునుపుగా మారుతుంది.

జీవన సౌరభం

మనల్ని మనం ఎప్పుడైతే ప్రేమించుకుంటామో...అప్పుడే ఎదుటివారిని అర్థం చేసుకోగలుగుతాం.

గాంధీమార్గం

రాజు, రాణి నేస్తాలు!
పనిలో కలిపిరి హస్తాలు!

మొక్క మొక్క నాటారు
పచ్చదనాన్ని పెంచారు
చేయి చేయి కలిపారు
వీధులు శుభ్రం చేసారు

పనిలో ఉన్న బాలలను
విధిగా బడిలో చేర్చారు
చిట్టిగురువులుగా మారి
అక్షరాస్యతను పెంచారు !

పేదరికం అవిద్య పై
సతతము పోరు చేసారు
గ్రామాలన్నీ ప్రగతి చెందుటకు
గాంధీమార్గం శరణన్నారు!

– రావిపల్లి వాసుదేవరావు
94417 13136



చుక్కలు కలపండి

చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ

- నిఖిత్ తార,
4వ తరగతి,
నారాయణ స్కూలు, సత్తెనపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఫిట్‌నెస్ ట్రైనర్ అంటే టక్కున గుర్తుకొచ్చేది మగవాళ్లే. వాళ్లయితేనే వ్యాయామంలో బాగా శిక్షణ ఇస్తారనుకుంటారు చాలా మంది. కాని ఆరిఫా బిలాల్‌ను చూస్తే ఆ అభిప్రాయం మార్చుకుంటారు. హైటెక్ మెషీన్స్‌తో కూడిన జిమ్‌ను నిర్వహిస్తున్న ఆమె కాశ్మీర్‌లో జిమ్ సెంటర్ నడిపేందుకు ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నారు. మొదట ఇద్దరితో మొదలైన సెంటర్ ఇప్పుడు వందల మంది మహిళలకు వ్యాయామ శిక్షణ ఇస్తోంది.

లేడీ ఫిట్‌నెస్ ట్రైనర్

కాశ్మీర్‌లో నివాసం ఉంటున్న మహిళలపై ఆంక్షలు, కట్టుబాట్లు చాలా కఠినంగా ఉంటాయి. బయటకు వెళ్లాలంటే తప్పనిసరిగా జుట్టు కనబడకుండా గుడ్డ కట్టాల్సిందే. బట్టలు నిండుగా వేసుకోవాలి. ఇటువంటి వాతావరణంలో ఉన్న మహిళలు ఉదయాన్నే వాకింగ్ చేయడానికే ఆలోచిస్తారు. అలాంటిది జిమ్ చేయడానికి అంటే ఇంట్లోవాళ్లు ఏమంటారో ఊహించక్కర్లేదు. ఇలాంటి పరిస్థితులు ఉన్న ప్రదేశంలోనే ఆరిఫా బిలాల్ ఆరేళ్ల క్రితం జిమ్ సెంటర్ స్థాపించింది. స్థానిక మహిళల వ్యక్తిగత ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుతూ, వ్యాయామాలు చేసేలా ప్రోత్సహిస్తోంది.

గందర్‌బాల్‌లోని బీహమా గ్రామ నివాసి అయిన ఆరిఫా జాతీయ పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి. జాతీయస్థాయిలో మూడు బంగారు పతకాలు సాధించిన మొదటి కాశ్మీరీ మహిళగా ఆరిఫాకు గుర్తింపు ఉంది. ఐరన్ లేడీగా ప్రశంసలూ అందుకుంది. ఆమె తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచి స్వేచ్ఛాయుతమైన జీవితాన్ని అందించారు. దాంతో చదువులోనూ, ఆటల్లోనూ తోటి పిల్లల కన్నా ముందుండేది. తల్లిదండ్రుల మద్దతుతో ఎన్నో విజయాలు సాధించింది. చిన్నప్పుడు ఆమె మగవాళ్ల జిమ్ సెంటర్‌కు వెళ్లి శిక్షణ తీసుకుంది. ప్రతిరోజూ తెల్లవారు జామున లేచి జిమ్ ట్రాక్ సూట్ పై ఫెరాన్‌ను ధరించి, తలకు గుడ్డ కట్టుకుని జిమ్‌కు వెళ్లేది. ఈ క్రమంలో ఆమె ఎన్నో ఇబ్బందులు, సవాళ్లూ ఎదుర్కొంది. సంప్రదాయ పద్ధతులకు విరుద్ధంగా నడుస్తున్నావంటూ హెచ్చరికలు వచ్చినా వెనక్కి తగ్గలేదు. దాంతో ఎప్పటికైనా మహిళల కోసం జిమ్ సెంటర్ స్థాపించాలని నిర్ణయించుకుంది. ఎన్ని సమస్యలు వచ్చినా పట్టు వదలకుండా బరువులు ఎత్తడం మానలేదు. అక్కడ ఆడపిల్లలకు ఎన్నో ఆశలు, కోరికలు ఉంటాయి. కాని బురక తీసి, అడుగు ముందుకేసినవారు చాలా తక్కువ. ఇటువంటి వారిలో మార్పు కోసం ప్రయత్నించింది ఆరిఫా. 'మహిళలు జిమ్ చేసేందుకు ముందుకు రారు' అని తెలిసి కూడా ఆరేళ్ల క్రితం జిమ్ సెంటర్ ఏర్పాటు చేసింది. ఎక్కువ ఖర్చుపెట్టి హైక్వాలిటీ మిషనరీ తెప్పించింది.

దాంతో కొంతమంది మగవాళ్లు 'మహిళలకు మాత్రమే జిమ్ సెంటర్ ఏంటి?' అంటూ ఆరిఫాతో వాదనకు దిగారు. అవేమీ పట్టించుకోకుండా ఆడవాళ్లు తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలని, అప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తన చుట్టూ ఉన్న మహిళలకు తరచూ చెబుతోంది. అప్పటి వరకూ ఇంటికే పరిమితి అయిన వారు ఆలోచించారు. ఆమె మాటల్లో వాస్తవాన్ని గ్రహించారు. కాని ఇంట్లో భర్తలకు, తండ్రికి తెలిస్తే ఏం చేస్తారోనన్న భయంతో సెంటర్‌కు వచ్చేందుకు సాహసం చేయలేదు. కాని పది మంది మాత్రం తనతో పాటు అడుగులు వేశారు. తనతో పాటు ఉదయాన్నే మూడు కి.మీ. నడిచి జిమ్ సెంటర్‌కు చేరుకుని వ్యాయామాలు చేసేవారు.

కరోనాతో మార్పు

ఆడవాళ్లు పొద్దునే లేచి ఇల్లు చక్కదిద్దుకోవాలి. వంట చేయాలి. బట్టలు ఉతకాలి. ఇటువంటి ఆలోచనా ధోరణే మగవాళ్లతో పాటు ఆడవాళ్లలోనూ ఉంది. కాని కరోనా తర్వాత పరిస్థితులు మారాయి. ప్రతిఒక్కరి ఆలోచనల్లోనూ మార్పు వచ్చింది. వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. మగవాళ్లతో పాటు ఆడవాళ్లు యోగా, వ్యాయామం చేస్తున్నారు. ఈ క్రమంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు జిమ్‌కు వస్తున్నారు. వారి వ్యక్తిగత అభిరుచులపై ఆసక్తి కనబరుస్తున్నారు. మహిళలు క్రీడలు, ఫిట్‌నెస్ శిక్షణ చేయకూడదు అనే ఆంక్షలను తొక్కిపెట్టారు. చదువుకుంటున్న అమ్మాయిలతో పాటు, పిల్లతల్లులు, వృద్ధులూ వస్తున్నారు. వీరిలో దీర్ఘకాలిక రోగాలు బిపి, షుగర్, థైరాయిడ్ ఉన్న వారే ఎక్కువ. వీరికి జిమ్ పరికరాలను, బరువు ఎలా ఉపయోగించాలో చెబుతోంది. వ్యాయామాలు, పుష్–అప్‌లు చేయిస్తోంది. దాంతో జిమ్‌కు వస్తున్న వారి సంఖ్య 200కి చేరింది. ఆరిఫా ఒక్కతే ట్రైనింగ్ ఇవ్వడం కష్టమవడంతో స్నేహితులైన మెహ్రీన్, రజియా చేత ఇప్పిస్తుంది. అంతేకాదు ఇప్పుడు శ్రీనగర్ డౌన్‌టౌన్‌లో మరో కొత్త జిమ్ సెంటర్ స్థాపించి అలియా మీర్ చేత ఎరోబిక్స్, జుంబా, డ్యాన్స్ వర్కౌట్‌లోనూ శిక్షణ ఇప్పిస్తోంది. కాశ్మీర్ మహిళల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తూ, వారి అభివృద్ధికి కృషి చేస్తున్న ఆరిఫాను అక్కడ వారంతా అభినందిస్తున్నారు.

బామ్మ ప్రపంచయాత్ర..

జీవితంలో ఎన్ని ఇబ్బందులెదురైనా కలలు సాకారం చేసుకునేవారు చాలా తక్కువమందే ఉంటారు. వారిలో ఒకరే ఈ బామ్మ. కేరళకు చెందిన 84 ఏళ్ల లలితాంబల్ కొన్ని నెలల ముందు తన కుటుంబంతో కలసి యూరప్ యాత్ర చేశారు. యుక్తవయసులో ఉండగా ప్రపంచాన్ని చుట్టేయాలని తెగ ఆశపడిన ఈ బామ్మ కుటుంబ, ఉద్యోగ బాధ్యతలతో క్షణం తీరికలేకుండా గడిపింది. అయినా పట్టుబట్టి తన కల నెరవేర్చుకుంది. ఈమె కోయంబత్తూర్‌లో 60 దశకంలో భూగోళశాస్త్రం, చరిత్ర ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ఇప్పుడు తన ప్రపంచయాత్ర అనుభవాలను ఇలా చెబుతోంది..:

'భయాలను విడిచిపెట్టండి.. జీవితంలో జరిగిన ప్రతి సంఘటనని ఒక అనుభవంగా పదిలపర్చుకోండి. ఈ అభ్యాసం మిమ్మల్ని జీవితంలో నమ్మకంగా ముందుకు సాగనిస్తుంది. ఇప్పటివరకు ఇండియా దాటి బయట కాలుపెట్టని నేను నెదర్లాండ్స్‌లో ఉంటున్న నా మనుమరాలు చొరవతో ఈ యాత్ర చేశాను. నా జీవితం చాలా సాధారణమైనది. నేనెప్పుడూ ఇంత పెద్ద యాత్ర చేస్తానని ఊహించలేదు. కాని నేను చూడాల్సింది చాలా ఉందని మాత్రం నమ్మేదాన్ని. యూరప్ యాత్ర చేయాలన్న నా కోరిక ఇప్పుడు తీరింది'

'అందరు ఆడవాళ్ల మాదిరే నేను కూడా కుటుంబ భవిష్యత్తు కోసం చాలా ఆలోచించేదాన్ని. అలా ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. ఎప్పుడైనా బయటి ప్రపంచాన్ని చూడగలనా అని చాలాసార్లు అనుకునేదాన్ని. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఎన్నో కలలు కంటారు. అవన్నీ తీరడంలో ఆర్థిక కష్టాలు, బాధ్యతల్లో నలిగిపోతూ ఉంటారు. కానీ సాధారణ జీవితాలు అనుభవించే వారు కూడా ఎన్నో విజయాలు సాధిస్తున్నారు. కాబట్టి కలలు కనడమే కాదు, వాటిని సాకారం చేసుకోవడంలో కూడా ఏమాత్రం వెనకడుగు వేయొద్దు.

వృద్ధాప్యంలో ఉన్న నేను ఆరు దశాబ్దాల తరువాత విదేశీగడ్డపై కాలుపెట్టాను. ఎన్నో అడ్డంకులు అధిగమించి ఈ యాత్ర చేశాను. గతేడాదే భర్త మరణించాడు. కోవిడ్ సమస్యలు చుట్టుముట్టాయి. అయినా ప్రపంచాన్ని చుట్టివచ్చాను.

విద్యార్థులకు పాఠాల్లో చెప్పిన ప్రదేశాలన్నీ స్వయంగా నా కళ్ల ముందు ప్రత్యక్షమైన అనుభూతిని ఇన్నాళ్లైనా మర్చిపోలేకపోతున్నాను. ఈ అనుభూతి నా ఒక్కదానిదే కాదు.. నా ప్రయాణానికి తమ శక్తికి మించి కృషి చేసిన నా కుటుంబానిది కూడా.. "

అంటూ సంబరపడిపోతున్న బామ్మ మాటలు స్ఫూర్తిదాయకం కదూ?

శంకర్ నిర్ణయమే ఫైనల్

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు శంకర్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం గురించి తెలిసిందే. వీరి ఇరువురి కెరీర్‌లో ఇది 15వ సినిమా. కాగా భారీ బడ్జెట్‌తో నిర్మాత దిల్ రాజు తమ బ్యానర్‌లో 50వ సినిమాగా ప్లాన్ చేస్తున్నారు. అయితే అనౌన్స్ చేసిన నాటి నుంచి ఈ సినిమా అప్‌డేట్ గురించి అభిమానులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమా ఎప్పుడు రిలీజ్ చేస్తారంటూ ప్రశ్నలు కురిపిస్తున్నారు. ఈ క్రమంలో దిల్ రాజు క్లారిటీ ఇచ్చారు. సినిమా దాదాపు డిసెంబర్ నాటికి చిత్రీకరణ పూర్తి అవుతుందని, దాంతో సంక్రాంతికి రిలీజ్ ప్లాన్‌లో ఉన్నామని చెప్పారు. కాని మెయిన్‌గా దర్శకుడు శంకర్ చేతిలోనే ఉందని క్లారిటీ ఇచ్చారు. శంకర్ ఎప్పటికి ఫిక్స్ చేస్తే అప్పుడే విడుదల చేస్తామన్నారు.

ఓటిటిలో 'వాల్తేరు వీరయ్య' సందడి

లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి, మాస్ మహారాజ రవితేజలు హీరోలుగా, శృతి హాసన్ కేథరిన్ ట్రెసా హీరోయిన్స్‌గా నటించిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. దర్శకుడు కొల్లి బాబీ తెరకెక్కించిన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. సంక్రాంతి కానుకగా విడుదల కాగా 70 కి పైగా సెంటర్స్‌లో అర్ధ శత దినోత్సవం జరుపుకుంది. ఇక దీనితో పాటుగా ఓటిటిలో కూడా విడుదలైంది. అక్కడా ఈ చిత్రం సత్తా చాటింది. లేటెస్ట్‌గా నెట్ ఫ్లిక్స్ వీక్లీ తమ టాప్ 10 సిరీస్‌లు, సినిమాల లిస్ట్‌ని విడుదల చేసింది. అందులో ఇండియా వైడ్‌గా వాల్తేరు వీరయ్య నెంబర్ 1 స్థానంలో ట్రెండింగ్‌లో ఉంది. ఇక ఈ సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే.

22న 'దాస్ కా ధమ్కీ'

హీరో విశ్వక్ సేన్ కొత్త చిత్రం 'దాస్ కా ధమ్కీ' విడుదల తేదీ ఖరారైంది. నివేదా పేతురాజ్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీని పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో మార్చి 22న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. లియోన్ జేమ్స్ సంగీతాన్ని అందించారు. కీలక పాత్రల్లో రావు రమేశ్, హైపర్ ఆది, రోహిణి, పృథ్వీరాజ్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటి వరకూ విడుదలైన ప్రచార చిత్రం, పాటలకు ప్రేక్షకులు ఆదరించారు. ఈ నేపథ్యంలో మూవీపై భారీ అంచనాలే నెలకొన్నాయి. వన్మయే క్రియేషన్స్, విశ్వక్సేన్ సినిమాస్ బ్యానర్ లో దీన్ని కరాటే రాజు నిర్మిస్తున్నారు. 'ఫలక్ నుమా దాస్' తర్వాత విశ్వక్ సేన్ దర్శకత్వం వహిస్తున్న రెండో సినిమా ఇది.

బాలీవుడ్ నటుడు సతీష్ కౌశిక్ మృతి

సీనియర్ నటుడు, దర్శకుడు సతీష్ కౌశిక్ (66) కన్నుమూశారు. హోలీ వేడుకల కోసం ఢిల్లీలో ఉన్న స్నేహితుడి ఇంటికి వెళ్లారు. చెందారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంట్లో బాగోలేదంటూ డ్రైవర్‌తో కలిసి కారులో ఆస్పత్రికి బయలు దేరిన ఆయన మార్గమధ్యంలోనే గుండెపోటుతో మృతి చెందినట్లు సన్నిహితులు వెల్లడించారు. ఆయన మరణంతో బీటౌన్‌లో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ క్రమంలో బాలీవుడ్ నటులు అనుపమ్ ఖేర్, అక్షయ్ కుమార్, కరీనా కపూర్, అజయ్ దేవ్‌గణ్, సునీల్ శెట్టి, సోనూ సూద్, అభిషేక్ బచ్చన్, కంగనా రనౌత్ వంటి సినీ తారలు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 'రూప్ కీ రాణీ చోరోన్ కా రాజా', 'ప్రేమ్', 'తేరే నామ్', 'షాదీ సే పెహ్లే' వంటి చిత్రాలకు సతీశ్ దర్శకత్వం వహించారు. 'ఉత్సవ్', 'సాగర్', 'మిస్టర్ ఇండియా', 'రాజాజీ', 'భాఘి 3' వంటి చిత్రాల్లో కీలకపాత్రలు పోషించి నటుడిగానూ మెప్పించారు. ప్రస్తుతం ఆయన 'ఎమెర్జన్సీ'లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ క్రమంలోనే హోలీ వేడుకల కోసం తన స్నేహితుడు జావేద్ అక్తర్ కుటుంబంతో కలిసి సందడిగా గడిపారు. ఆ ఫొటోలను ట్విటర్‌లో షేర్ చేశారు. ఇంతలోనే ఈ విషాదం చోటు చేసుకోవడం ఆయన ఆత్మీయులను దిగ్భ్రాంతికి గురి చేసింది.

కిరణ్ అబ్బవరం కొత్త చిత్రం

కిరణ్ అబ్బవరం కొత్తచిత్రంలో నటించబోతున్నాడు. ఈ చిత్రం ద్వారా విశ్వ కరుణ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. శివం సెల్యులాయిడ్స్ పతాకంపై ప్రొడక్షన్ నెంబర్–2గా ఒక సరికొత్త ప్రేమ కథా చిత్రం రూపొందనుంది. ఈ సినిమా పూజాకార్యక్రమాలు రామానాయుడు స్టూడియోస్‌లో జరిగింది. హీరో కిరణ్ అబ్బవరంపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వి.వి. వినాయక్ క్లాప్ కొట్టగా, ప్రముఖ నిర్మాతలు దగ్గుబాటి సురేష్ బాబు, ఎ. ఎం. రత్నం కెమెరా స్విచాన్ చేశారు. ఈ నెలలోనే సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ మూవీకి ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు సామ్ సి.ఎస్. స్వర రచన చేయబోతున్నాడు. ప్రస్తుతం కిరణ్ జ్యోతికృష్ణ దర్శకత్వంలో 'రూల్స్ రంజన్' చిత్రంలో నటిస్తున్నారు.

చెమటోడ్చిన బౌలర్లు

ఖవాజా సెంచరీ ఆస్ట్రేలియా 255/4

ఖవాజా 104(నాటౌట్)

అహ్మదాబాద్: బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా నరేంద్ర మోడీ స్టేడియంలో గురువారం నుంచి ప్రారంభమైన నాల్గో టెస్ట్‌లో భారత బౌలర్లు తేలిపోయారు. ఓపెనర్ ఖవాజా(104నాటౌట్) సెంచరీకి తోడు చివర్లో గ్రీన్(49నాటౌట్) కూడా బ్యాటింగ్‌లో మెరవడంతో ఆసీస్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 255పరుగులు చేసింది. బ్యాటర్లకు సహకరించిన ఈ పిచ్‌పై భారత బౌలర్లు వికెట్లు రాబట్టేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు ఓపెనర్లు ట్రెవిస్ హెడ్–ఉస్మాన్ ఖవాజా తొలి వికెట్‌కు 61పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ జోడీని రవిచంద్రన్ అశ్విన్ విడదీసాడు. వ్యక్తిగత స్కోర్ 32 పరుగుల వద్ద ట్రెవిస్ హెడ్(32)ను అశ్విన్ ఔట్ చేశాడు. దీంతో అశ్విన్ భారత్‌కు తొలి బ్రేక్‌ను అందించాడు. మరోవైపు షమీ ఓ గుడ్‌లెంగ్త్ బంతికి లబూషేన్‌ను బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియా జట్టు లంచ్‌లోపే రెండు వికెట్లు కోల్పోయి 75పరుగులు చేసింది. లంచ్–టీ విరామం లోపు భారత బౌలర్లు వికెట్లు రాబట్టేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. టీ విరామం వరకు ఆస్ట్రేలియా బ్యాటర్స్ మరో వికెట్ కోల్పోకుండా ఆచి తూచి ఆడారు. ఎక్కువభాగం డిఫెన్స్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో భారత బౌలర్లు మరో వికెట్ సాధించలేకపోయారు. దీంతో ఆస్ట్రేలియా జట్టు లంచ్ విరామ సమయానికి 62ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 149పరుగులే చేయగల్గింది. లంచ్ తర్వాత భారత బౌలర్లు కెప్టెన్ స్మిత్(32), హ్యాండ్‌కోంబ్(17) వికెట్లను పడగొట్టి ఆస్ట్రేలియాపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా సెంచరీ(104 నాటౌట్)తో జట్టును ఆదుకున్నాడు. ఓపికగా ఆడిన అతను భారత బౌలర్లకు పరీక్ష పెట్టాడు. చివర్లో ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్(49) కూడా బ్యాటింగ్‌లో రాణించడంతో ఆసీస్ మరో వికెట్ కోల్పోకుండా అడ్డుకున్నారు. షమీకి రెండు, అశ్విన్, జడేజాకు ఒక్కో వికెట్ దక్కాయి.

సిరీస్‌లో తొలి శతకం

మూడో టెస్టులో అర్ధ సెంచరీతో కీలక ఇన్నింగ్స్ ఆడిన ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా.. నాలుగో టెస్టులోనూ చెలరేగాడు. స్మిత్‌తో కలిసి మూడో వికెట్‌కు 79 జోడించిన ఖవాజా.. టీ విరామం ఆ తర్వాత గ్రీన్‌తో స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ సిరీస్‌లో శతకం బాదిన తొలి ఆస్ట్రేలియా క్రికెటర్‌గా ఖవాజా గుర్తింపు సాధించాడు. అంతేకాదు గత పదమూడేళ్లలో భారత్‌లో ఆడిన 12 టెస్టుల్లో సెంచరీ కొట్టిన ఆసీస్ మొదటి ఎడమచేతి వాటం ఆటగాడిగా ఖవాజా రికార్డు నెలకొల్పాడు.

స్కోర్‌బోర్డు..

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ట్రెవిస్ హెడ్ (సి)జడేజా (బి)అశ్విన్ 32, ఖవాజా (బ్యాటింగ్) 104, లబూషేన్ (బి)షమీ 3, స్మిత్ (బి)అశ్విన్ 38, హ్యాండ్‌కోంబ్ (బి)షమీ 17, గ్రీన్ (బ్యాటింగ్) 49, అదనం 12. (90 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 255పరుగులు. వికెట్ల పతనం: 1/61, 2/72, 3/151, 4/170 బౌలింగ్: షమీ 17–2–65–2, ఉమేశ్ యాదవ్ 15–2–58–0, అశ్విన్ 25–8–57–1, జడేజా 20–2–49–1, అక్షర్ పటేల్ 12–4–14–0, శ్రేయస్ 1–0–2–0

బంగ్లా సంచలనం

తొలి టి20లో ఇంగ్లండ్‌పై గెలుపు

చిట్టగాంగ్: మూడు టి20ల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ జట్టు సంచలనం విజయం సాధించింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 157పరుగుల లక్ష్యాన్ని కేవలం 18 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి ఛేదించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు ఓపెనర్లు సాల్ట్(38), కెప్టెన్ బట్లర్(67) తొలి వికెట్‌కు 80 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత మలాన్(4), మొయిన్(8), శ్యామ్ కర్రన్(6), వోక్స్(1) నిరాశపరచడంతో ఇంగ్లండ్ భారీ స్కోర్‌పై ఆశలు వదులుకుంది. దీంతో ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 6వికెట్లు కోల్పోయి 156పరుగులే చేయగల్గింది. మహ్మద్‌కు రెండు, నజుమ్, తస్కిన్, ముస్తఫిజుర్, షకీబ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో భాగంగా బంగ్లా ఓపెనర్లు లింటన్ దాస్(12), తాలుక్దార్(21) నిరాశపరిచినా.. నజ్ముల్(51; 30బంతుల్లో 8ఫోర్లు), షకీబ్(34నాటౌట్; 24బంతుల్లో 6ఫోర్లు) నిలకడగా ఆడి మ్యాచ్‌ను ముగించారు. దీంతో బంగ్లాదేశ్ జట్టు 18 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో మూడు టి20ల సిరీస్‌లో బంగ్లాదేశ్ 1–0 ఆధిక్యతలో ఉండగా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నజ్ముల్ హొసైన్‌కు లభించింది. రెండో టి20 ఢాకా వేదికగా ఆదివారం జరగనుంది.

ఏక్తా భయాన్ రికార్డు

ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత

దుబాయ్: భారత మహిళా పారా డిస్కస్ త్రోయర్ ఏక్తా భయాన్ రికార్డు ప్రదర్శనతో ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. దుబాయ్‌లో జరుగుతున్న పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో ఏక్తా.. మహిళల వీల్‌ఛైర్ డిస్కస్ త్రో(ఎఫ్–53)లో కాంస్య పతకం సాధించింది. ఈ టోర్నీలో మహిళల వీల్‌ఛైర్ డిస్కస్ త్రోలో భారత్‌కు పతకం దక్కడం ఇదే ప్రథమం. దీంతో గురువారంతో ముగిసిన పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో భారత్ 4రజత, 2కాంస్య పతకాలను సాధించింది. ఈ టోర్నీలో చైనా 102(42స్వర్ణాలు) అగ్రస్థానంలో నిలువగా.. ఉక్రెయిన్ 11 స్వర్ణాలతో, ఉజ్బెకిస్తాన్ 9బంగారు పతకాలతో టాప్–3లో నిలిచాయి. భారత్ 28వ స్థానంలో నిలిచింది.

ఆదుకున్న కుశాల్, కరుణరత్నే

శ్రీలంక 306/6

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలిటెస్ట్‌లో శ్రీలంక కెప్టెన్ కరుణరత్నే, కుశాల్ మెండిస్ అర్ధసెంచరీలతో రాణించడంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి 6వికెట్ల నష్టానికి 305పరుగులు చేసింది. చివర్లో ధనుంజయ(39), రజిత(16) ఆదుకోవడంతో శ్రీలంక జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 6వికెట్ల నష్టానికి 305పరుగులు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ ఫెర్నాండో(13) నిరాశపరిచినా.. కరుణరత్నే(50), కుశాల్ మెండిస్(87) కలిసి 2వ వికెట్‌కు 143 పరుగులు జతచేశారు. ఆ తర్వాత శ్రీలంక జట్టు మరో 2 వికెట్లను వెంట వెంటనే కోల్పోయింది. 151పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ లంకను సీనియర్ టెస్ట్ బ్యాటర్ మాథ్యూస్(47), ఛండీమాల్(39) ఆదుకున్నారు. ధనుంజయ, రజిత క్రీజ్‌లో ఉన్నారు. కెప్టెన్ సౌథీకి మూడు, హెన్రీకి రెండు, బ్రాస్‌వెల్‌కు ఒక వికెట్ దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68